
# మూసీ

# MUSI

◆ Samputi : 29 ◆ Sanchika : 02 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ December 2025

- ప్రకృతి చెక్కిన కవన శిల్పం
- అమృత ప్రాయుడు
- వైవిధ్య భాషా సమ్మిళితం - అందెశ్రీ గీతం
- పాటల పరిమళం - అందెశ్రీ
- పసుల కాపరి నుండి... ప్రజాకవిగా... అందెశ్రీ అసాధారణ జీవన ప్రస్థానం...
- మాయమై పోయినాడమ్మా - అందెశ్రీ
- మరణం కూడా మాట్లాడుతూనే ఉంది...




డిసెంబర్ 10
(93వ జయంతి)



కవి అందెశ్రీ స్మృతిలో...





వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**


# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 29 సంచిక : 2
డిసెంబర్ - 2025
'విశ్వావసు' మార్గశిర, పుష్య మాసాలు

**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక'**
**(MUSI Telugu Monthly Magazine)**
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
**email : editormusi@gmail.com**
**website : musimagazine.org**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**


## ఈ సంచికలో ...



ప్రకృతి చెక్కిన కవన శిల్పం - డా. అందెశ్రీ...
సుప్పని సత్యనారాయణ - 7
అమృత ప్రాయుడు - అందెశ్రీ ...
డా. అంబటి సురేంద్ర రాజు - 16
వైవిధ్య భాషా సమ్మిళితం - అందెశ్రీ గీతం ...
డా. పసునూరి రవీందర్ - 17
పాటల పరిమళం - అందెశ్రీ... తోట శారద - 20
లోకకవి, వాగ్గేయ కారుడు 'అందెశ్రీ' తత్త్వం ...
డా. బండారు సుజాతా శేఖర్ - 21
పసుల కాపరి నుండి ... ప్రజాకవిగా ... అందెశ్రీ అసాధారణ జీవన ప్రస్థానం ... డా. కోయి కోటేశ్వర రావు - 25
మాయమై పోయినాడమ్మా - అందెశ్రీ ... గిరిధర్ రావుల - 28
పాటల నెగడు - అందెశ్రీ 'నిప్పుల వాగు'...
ఎ. విజయ కుమార్ - 29
మరణం కూడా మాట్లాడుతూనే ఉంది ...
భూపతి వెంకటేశ్వర్లు - 35
యాస భాషలందు 'అందె' వేసిన చేయి ...
డా. తిరునగరి శరత్ చంద్ర - 37
తొలిపొద్దు గీతమై ... లోక సంగీతమై .. మల్లేపల్లి లక్ష్మయ్య .. 39
స్థల దు:ఖం జన దు:ఖం ఈ కవి చిరునామా ...
మెర్సీ మార్గరెట్ - 41
మనం అందెశ్రీని అర్థం చేసుకున్నామా? ...
మౌనశ్రీ మల్లిక్ - 43
అందెశ్రీ సంపాదకత్వంలోని 'నిప్పులవాగు' సమీక్ష..
డా. వెల్చాల కొండల రావు - 47
తెలంగాణ ఆత్మగీతాకారుడు - అందెశ్రీ ...
డా. ఎస్. రఘు - 49
నడిచే అగ్ని పర్వతం - అందెశ్రీ ... ఎం. విప్లవ కుమార్ - 51
ఆధ్మాత్మిక భావ వీచికలు 'ఆత్మానంద భజన కీర్తనలు' ...
సుప్పన సత్యనారాయణ - 53
మూసీ మాసపత్రిక - తెలుగు సాహిత్య ప్రవాహానికి సజీవ ప్రతిరూపం ... డా. ఇడికోజు శ్రీనివాసాచారి - 56
పరిశోధన + గ్రంథరచన + మార్గదర్శనం = ఆచార్య జి. అరుణకుమారి... డా. జడా సుబ్బారావు -58


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

***Printed, Published and Owned by :***
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**



# యశస్సు

శూరుల జన్మంబు, సురల జన్మంబు, ఏరుల జన్మంబు నెరుగనగునే... అనే పద్యం మహాభారతం తెలియజేస్తుంది. మహాత్ముల జన్మ ఎక్కడో, ఎప్పుడో, ఏమీ అర్థం కాదు. వారు కీర్తివంతులైనప్పుడు మాత్రం వారి గురించిన చర్చలన్నీ చేస్తూండడం సమాజ ధర్మం. శక్తివంతులైన వారు ఈ లోకానికి వచ్చినప్పుడు ప్రకృతి అనేక రూపాలుగా సహకరిస్తూ వస్తుంది. అప్పుడప్పుడు కష్టాలు, కన్నీళ్ళు ఇస్తుందని మనం భావిస్తూ వస్తున్నా .. అవన్నీ వ్యక్తిని ప్రకృతి తీర్చిదిద్దుతున్న విధానాలు అని ఆధ్యాత్మికత తెలియజేస్తుంది. ఇంకా ఇంకా శక్తివంతునిగా మార్చడం కోసం పరీక్షలు పెట్టడం తప్పదు కదా! స్థాయిని పెంచాలంటే కూడా కాలం, జ్ఞానం, పరీక్షలనే మూడు అంశాలు ఎప్పటికీ ఉంటూనే ఉంటాయి. ఈ మూడూ వ్యక్తి యొక్క స్థాయిని క్రమంగా పెంచుతుంటాయి. చదువుకునే స్కూల్ పరీక్షలు పాసై తర్వాతి స్థాయి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్తున్న విధం గానే, వ్యక్తి యొక్క ఆత్మిక శక్తిస్థాయిని పెంచడానికి ప్రకృతి కూడా అనేక పరీక్షలకు గురి చేస్తుంది. వానిని కాలానుగుణంగా, తగిన జ్ఞానంతో ఎదుర్కున్నవారే యశస్వులవుతారు.

ఒక శక్తివంతుని జననం అయినప్పటి నుండి వేరు వేరు సందర్భాల్లో మార్గాలు నిర్దేశించబడి ఉంటూనే ఉంటాయి. ఎవరెవరి చేత ఏమేమి పనులు చేయించాలో ఆ సమయంలో తెలియకుండానే సూచించబడుతుంది. తగిన గురువర్యులు దొరుకుతారు. మార్గం తెలియజేస్తారు. అవసరమైతే మరోవైపు మళ్ళిస్తారు. వారికి నిర్దేశించబడిన పనిని వారు పూర్తి చేస్తుంటారు. వారి జానపదులై పాటలు పాడేవారైనా, జ్ఞానపథులై సృష్టి రహస్యాలను అర్థం చేసుకునేవారైనా... వారి వారి శక్తిని అనుసరించి మార్గదర్శనం దొరుకుతూనే ఉంటుంది. ఇవన్నీ తమ ప్రయత్నాలే అనుకునేంత అజ్ఞానపు జన సమూహం కూడా తమ చుట్టూ ఉంచడం సహజం.

మనిషికి మార్గదర్శనం లభించాలంటే కేవలం తమ శక్తిని పెంచుకుంటూ పోవడమే మార్గం. పెరుగుతున్న శక్తిని అనుసరించి, ఆ స్థాయిలోని వ్యక్తులు, శక్తులు పరిచయం అవుతూ ఉంటారు. లోక వ్యవహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత శక్తి పెంచుకుంటూ పోవచ్చు అనేది ఆత్మిక మార్గం. ఆ మార్గగాములు ఎందరో ఉన్నారు. అయితే తమ శక్తిని, జ్ఞానాన్ని పెంచుకుని మళ్ళీ జన జీవనంలోకి వచ్చి వారిని సంస్కరించే ప్రయత్నం చేస్తూ ఉంటారు. కొందరు తామున్న ప్రదేశాల నుండే శక్తి ప్రసారం చేస్తూ ఉంటారు. ఇవన్నీ సాధారణమైన దృష్టికి అర్థం కాదు అనేది ఆత్మిక స్థాయివారి భావన. యశస్సు అందరికీ సాధారణంగా లభించదు. ఈ శక్తివంతులకే లభిస్తుంది. వారే శ్రేష్టులుగా సమాజంలో గుర్తింపు పొందుతారు. తమ శరీరం తర్వాత తాము శరీరం ఉన్నప్పుడు తమతో చేయించబడిన పనుల ద్వారా గుర్తింపబడి యశ:కాయాన్ని పొందేవారే అసలైన యోగజీవులు. అందరూ కీర్తికాయులు కాలేరు. ఆ శక్తిని వారు సముపార్జించుకుంటేనే అది సాధ్యం అవుతుంది.

డా. అందెశ్రీ చాలాకాలంగా మూసీ కుటుంబానికి సుపరిచితుడు. బి.ఎన్.శాస్త్రిగారికి చాలా ఇష్టమైనవాడు. తమ ఆనంద విషాదాలను పంచుకోవడానికి వచ్చి ఎన్నో పాటలు పాడేవాడు. అప్పటినుండి వారిని పరిశీలిస్తున్న క్రమంలో అత్యంత ఆప్తున్ని కోల్పోయిన భావనతో వారిపై ప్రత్యేక సంచిక వేయాలని మూసీ నిర్ణయించింది. వ్యాసాలను కొన్ని రాయించింది. మరికొన్నింటిని సేకరించింది. సేకరించిన సంస్థలందరికీ, వారి సౌజన్యానికీ, వ్యాస రచయితలకు ధన్యవాదాలు. అందెశ్రీ అజరామరత్వానికి, వారి ఆపాత మాధుర్యానికి, ఉద్యమగీతికి, శాశ్వతత్వానికి శ్రద్ధాంజలి.






# ... వాక్కులమ్మ!!

వాగ్దేవి నీ చూపు వసుధ నాపై నుండ
కవితకేమి కొదవ కన్న తల్లీ!
కావ్యమాలగ నీదు కంఠాన తరియింప
కవిత వుప్పొంగదా కల్పవల్లి!
సంగీత సాహిత్య సౌరభాలను చాట
పరుగెత్తు నా పాట ప్రజల నోట
సహజంగ వర్షించు సలలితంబుగ నాలొ
సాహితీ విలువల సాక్షిగాను
కవిత నే రాయ చేజాచి కాసులడగ
సిరులకెప్పుడు నిన్నమ్మ సిగ్గుమాలి
మట్టి మోసైన బ్రతుకిలా నెట్టుకుందు
వసుధ వినిపించు నామాట వాక్కులమ్మ!!

బ్రహ్మ యిల్లాలువా! భారతవాణివా!
కాదమ్మ తరికిచ కవన జగతి
అక్షరము నీరూపు అని సృష్టి కనుచూపు
అజరామరము నీవు అవని చదువ
ఆకారముగ లోక సాకారమై నీవు
ప్రాణిలో పరుగిడు ప్రణవరూపీ
తేనీయలను చిందు తెలుగు భాషే కాదు
ఎల్లభాషల కెల్ల తల్లివీవు
కడుపు పంటగ కవులను గన్నతల్లి
కవిత గుడిలోన వెలుగొందు కల్పవల్లి
కోటిభావాల కొనగోట మీటి నోట
వసుధ వినిపించు నామాట వాక్కులమ్మ!!

**(డా. అందెశ్రీ 'శ్రీవాక్కులమ్మ త్రిశతి' నుండి)**

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం – (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు–మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4–5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు–మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ స్థలం, ప్రచురణసంస్థ) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు – రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

ఇదే రీతి భక్తి ప్రీతి నాకు దేవా
ఇదే రీతి భజన సుఖము నిచ్చే రాయ
కన్నుల నిండిపోయినావయ్యా
సంసారపు మాయ
సమాప్తమయ్యేనయ్యా

ధ్యానము నీ మీద నిలిపి
ధ్యాస దాస విముక్తిని పొంది
కమల నయన సోయగంబులో
చిత్త చాంచల్యము వీడి
నీ దాసుడైతినయ్యా
నా నీడ నువ్వయా

సుఖ దు:ఖాల క్రీడ వీడి
నీ చెంత చేరి వచ్చితి
సంసార చెరను త్రుంచి
చెయ్యందించవయ్యా
భారమంతా వేసి నీపై
నిశ్చింత నయితి నయ్యా!

తుకా విఠలు నీడ జాడ
తావులుండునయ్యా
అనాథ పతి నా స్వామి
కరుణ జూపవయ్యా
అంత:బింబ ఆత్మారామ
నాయందు నిలువవయ్యా



అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్

ఫోన్ : 83283 33720

# ప్రకృతి చెక్కిన కవన శిల్పం – డా. అందెశ్రీ

✍ **సుప్పని సత్యనారాయణ,** తెలుగు అధ్యాపకులు, కామారెడ్డి జిల్లా. ఫోన్ : 9492626910

అనాది నుండి సకల కళలకు, జవసత్వాలకు పురిటిగడ్డ ఈ తెలంగాణ నేల. ఇక్కడి ప్రతి అణువణువులో ఏదో తెలియని మహత్తు ఉంటుంది. అందువలననే సంగీత, సాహిత్య, సామాజిక, సంప్రదాయ, రాజకీయ భావాలకు ఎప్పుడూ కొదువ లేదు. ఎందరో మహనీయులు ఉత్తమ ప్రతిభా పాటవాలతో వారు తరించడమే కాదు, ఈ నేలను కూడా తరింపజేసి పునీతులయ్యారు. అది మౌఖిక కళా ప్రదర్శన కావచ్చు, లిఖిత సాహిత్య వైభవమూ కావచ్చు. అందులో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానికి ముందు కొంత సాహితీ కళా సంపద లభ్యమైనప్పటికీ, అది పరాయి పాలన విధానం వల్ల విధ్వంసానికి గురి అయింది. తదనంతర కాలంలో జూన్ 2, 2014 న రాష్ట్ర అవతరణ అనంతరం మళ్లీ తెలంగాణ పునర్నిర్మాణ యుగంలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై, ముందుకు వెళ్లే దిశగా జాగృతి పదం వైపు అడుగులు వేస్తోంది. ఇది శుభసూచకం.

ఇలాంటి తరుణంలో ఈ నేల అస్తిత్వాలను చాటే విషయంలో ఎందరో కవులు, కళాకారులు, ముఖ్యంగా తొలి తరం వాగ్గేయకారుల నుంచి నీటి కళాభిపాసుల వరకు తమ కళా ప్రదర్శన ద్వారా ఇక్కడి ఉనికిని చాటి చెప్పడానికి అహర్నిశలు కృషి చేశారు. చేస్తూనే ఉన్నారనేది జగమెరిగిన సత్యం. వారి ప్రతిభ పాటవాల వలన జనజాగృతమే కాదు, సామాజిక చైతన్యం కూడా జరిగింది. ఆ దిశగా ఒకసారి పర్యవేక్షణ చేపట్టినట్టయితే.. తెలంగాణ తొలితరం వాగ్గేయకారులు, భక్త రామదాసు, తూము లక్ష్మీనరసింహదాసు, రాకమచర్ల వెంకటదాసు, మన్నెంకొండ హనుమద్దాసు, దున్న ఇద్దాసు, వేపూరు హనుమద్దాసు, ఉప్పరిపల్లి కృష్ణ దాసు, ఆధునికుల్లో ఈగబుచ్చిదాసు, సుద్దాల హనుమంతు, పనస హనుమద్దాసు... (ఈ పరంపరలో మరి కొంతమంది) వంటి ప్రసిద్ధ వాగ్గేయకారులు సమసమాజ నిర్మాణం కోసం పాటుపడి, నేటికీ చిరంజీవులుగా సదా పూజింపబడుతున్నారు.

ఈ పరంపరలో గుర్తుంచుకోదగిన మహనీయుల వరుసలు పేరెనికి కన్నా తెలంగాణ మట్టికవి, ప్రసిద్ధ వాగ్గేయకారులు, కవి రచయిత, లోక కవిగా ప్రసిద్ధి చెందిన మహాకవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, తెలంగాణ పాటల అందెల సందడి, రేబర్తి ముద్దుబిడ్డ, డాక్టర్ అందెశ్రీ గారు. 1961 జూలై 18న సిద్ధిపేట జిల్లా రేబర్తి గ్రామంలో, ఒక నిరుపేద దళిత సామాజిక వర్గంలో జన్మించారు అందెశ్రీ. పుట్టినప్పటి నుండి కటిక పేదరికాన్ని, దుర్భరమైన జీవితాన్ని గడిపినప్పటికీ, అస్తిత్వం కోసం ఎప్పుడూ పరితపించిన వ్యక్తి. తన స్వాభిమానమే తప్ప ఇతరులను సహాయమడగని మనిషి. పలక



బలపం పట్టకపోయినా, పలుకులమ్మను ఉపాసించిన ధీశాలి. పాఠశాల మెట్లు ఎక్కకపోయినా, విశ్వవిద్యాలయాలకు పాఠం చెప్పిన గొప్ప ఆచార్యుడు. పశువుల కాపరిగా, గొర్ల కాపరిగా ఉన్నా, పరతత్వపు సాహిత్యాన్ని ఆపోశనపట్టిన తాపసి. తాపీ మేస్త్రి పని చేసినా, తరతరాలకు తరగతి సాహితీ సంపదను అందించిన వైదుష్యమూర్తి. అక్షరం ముక్క రాకపోయినా, లోక కవిగా ప్రసిద్ధి పొందిన కవిశిఖరం. ఆత్మవిశ్వాసాన్ని పరమావధిగా భావించిన లోక కవి. జన జాగృతి గీతికలతో తెలుగు నేలను అనగా రెండు తెలుగు రాష్ట్రాలను అందెల సందడి చేత ఉర్రూతలూగించిన వాగ్గేయ ఝంఝా మారుతం.

ఇలా ఎన్ని విధాలుగా అందెశ్రీ గారి సాహితీ విరాట్ రూపాన్ని ఎంత పొగిడినా, ఎన్ని విధాలుగా కీర్తించిన సూర్యునికి దివిటీ పట్టినట్టే అవుతుంది తప్ప మరేది కాదు. చిన్న నాడు పశువుల కాపరిగా ఉండి తనకున్న జిజ్ఞాసతో రామాయణ, భారత, భాగవతాలను మననం చేసుకుని, రేబర్తి గ్రామ నివాసులైన "జక్కిరెడ్డి రాధమ్మ – మల్లారెడ్డిల పంచన చేరి, ఒక జీతగానిగా పనిచేయడమే కాదు, మానవీయ విలువలను, మునీరు సేటు ద్వారా తన అక్కున చేర్చి, లోకరీతులను, తదనంతర కాలంలో తన పదవ ఏట నుండి నల్లగొండ కవివరేణ్యులు కుమ్మరి సిద్ధప్ప వరకవి గారి బోధలకు ఆకర్షితులై వారి రచనలను, సాహిత్యాన్ని మౌఖికంగా అధ్యయనం చేసి, స్తుత పాండిత్యాన్ని సంపాదించాడు. జక్కిరెడ్డి మల్లారెడ్డి గారి ద్వారా తన తత్వ మార్గానికి బీజం పడినట్లు అయింది.

**ప్రారంభ జీవితం :**

పశువుల కాపరిగా జీవనం కొనసాగిస్తున్న తరుణంలో అమ్మానాన్నలు లేనితనం, వారి ఆదరాభిమానాలు కరువైన స్థితి, ఆకలితో అలమటించిన రోజులను గుర్తు చేసుకుని, నేడు అందెశ్రీగా పిలువబడే రచయిత అసలు పేరు అందె ఎల్లయ్య. ఈ కష్టాలను భరించాలంటే "సన్యాసమే శరణ్యం" అని చాలా సార్లు వైరాగ్యస్థితికి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని గమనించి, ఆ రేబర్తికి చెందిన బజారు పోశక్క (అందె ఎల్లయ్యకు అక్క వరుస) చాలాసార్లు తనకు బ్రతుకు పాఠం చెబుతూ, సంసార జీవన విధానాన్ని బోధ చేసింది. అందువల్ల ఆ స్థితిని కాస్త మార్చుకోవలసి వచ్చింది.

తర్వాత తనకు మొదటిసారి బట్టలు కుట్టించి తనను మనిషిగా పరిగణించింది మునీరు సేటు. ఆయన ప్రభావం కూడా అందె ఎల్లయ్య గారిపై చాలా వరకు ఉంది. తర్వాత జక్కిరెడ్డి రాధమ్మ వాళ్ళ ఇంట్లో పశువుల కాపరిగా కాకుండా, వారికి సంతానమే లేని కారణంగా తమ పుత్రుడిగా భావించి, అంతటి ఆదరాభిమానాలను చూపించి, తనను అక్కున చేర్చుకుని, ఎనలేని మక్కువ కనబరిచారు. మరికొంత కాలానికి పోశక్క సోదరుడు రామస్వామితో కలిసి, తాపీ మేస్త్రి పనికి తీసుకువెళ్లి, భవన నిర్మాణ కార్మిక వృత్తిని నేర్పించారు. అలా 20 సంవత్సరాలు తాపీ మేస్త్రి తాపీ మేస్త్రిగా పనిచేశారు అందె ఎల్లయ్య.

ఈ మధ్యకాలంలోనే తిండి లేక నిదురలేని రోజులను ఎన్నో గడిపారు. బుక్కెడు బువ్వ కోసం పడరాని పాట్లు పడ్డారు. తాను అనాథనని ఎవరూ తనను అక్కున చేర్చుకునేవారు కాదని వాపోయేవారు. అలాంటి సందర్భంలోనే ఆకలి నన్ను దహించి వేసినప్పుడల్లా/ హంతకుడిగా మారాలనిపించేది/ కానీ ఎందుకో/ నా అంతరాత్మ నాకు వద్దని ప్రబోధించేది!! అంటారు.

**అందె ఎల్లయ్య నుండి.. "అందెశ్రీ" వరకు ప్రస్థానం**

ఒకానొక సందర్భంలో శృంగేరి ఆశ్రమ సందర్శనకు వెళ్ళినప్పుడు అక్కడ ఉండే శంకర్ మహరాజ్ అనే సాధు పుంగవుని దర్శనం కలిగింది. ఆ మహనీయుని ప్రోద్బలం వలన తాను విశేషమైన ఆధ్యాత్మిక భావజాలానికి లోనయ్యారు. అందె ఎల్లయ్యలోని జిజ్ఞాస, సాహితీ పిపాసను గమనించిన శంకర్ మహరాజ్ గారు, ఒకానొక సందర్భంలో ఋత్వికుల నడుమ, ఆశ్రమ వాచక ధర్మాన్ని ఆచరిస్తూ యజ్ఞోపవీతాన్ని ధరింపజేసాడు. ఆ క్షణమే పలక బలపాన్ని చేతికి ఇచ్చి **"ఎంగిలి పాటలు పాడడం కాదురా! అక్షరం నీలో ఆపాదమస్తకం ధ్వనిస్తున్నది. కావున నువ్వే పాటలను కైగట్టాలి!"** అని చెప్పి తనలోని కవితాత్మక ధోరణిని గుర్తించి **"శ్రీ"** అంటే అమ్మకు, అక్షరానికి ప్రతిరూపం. అందువలన ఆ **"అందె"** ను అలాగే ఉంచి, ఆ అందెను అమ్మ పాదాలకు సందడి చేయమని, చివరన శ్రీ వాచకమును తొడిగి పరిపూర్ణత చేకూర్చినారు. అందువల్ల ఆనాటి నుండి అందె ఎల్లయ్య కాస్త అందెశ్రీ గా సారస్వత లోకానికి పరిచయం కావడం జరిగింది.

అప్పటినుండి జీవనపర్యంతం ఆ పవిత్ర గోదావరి నదిలో స్నానమాచరించినప్పటి నుండి తనకు ఇక తాపీని పట్టే దుస్థితి రాలేదు. పలికిన ప్రతి మాట, వ్రాసిన ప్రతి పదం, ఆశువుగా సహజ కవితా పాండిత్యాన్ని ఆపాదించుకుని, కవిత్వంగా వర్ధిల్లింది. తన చుట్టూ ఉన్న మనుషుల దైనందిన జీవితాన్ని గమనించేవారు అందెశ్రీ. తర్వాత ప్రతినిత్యం ప్రకృతితో మమేకమై తనకు తోచిన, ఊహకు అందిన ప్రతి భావజాలాన్ని కవిత్వమయం చేసేవారు. ఒక కవిత్వమే కాదు ప్రారంభం నుండి పద్యము, పాట, కవిత్వం మూడింటిని మూడు పాయలుగా, ఒక త్రివేణి సంగమంలో అల్లుకుంటూ వెళ్లారు. మేలిమి రచనలకు శ్రీకారం చుట్టారు అందెశ్రీ గారు. అప్పటినుండి 40 సంవత్సరాల జీవనపర్యంతంలో కవితాత్మక జీవనమే కొనసాగించారు.

**సత్సాంగత్యం :**

అంది ఎల్లయ్య నుండి అందెశ్రీ గా మారిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా అనేక ప్రాంతాలు పర్యటించి అనేకమంది సాధువులను, సంతులను, సత్పురుషులను కలిసి పండరీపుర క్షేత్రంలో గల శ్రీ జ్ఞానేశ్వర్ మహరాజ్ గారి బోధనలు విని కొంత, సుప్రసిద్ధ సాహితీవేత్త, నల్లగొండ కవి శ్రీశ్రీశ్రీ కుమ్మరి సిద్ధప్ప వరకవి గారి శిష్యరికమును (1977లో) పొంది, గురు కటాక్షమును కూడా తీసుకొని, వారి బోధనలను ఎక్కువగా వినేవారు. ముఖ్యంగా సిద్ధప్ప జ్ఞాన బోధిని (నాలుగు భాగాలు) చదివి, వాటిని, వాటిలోని సారాన్ని మననం చేసుకున్నారు. ఆ తరువాత వివిధ రకాల క్రియలు అనగా యోగ సాధనాలు నేర్చుకొని వాటిని సాధన చేశారు. అటు పిదప తరచూ సిద్ధప్ప గారి దర్శనం చేసుకుని తన యొక్క ఆధ్యాత్మిక గురువుగా వారిని భావించేవారు. అటు తరువాత మెల్లమెల్లగా పలు రచనలకు ఆశువుగా శ్రీకారం చుట్టడం జరిగింది.

ఎప్పుడైతే బాసర సందర్శనం (తన 20వ ఏట) జరిగిందో అప్పటినుండి **"వాక్కులమ్మ"** నే తన దైవమని భావించి, ఆ తల్లిని నమ్ముకుని ప్రతి పదము నందు "అమ్మకు శరణాగతి!" అనే నామస్మరణ ఎప్పుడూ చేసేవారు. తొలిసారిగా తన కలము నుండి ఆశువుగా జాలువారిన పద్యం.. **శ్రీకరంబుగ నేను చిన్న తనయుడ నేను - కలతలెల్లను మాన్పు కన్నతల్లి!!** అనే పద్యం ఆశువుగా అప్రయత్నంగా వారి కలము నుండి వచ్చింది ఆ తర్వాత శృంగేరి ఆశ్రమంలో 41 రోజుల పాటు హనుమాన్ చాలీసా పారాయణ అనంతరం మండల దీక్ష పూర్తి అయిన తర్వాత వ్రాసిన గేయ కవిత్వం... **అమ్మ నిన్ను చూడకుండా నిలువ / తెలిసింది నీది విలువ /ఆగని కాలపు అంచుల పైన / సాగే జీవన సమరంలో నేను చూడకుండా నిలువ!! అజ్ఞానులు నిన్ను ఆరాధించిన / సుజ్ఞానులుగా**

**జేతువటే / పామరులు నేను ప్రార్థించిన / మది పాండిత్యము కలిగింతువటే !!....** అనే గేయ కవిత రచనకు శ్రీకారం చుట్టి తనలోని కవికోనానికి పాదులు తొడిగారు అందెశ్రీ గారు.

**కవితా జీవన ప్రస్థానం :**

ప్రకృతిని తన తొలి గురువుగా భావించిన అందెశ్రీ గారు తాను ఎదుర్కొన్న కష్టాల పరంపరను, అనుభవించిన దుఃఖాలను తలుచుకొని చాలా సందర్భాలలో కుమిలిపోయారు. అలాంటి సందర్భాలలో తనదైన శైలిలో కవితా రచనకు శ్రీకారం చుట్టారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆచార్య బిరుదు రాజు రామరాజు వంటి సాహితీ శ్రేష్ఠుల సాహచర్యం వలన అనేక కవితా ధర్మాలను, వివిధ సాహితీ పద్ధతులను అభ్యసించారు అందెశ్రీ. ఒకవక్క అంటరానితనమనే వివక్ష, అనేక రకాల భావజాలాలు తనను చుట్టుముట్టినాయి. ఈ నేపథ్యంలో పద్యము నుండి వచనం, వచనము నుండి పాటకు తన జీవన గమనం కొనసాగింది.

**ఆశుపద్య రచనా విధానం :**

బడి ముఖమెరుగని అందెశ్రీ గారు అలవోకగా స్తుత పాండిత్యాన్ని సంపాదించి, అభినవ పోతన వలె ఆశువుగా మొదట పద్య రచనలను ప్రారంభించి అనేక పద్యాలను కంఠోపాఠంగా చెప్పేవారు. తర్వాత **"వాక్కులమ్మ త్రిశతి"** పేరిట తాను నమ్ముకున్న వాక్కులమ్మ (సరస్వతి) నే తన అమ్మగా భావించి, కవితాత్మకమైన నివేదనను మొదట పద్య రూపంలో అర్పించారు అందెశ్రీ గారు. మొదట తన పరిచయాన్ని ఒక సీస పద్యంలో చెప్పుకున్నారు.

**సీస పద్యం :**

జిల్ల ఓరుగల్లు జిజ్ఞాస నాయిల్లు
మా ఊరు రేబర్తి మంచి స్ఫూర్తి!
అందెనందెశ్రీగ అలరించురాగాల
ఆత్మ మేలుకొలుపు అవనిలోన!
నిష్టగలిగియున్న కష్టాలనెదురీదు
మనిషి కందని విద్య మహిని గలదె?
పల్క బల్పం పట్టి పాఠశాలకు పోలె
అచ్చులల్లులు కాస్త అభ్యసించి!
కలము పట్టాను కరమున కళ్ళు తెరచి
పారజూచాను లోకాన్ని పట్టుబట్టి
ప్రజల భావాలే కవితలుగా పల్లవించు
వసుధ వినిపించు నా మాట వాక్కులమ్మ!!.... అంటూ మొదట తన పరిచయ పద్యాన్ని వివరణాత్మకంగా చెప్పుకున్నారు అందెశ్రీ గారు. ఆశువుగా, అలా ఊకగా అల్లిన ఈ పద్యంలో వారి పూర్తి చిరునామాను తెలియజేసుకున్నారు. ఎక్కడ చూసినా చిన్న దోషం కూడా కనిపించనంత శుద్ధంగా ఈ సీస పద్యం కనిపిస్తుంది. అలాగే వాక్కులమ్మను స్తుతిస్తూ...



సీసపద్యం :

మేఘాల లోగిళ్ళ మెరుపుతీగల దాగి
ఉరుముల శబ్దమై ఉన్నదెవరు?
అక్షరాలతొ జీవ లక్షణాలను పెంచి
సృష్టిని తిలకింప దృష్టి ఎవరు?
అజ్ఞానమును చీల్చి విజ్ఞాన జ్యోతిగా
జిజ్ఞాస కలిగించు జీవమెవరు?
మేధస్సు కందని వాదోపవాదాల
నాలోన నర్తించు నాదమెవరు?..... అంటూ అన్ని తాను అయినా నడిపించే శక్తివి, యుక్తివి, ముక్తివి నువ్వే కాక మరెవ్వరు ఉన్నారు? అంటూ జ్ఞాన జ్యోతిని వెలిగించే కారణభూతురాలైన తల్లి ఆ "వాక్కులమ్మనే". ఆ అమ్మకు సదా శరణాగతి అంటారు అందెశ్రీ.

(వాక్కులమ్మ త్రిశతి 300 సీస పద్యాల సమాహారం అముద్రితం)

**వచన కవితా విలాసం:**

చిన్ననాడు అభిలాషతో జక్కిరెడ్డి మల్లారెడ్డి గారి ద్వారా విన్న **"రామాయణ భారత భాగవతాది కథలు, బుద్ధుని జీవిత చరిత్ర, ఆ పిదప దేవదత్తుని హంసకథ"** లు విన్న నేపథ్యం అందెశ్రీ గారి లోని కవితాత్మక దృష్టిని కదిలించాయి. ఒకపక్క ఆకలి, అనాథ జీవితం, అన్నం కొరకు పస్తులున్న సందర్భాలు కోకొల్లలు. ఇలాంటి దుస్థితిలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా మొదట పద్యంలో తన మనోవేదనను, ఆ తర్వాత 21 సంవత్సరాలు బిరుదురాజు రామరాజు గారి యొక్క సాహచర్యం వల్ల, సాహిత్య, ఆధ్యాత్మిక, జీవిత విషయాలను విలువలను, ధర్మాలను ఒంట పట్టించుకుని తన సాహితీ ప్రస్థానాన్ని కొనసాగించారు. ఈ నేపథ్యంలో తన కవితా విషయాలను ప్రస్తావిస్తూ అందెల సందడి (1994) అని వచన కవితా సంపుటిని

వెలువరించారు. జీవితానుభవం నుంచి, సంవేదన భరితమైన పరిస్థితులను అధిగమించేందుకు వచన కవితలు ఎన్నుకున్న అందెశ్రీ గారు వ్రాయాలని సంకల్పించి వ్రాసినవి కాకుండా, కాలాన్ని దృష్టిలో పెట్టుకొని, చెట్టును, పుట్టను, గుట్టను, చేను చిలకలను చదివి, వాటి నుండి జీవన పరమార్థాన్ని గుర్తెరిగినారు.

**"సృష్టి తత్వం"** అనే కవితలో ఇలా అంటారు...

"కనులు వెన్నెల స్వర్ణ కాలుష్యమే సృష్టి / కన్నీరే అమృతము కదిలే కాలానికి / వెన్నుపాములదిన్న జున్ను మీగడ మన్ను / తడియారని గుండె సడియాగు శిథిలాల / పుట్టినది నీవు ఎచట? మనిషికి పురుడుబోసినది ఎచట? / గిట్టనిది నీవు ఎచట? / మనిషి గిరిగీసుకొని బ్రతికెనచట? / అష్ట కష్టాలు పడి సృష్టికి పై సృష్టి / చేసితివి నిష్టగా ధరనేల ద్రష్టగా!!......." అంటూ మనిషి పుట్టుక నేపథ్యాన్ని వివరిస్తారు. ఇందులో ఎంతటి పారమార్థిక సత్యాన్ని నిక్షిప్తపరిచారో అంతుచిక్కదు. మరోచోట అభ్యుదయ జీవన సౌందర్యాన్ని గురించి చెబుతూ.. **"అజ్ఞానపు అంధకారాన్ని / ఆవహించే పాప భారాన్ని / చీల్చి వెలిగే శుభోదయం / విజ్ఞానపు అభ్యుదయం!!"** (అందెల సందడి.. లో) అభ్యుదయ వికాసాన్ని ఇంత రమణీయంగా ముఖ్యంగా ఆశావాహ దృక్పథంతో వర్ణించిన రచయిత మరొకరు లేరు. అది కేవలం అందెశ్రీ గారు మాత్రమే. **"మానవ మనుగడకు పిలుపు / అభ్యున్నతికి మేలుకొలుపు / శ్రామిక చైతన్య కిరణాలే / సమాజానికి ఆభరణాలు !!"** అన్నమాట అక్షర సత్యం. మనిషి అభ్యున్నతికి ఒక దారినిక దృష్టికి ఇంతకన్నా నిదర్శనం మరేమి కావాలి?.

మరోచోట **'దేవుని సృష్టి'** అనే కవితలో...

**"ఎంతో కష్టించి, దేవుని సృష్టించి/ మహినేలే మతాలు / మారణ హోమం చేసే మాఫియా ముఠాలు / మతం మనిషికి హితం / కాదంటే నువ్వు హతం!!."** ఆధునిక సమాజంలో మతం ఒక ఫ్యాషన్ అయిపోయింది. ఆ మతకల్లోలాలను రేపుతూ జాతిని ఛిన్నాభిన్నం చేస్తున్న దురాగత శక్తులు, అలాంటి అకృత్యాలకు పాల్పడే వర్గాలను ఈ విధంగా ఎండగడుతూ రచయిత కాలాన్ని కాలనీ ఎవరు ఎన్ని విధాలుగా విజృంభించినా వారికి వినాశనం తప్పదు అని హెచ్చరిస్తూ చెప్పిన ఈ అభివృద్ధి కవితను చూడవలసిందే. **"ఓ మనిషీ! నా మేధస్సుకు వేలం వేస్తే / అవుతుందేమో నీకు సొంతం / కాలానికి గాలం వేస్తే / ఎంతటి వారైనా కాక తప్పదు అంతం!!"** అంటూ ఎవరైతేనేమి కాలం విసిరే ఖడ్గానికి ఎవరి తలయితేనేమి తెగిపడ వలసిందే. అంటూ కాల నిర్ణయాన్ని ప్రకటిస్తారు. ప్రతి వచన కవితలో కూడా ఒక జీవన పరమార్థాన్ని తెలియజేసే విధానం అందెశ్రీ గారికి సొంతం. తనకు అనుభవాలే అసలు పాఠాలు అయ్యాయి. బ్రతుకే బడి అయ్యింది. చుట్టూ ఉన్న పరిసరాలే ప్రియ నేస్తాలు అయ్యాయి.

ఒకచోట ఆదిత్యుని స్తుతి లో... **"ఆదిత్య నీపాద ధూళి సంజతకేలి / అరుణారుణా కిరణ/ రుధిర జ్వలితాహేళి/ ప్రకృతే నీ దివ్య ఆకృతి నా కృతి/ విశ్వమును వెలిగించు అగ్నిపుష్పము నీవు/ లోకులు కొనియాడు లోకేశ్వరా! / ఎల్లలోకాల నేలేడు జగదీశ్వరా!!"** ... అనే ఈ కవితను గుర్తుచేసుకున్నప్పుడల్లా అందెశ్రీ గారి గురువుగారు సిద్ధప్ప వరకవి గారి ప్రభావం కనిపిస్తుంది. తాను నేర్చుకున్న **"ఛాయా పురుష లక్షణం", యోగ సాధన విధానం** మనిషిలోని ఇంద్రియాలతో సమన్వయం చేసి సప్తాశ్వరూఢుడైన సూర్య భగవానున్ని కొనియాడడం అత్యంత కవితాత్మకం. అంతేకాకుండా ఇందులో **"జననాలు మరణాలు జగతి కాభరణాలు"** అని చెప్పడం జీవన పరమార్థాన్ని గమనించవచ్చు. ఒకరకంగా ఇది పరతత్వపు భావనయే.

స్త్రీవాద ఉద్యమ కాలంలో అందెల సందడి పురుడు పోసుకున్నది. ఆ సందర్భంలోనే రచయిత అందెశ్రీ "నేనే స్త్రీగా ఎందుకు మారకూడదు?" అన్న ఒక ప్రశ్నార్థక సమయం లో... **"నేను నీకు బానిసనా?"** అని కవిత శీర్షికతో... **"కొవ్విన నీ కోరికల జివ్వుమన యవ్వన కాలపుటంచుల / రివ్వున ఎగిరే గువ్వల / రవళించేసిరి మువ్వల / నవ్వులు రువ్విన నీ నయనాలతో / యుగాల నుండి నన్ను దగా చేస్తూనే ఉన్నవ్!..."** అంటూ సాగిన ఈ కవితలు పురుషాధిక్యత ప్రపంచంలో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యలను, వరకట్న దురాచార విధానాన్ని ఎండగడుతూ, ఈ కవితను చిత్రించారు. అంతేకాకుండా స్త్రీ దేవతా స్వరూపంగా భావించి ఈ సమాజంలో తనకు దక్కవలసిన గౌరవం దక్కలేక, నేను నీకు ఎప్పుడూ బానిసను కాను అన్న స్త్రీవాద ధోరణిని వ్యక్తపరుస్తారు అందెశ్రీ.

**"కవితాంతర్ముఖం"**... అనే కవితలు కవిత్వం యొక్క గొప్పతనాన్ని గురించి చెబుతూ... **"అందమైన హాలులో / అమర్చిన చిత్రపటం / నువ్వు ఏ దిశ నుండి చూసినా / అది నీ వైపే చూస్తుంది!!"** కవిత్వం మార్మికతను వివరించిన కవులు చాలామంది ఉన్నారు. కానీ అందెశ్రీ గారిలోని గొప్పతనం ఏమిటంటే ఏ బడిలో చదివినవి గాని, ఎవరో చెప్పగా విన్నవి కానీ తాను ఎన్నడూ అనుకరించలేదు, అనుసరించ లేదు. ప్రకృతితో మమేకమై అనుభవించిన అనుభూతిమయ కవిత్వమే తన ఎదనిండా పులుముకున్నారు.

**వెల్లువెత్తిన పాటల ప్రవాహం :**


అందెశ్రీ గారి పదవి ఏట నుండి తన బ్రతుకులు, తన దైనందిన జీవితంలో ఒక భాగమైన పాట అనేక పాయలుగా, పలు మలుపులుగా జీవన చిత్రాన్ని మార్చింది. పాటనే తన ప్రాణప్రదంగా, పాటని ప్రామాణికంగా, పాటని బ్రహ్మాస్త్రంగా లోకాన్ని చదివిన తాను, పాటని ఆయుధంగా ఎంచుకున్నారు. చిన్ననాడు పశువుల కాపరిగా స్తుత పాండిత్యం వలన నేర్చుకున్న తత్వ బోధలు, సిద్ధప్ప గారి ద్వారా ఒంట పట్టించుకున్న జీవిత సత్యాలు, జక్కిరెడ్డి మల్లారెడ్డి గారి ద్వారా మదిలో పొదుముకున్న ఆధ్యాత్మిక భావాలు, సామాజిక సమస్యలు

లెక్కకు మిక్కిలి ఉద్యమాలు ఇవన్నీ అందెశ్రీ గారి పాటల రచనకు ప్రధాన ఎరువుగా మారినాయి. శంకర్ మహారాజ్ గారి ద్వారా ఉపనయన ధర్మాన్ని పాటించిన తర్వాత 41 రోజులు హనుమాన్ చాలీసా పారాయణం చేసిన అనంతరం మొట్టమొదట వాక్కులమ్మ సరస్వతీమాతను స్తుతిస్తూ స్తుతి గీతం రాశారు.

తర్వాత కొంతకాలానికి ప్రసిద్ధ వాగ్గేయకారులు శ్రీ సుద్దాల హనుమంతు గారి "పల్లెటూరి పిల్లగాడా..!" అనే గీతాన్ని విన్న తర్వాత తన బ్రతుకు వేదనను ఒక్కసారి తరచూ చూసుకొని తన గీత రచనకు విశేషంగా ఆకర్షితులై (అల్లిక సంప్రదాయం) తనను గురువుగా భావించి, ఆశువుగా అనేక పాటలను పాడటం, కైతలు కట్టడం నేర్చుకున్నారు. "పల్లెటూరి పిల్లగాడా..!" పాటను తన జీవితానికి ఆపాదించుకొని తన బ్రతుకుని పాటగా మలుచుకున్నారు అందెశ్రీ.

ఈ నేపథ్యంలోనే... **"పల్లె నీకు వందనాలమ్మో! / నన్ను కన్నా పల్లె తల్లి నీకు వందనాలమ్మో!! నాకు మాట నేర్పి పాట నేర్పి / బ్రతుకు త్రోవ చూపినందుకు పల్లె నీకు వందనాలమ్మో!!"** అనే ఈ గీతంలో ఒక తన జీవితాన్ని కాక తెలంగాణలో ఉన్న ప్రతి జీతగాని బ్రతుకు చిత్రాన్ని తెలిపే విధంగా ఆ గీత రచన అంత గొప్పగా సాగింది. అందులో.. పాలు మరిసి జీతగాన్నై పసులగాసిన రోజులల్లో / పాడు గోదలు ఏనుగులు దుంకి పంట చేళ్లను పాడుచేస్తే /పల్లె కాపులు ఉరుములురిమి పసుల మాదిరి తరిమికొడితే / ఎక్కి ఎక్కి ఏడ్చి నేను / దిక్కులేని పక్షినైతే / ఉసికేతెప్పల పానుపేసి ఉరడించిన గురుతులు ఎన్నో !! అన్న పదాలు ఎంత అనుభూతిమయమైనా భావనను గుర్తు చేస్తున్నాయో చూడవచ్చు. తన జీవితాన్ని ఒక డిస్కవరీ ఛానల్ మాదిరిగా చూపించారు అందెశ్రీ గారు. అంతేగాక ప్రకృతితో మమేకమై బ్రతుకంతా, బాల్య జీవితమంతా ప్రకృతి ఒడిలోనే పొదిగి ఎదిగిన విధానం మొత్తం కనిపిస్తుంది. అలాగే ఈ గీతంలో తానే కథానాయకుడును అని నిర్మొహమాటంగా పలు సందర్భాల్లో చెప్పుకునేవారు. జీవితాలను పాఠంగా చెప్పుకుని కథలుగా, మానవీయ చరిత్రలుగా మలుచుకున్న కవులు, రచయితలు మనకు చాలామంది కనిపిస్తారు. కానీ పాటగా మలుచుకున్న ఆశు కవి, సహజ కవి మాత్రం అందెశ్రీ గారే అని చెప్పాలి.

బాల్యంలో జరిగిన ప్రాథమిక జీవితమంతా మొదట ఆధ్యాత్మిక, తాత్విక గీతాలను అల్లడంలోనే ప్రారంభమైంది. కేవలం ఉద్యమ సాహిత్యాన్ని ప్రాతిపదికగా చేసుకొని, ఉద్యమ గీతాలను ఎత్తిచూపుతూ "ఉద్యమ కవి"గా ఇప్పటి తరం వారిపై ముద్రవేసింది. కానీ ఇది నిజం కాదు. సాధుసంతులు, యోగుల యొక్క సహవాసం వలన ఆధ్యాత్మిక నేపథ్యం లో తరచూ శ్రీ పండరీపుర క్షేత్రం వెళ్లి విఠలేశ్వర స్వామిని దర్శించుకుని వచ్చేవారు. తర్వాత అక్కడ గల సంత్ జ్ఞానేశ్వర్ మహారాజ్, తుకారం మహారాజ్ గార్ల దివ్య చరిత్రలను విని ఆ దిశగా, అనేక ఆధ్యాత్మిక భక్తి గీతాలను ఆశువుగా అల్లడం



ప్రారంభించారు. ఆ పాటల పర్యవసానమే తదనంతర కాలంలో **"పాటలపూదోట(1994)"** పేరిట పుస్తక రూపం దాల్చేందుకు కారణమయ్యింది.

**"రంగ రంగ శ్రీ పాండురంగ.. హే / దేవా కనరావా!!"** అన్న గీతం విన్నప్పుడల్లా ఒక కంచర్ల గోపన్న కనిపిస్తాడు. అలాగే లోకబాంధవుడైన ఆదిదేవుని స్తుతి గీతంలో **"వేకువై లోకాలు మోకరించెను తండ్రి / లోకేశ మెల్లంగ మేలుకో / ఎల్ల లోకాల చల్లంగ ఏలుకో!!..."** మంటూ ఆదిదేవుని నిదుర లేపే విధానం ఈ గీతికలో కనిపిస్తుంది. ప్రకృతిలో మమేకమైన దినచర్యను కొనసాగిస్తున్న అందెశ్రీ, ప్రకృతిలోని ప్రతి అణువణువును అనుభూతిమయం చేసి తనలోని వాగ్గేయకారుడిని పురిగొలుపుతాడు. ఊహలు ఎంత గొప్పవో, అవి మనిషి ఎంతగా భ్రమింప చేస్తాయో ఒక గీతంలో ఇలా అంటారు. "...ఊహలదే ఉయ్యాలా – ఊపితే జంపాల / ఊపనని అంటావు – ఊపుతూనే ఉంటావు // డబ్బు లోభి వాంఛలతో – ధన మధాంధ స్వార్థంతో / ధర్మమనే లోక కాంతిని – ధ్వంసింపగా తలవకుమా // ...ఇలాంటి వేదాంత తత్వ ధోరణి గురించి సాగే గీతాలే కాకుండా, ప్రణయ భావాలకు సంబంధించిన గీతాలను కూడా తనదైన శైలిలో నూతన రీతిలో ఆవిష్కరించారు అందెశ్రీ గారు.

ప్రేయసి ప్రియుల మధ్య రస హృదయ సన్నివేశాన్ని కూడా శృంగార భావనలను అద్ది రసరమ్య రీతిలో చెప్పడం అనేది వీరి ప్రత్యేకత... **"తోడు లేని దానరా! నీ నీడ చేరినాను రా/ పిండి ఆరా బోసినటుల – పండు వెన్నెల పానుపేశా / వలసి వచ్చి కలసి నీలో – దాచి నందము దోచుకొని పో //"** అనే సుకుమారమైన ప్రేయసి హృదయ వేదనను అమలిన శృంగార భరితంగా వర్ణించిన తీరు ఎవరు పసిగట్టగలరు ఒక అందెశ్రీ గారు తప్ప. మరో సందర్భంలో **"మూసినా ముత్యమా – దాగని సత్యమా – మురళీ మోహనరావదే / రాధ నీపై ప్రేమ బాధల్లో విహరించె – మాధవ కావరాదే!!"** అనే

ఈ గీతం అత్యంత శృంగార భరిత గీతంగా రస హృదయాలను ఓలలాడించింది. ఈ గీతంలో ప్రకృతి రమణీయత తో జతకలిపి కన్నయ్య అనగా ఆ వెన్నదొంగ లీలా విలాసాలను రాధ వివరించిన తీరు అమోఘం. అలాగే ప్రణయ భావనయే కాదు జీవన ప్రబోధాన్ని చేస్తూ **"బ్రతుకు పూలబాట అనుకోకు – ఆదమరచి ముందడుగేయకు"** అనే కర్తవ్యాన్ని బోధ చేస్తూ, సమాజంలో ఆచీతూచి అడుగు వేయమంటూ, మంచి భవిష్యత్తును పొందమనే సందేశం యువతకు ప్రేరణ భరితంగా నిలిచింది.

ఆత్మస్థైర్యాన్ని పుష్కలంగా సమకూర్చుకున్న రచయిత, తను పట్టిందల్లా, తనను తాకిందల్లా, కవిత్వమయం చేసేందుకు ప్రయత్నం చేశారు. అంతేగాక సమాజానికి కూడా ఒక హితోపదేశాన్ని చేశారు. "ఆత్మయే అనంత సృష్టిరా! – నీ ఆలోచన దివ్య దృష్టి రా!" అనే గీతం మనిషికి జీవిత ఉపదేశాన్ని కాదు, రమణీయమైన ప్రకృతిని అణువణువునా వర్ణించిన తీరు కనిపిస్తుంది. తన ఊహలకు ఊపిరి పోసి, భావాలకు బాటలు వేసి, వెల్లువయ్యి పల్లవించిన గుండెలో గీతాలు ఎన్నో ఆలపించనా! అంటూ ప్రతి గీతికను తన అనుభూతిమయ తత్వ దృష్టిని జతచేసి ప్రతి పాటకు ప్రకృతితో మమేకం చేసి ప్రాణ ప్రతిష్ఠ చేశారు అందెశ్రీ గారు.

ఆ వరుసలో **"శరణాగతీ! ... ప్రభూ! నీవే ధృతీ!!"** అనే గీతాన్ని గురించి చెప్పవచ్చు. అలాగే నడచిపోయి నల్ల మేఘాలలో అనే గీతంలో ప్రకృతి చేసిన బోధ ఏమిటో, ప్రకృతి ప్రబోధించిన ధర్మం ఏమిటో చెబుతారు. అందులో...,

**"పక్షుల కిలకిలలు అక్షరాలుగ మారి –**
**దిక్కులకు దివిటీలు పట్టినాయో!**
**కొమ్మ నా కోయిల ఝుమ్మన్న తుమ్మెద –**
**యిమ్మహిని పులకింప జేసినాదో!**
**వెదురు కొయ్యను పెదవి ముద్దాడినంతనే –**
**వేల రాగములు వెదజల్లినాదో!**
**కీచురాయి కంఠనాదముగ సన్నాయి –**
**కాలగమనమునె కవ్వించినాదో!!..."**

అన్న పంక్తులను విన్నప్పుడల్లా ప్రకృతి సుందరదృశ్యాన్ని, దాని గొప్పతనాన్ని ఇంతకన్నా అద్భుతంగా మరే రచయిత వర్ణించలేదు. ఇలాంటి రమణీయమైన కేవలం ప్రబంధాలలో మాత్రమే చూడవచ్చు. ప్రబంధాలను సైతం తలదన్నే విధంగా ఇంత రమణీయమైన వర్ణన నేటి తరపు ఆధునిక సాహిత్యంలో ఎక్కడా కూడా మనం చూడలేం. ఈ గీతం గురించి చర్చ వచ్చినప్పుడు అందె శ్రీ గారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైనదని, అది తాను రాసినది కాదు ఆ వాక్కులమ్మనే దిగివచ్చి వ్రాసినట్టుగా ఆ పాటని విని చాలాసార్లు కన్నీళ్లు పెట్టుకుని తాదాత్మ్యం చెందేవారు.

మొదట తనది **"గోవులను కాసినందున గోకులం అని, ఆ తర్వాత కవికులమని"** చెప్పుకునేవారు. శ్రీకృష్ణుని తన ఆరాధ్యదైవంగా భావించి, **"పాము పడగపై పొదిగినట్టి ఆ పాదముద్రలు ఎవరివో? / – పాడే కోయిల గొంతులోని ఆ పాట మధురిమ ఎక్కడిదో?.."** అన్న ఈ గీతం విన్నప్పుడల్లా, పోతనామాత్యుని వర్ణన విధానం, ఒక పారమార్థిక బోధను తెలియజేస్తూ **"పంచభూతములు రానికోటికి ప్రకృతి తత్వం పాడవే మనసా!!"** అంటూ మనసును ఏకీకృతం చేయడానికి చెప్పిన గీతం సాహిత్య చరిత్రలోనే ఇది అజరామరం.

ఈ మధ్యకాలంలో (మలిదశ తెలంగాణ ఉద్యమ కాలంలో) అందెశ్రీ గారి గురించి కాస్త కూస్తో పరిచయం ఉన్నవాళ్లు వారిని నాస్తిక భావజాలం గలవారిగా భావించి ఆ దిశగా కూడా వారిని కొంత విమర్శించారు. ఒకవేళ వారు ఆ దేవుని నమ్మనట్లయితే, అసలు దైవభక్తి అన్నది లేకపోతే.. **"కొమ్మ చెక్కితే బొమ్మరా – కొలిచి మొక్కితే అమ్మ రా! / ఆదికే ఇది పాదురా – కాదంటె ఏదీ లేదురా! / జాతి గుండెల జీవనదముల – జాలువారగ జానపదముల / గ్రామమును కాపాడ వెలసిరి – గ్రామ దేవతలందరో మరీ!!"** అనేవారు కాదు. గ్రామాన్ని కాపాడడానికి ముందుగా గ్రామదేవతలే ప్రధానం. ముందు వారే వెలిశారు అనే పరమ సత్యాన్ని వారు ప్రకటించారు. అంతేకాదు **"ఎవరి నమ్మకాలు వారివి ఎక్కిరించే హక్కులు ఎక్కడివి – అగ్గికి సెదలెట్టబడుతది నిగ్గదీసి అడుగుతున్నా!!"** ఇంతటి సాధికారతతో నిలదీయడం కవికి అక్షర బలమే కాదు, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక బలం కూడా అవసరం. అన్నిటికీ మించి జాతి పట్ల వరీతమైన అనుభవం ఉండాలి.

సంఘజీవి అయిన మనిషి అన్నీ చూస్తున్నాడు. అందరితో అవసరాలు తీర్చుకుంటున్నాడు. నిత్యం సంతోషంతో గడుపు తున్నాడు. కానీ తాను మాత్రం మారడం లేదు. ఎన్నింటినో మార్చిన మనిషి ఎందుకో మంచితనాన్ని ఉపదేశంగా అందించిన మనిషి తాను మాత్రం ఎందుకు మనీషిగా మారలేదని ప్రశ్నిస్తూ... ఒక పాటలు ఇలా చెబుతారు **"కనరా కనరా కాలాన్ని కనులారా – వినరా వినరా విశ్వాన్ని చెవులారా! /నీ లోకము నీదే గాని నిజము తెలుసుకున్నది ఎప్పుడు – పరుల మాటలకు ఊ కొడితే – ప్రపంచము తెలిసేదెపుడు? – నిరంతరము ఆలోచిస్తూ – నిజాయితీగా నువ్వు శోధిస్తూ!!"** అన్న రచయిత కాలధర్మాన్ని కనుమనే సందేశాన్ని కూడా అందజేస్తూ, కాలమహిమ చాలా గొప్పది అని కాలం యొక్క తీరు జనులను చెబుతాడు. **"కాలం కరవాలం – కాకున్నదేది ఆహారం / చలనం చెంచారం – చేరాలి రా జీవన తీరం! కలల కడలి అలల – ఇలపై కరిగే గండ శిలల – దిక్కులను ఒక్కటి సేయాల – దిగ్దిగంతాలు తలవొగ్గేలా!!"** అనే ఈ గీతికలో కాలాన్ని నమ్మిన వ్యక్తిగా, కాలాన్ని విడువని ఒక మనిషిగా, ఒక బహుదూరపు బాటసారిగా, కాలధర్మాన్ని పాటించే యోగిగా కాలం విలువను


గుర్తించి ఎప్పుడూ దానికి లోబడి ఉండడమే ప్రధాన కారణం. లేనట్లయితే కాలానికి ఎవరు ఎదురీదినా కాలం విసిరేఖడ్గానికి ఏ తలయితేనేమి బలి కావలసిందే!! అనే వాస్తవాన్ని బట్ట బయలు చేశారు రచయిత. ఇవి కాక రచయిత ప్రతిగీతం ఒక మహా కావ్యంగా మలిచిన విధానం ఉంటుంది అంటే అది అతిశయోక్తి కాదు.

బ్రతుకు చిత్రాన్ని, దైనందిన జీవితాన్ని కళ్ళముందు ఉంచుకుని వ్రాసిన పాటలు ఒకవైపు అయితే, ఆశ్రమవాస ఉపనయన ధర్మాన్ని పాటించిన తర్వాత శృంగేరి శంకర్ మహరాజ్ గారి ప్రోద్బలం మేరకు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి మాత దర్శనం చేసుకుని, ఆ పవిత్ర పుణ్య గోదావరిలో ఎప్పుడైతే స్నానం ఆచరించడం జరిగిందో అప్పటినుండి మళ్లీ తాపీని పట్టే పరిస్థితి రాలేదంటూ, అలాగే ఆ పుణ్య గోదావరి నదీమతల్లి రుణం ఏ విధంగా అయినా తీర్చుకోవాలని, నది పైన కావ్యం రాయాలని తలంపుతో ప్రపంచంలోని 90 శాతం నదులను సందర్శించి వచ్చారు అందెశ్రీ.

అటు పిదప నదీకావ్యం మొదలుపెట్టారు. నదిని మామూలు వ్యక్తులు చూసే చూపుకు, కవి హృదయనేత్రంతో చూసే చూపుకు అనుపమానమైన వ్యత్యాసం ఉంటుంది. అందువల్ల నదిని తన మదిలో పొదుగుకొని .. **"ఊరు ఎలద పొది కింద ఒదిగిపోతున్నది,/ ఊరుకు దూరమై ఎదిగిపోతున్నది / నది నడిచిపోతున్నది / నన్ను నావనై రమ్మన్నది / పలుమారు పిలుచున్నది / నాలో ప్రాణమై దగున్నది / అల్లన రెండు పూల నల్లుకొని మురియంగా / మిణుగురులు మర్యాద విలవిలా కొరియంగ/ నది నడిచిపోతున్నది / నన్ను నావనగిరి రమ్మన్నది//"** అంటూ నదీమతల్లి వైభవాన్ని, ప్రతి పారకుని హృదయపేటికలను కవితాభిషేకం చేసి తడిపేస్తారు. బహుశా ప్రపంచ సాహిత్య చరిత్రలో నది పుట్టుకను చూస్తూ తాదాత్మ్యం చెంది ఇంత రమణీయంగా "నది తనను నావనై రమ్మన్నది" అన్న కవి లోక కవి కాక మరెవరు అవుతారు. ఈ కావ్యం ఇంకా కొనసాగుతోంది. పలు పాయలుగా, పలు మలుపులుగా, నది తీరుతెన్నులను చెబుతూ, నదిని తన తలపై పెట్టుకుని మోయాలనుకున్నారు అందెశ్రీ. వివిధ ఖండాలలో నదులు, వాటి పుట్టుక, గమనాలు అన్ని అతి సమీపంలో నుంచి చూసిన ఒక దూర దృష్టి కలిగిన వ్యక్తి అందెశ్రీ. అందుకే... **"అలల ఉలి దెబ్బలకు శిలలపై శిల్పాలు – జున్ను పాల నురగ వెన్నెల స్నానాలు"** అనగలిగారు. ఇంతటి పోలిక మరి కావ్యం లో గాని, కవితలోగాని తారసపడదు.

**తెలంగాణ ఉద్యమ నేపథ్యం :**

అందెశ్రీ గారి జీవన ప్రస్థానంలో బాల్య జీవితం అంతా కష్టాల మయమై, భవన కార్మిక విధానమే పుట్టెడు బాధలను సంకనెత్తుకొని బ్రతుకు బండిని ముందుకు నడుపుకుంటూ వెళుతూ కొన్నిసార్లు ఈ బ్రతుకు బ్రతికే కంటే సన్యాసమే శరణ్యమని, మరికొన్నిసార్లు



అసలు బ్రతకడమే వ్యర్థం అని ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడిన సందర్భాలు పలుమార్లు కనిపిస్తాయి. అయితే తనను ఎన్ని రకాల ఉద్యమాలు.. ఒకపక్క విప్లవోద్యమాలు, అస్తిత్వ ఉద్యమాలు, స్త్రీవాద ఉద్యమాలు ఎన్ని తలను కమ్మేసిన స్వరాష్ట్ర సాధనలో భాగంగా జరిగిన తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ గారి పాత్ర వెలకట్టలేనిది, అనిర్వచనీయమైనది.

ఒకపక్క సమకాలీన కవి పరంపర (వాగ్గేయకారులు) జయరాజు, గోరటి వెంకన్న, గూడా అంజన్న, గద్దర్, డప్పు రమేష్, వంగపండు శ్రీనివాస్ వంటి ప్రసిద్ధి కలిగిన పాటకారులు ఎంతమంది ఉన్నప్పటికీ, మళ్లీ దేశ తెలంగాణ ఉద్యమానికి తన సాహిత్యం ద్వారా ఊపిరులూది, జనజీవన చైతన్యమే కాదు, యువతకు ఉత్తేజాన్ని కలిగించే పలు పాటలను రచించి తెలంగాణ ఘోషను .. **"జై బోలో తెలంగాణ! నిలువెల్ల గాయాల వీణ.."** అనే జనని నాదంతో యువతలో ముఖ్యంగా, ఉస్మానియా వేదికగా జరిగిన అనేక కార్యక్రమాలకు తానే ప్రధాన భూమిక వహించి.. **"చూడు తెలంగాణ చుక్క నీళ్ళు లేని దాన – నాగోడు తెలంగాణ బ్రతుకు పాడైన వీణ! ఇది దగా పడ్డ దరువు – మాకు ఏది బ్రతుకు తెరువు?** నినాదాలు **కాదు దేశ – పునాదులే కదలాల!!"** అనే గీతం ద్వారా తెలంగాణ దుస్థితిని, తన కంఠానికి గంటలు కట్టుకొని ఉద్యమ ఉధృతిని ముందుకు నడిపించారు.

మరో సందర్భంలో తెలంగాణ గొప్పతనాన్ని చెబుతూ.. **"అరే.. నైజామోని పైజామా ఊడగొట్టింది / రజాకారు మూకలను దిగంతాలకు తరిమింది / గడీలకు అగ్గి పెట్టింది / రాచరికానికి గోరి కట్టింది / తెలంగాణ అంటే పిడికెడు మట్టారా? / పిపిలీకాది బ్రహ్మపర్యంతం – కంపరం పుట్టించే మందుపాతరా!!"** అంటూ గొంతెత్తి గర్జిస్తూ ప్రతి సందర్భంలో **"తన రొమ్మిరిసి, నా అమ్మను చెరబడితే ఎవరిని వదిలేది లేదు, కాలం విసిరేఖడ్గానికి ఏ తలయితేనేమి బలి కావాల్సిందే"** అంటూ రాష్ట్ర సాధనలు తెలంగాణ తల్లి పైన తనకున్న ప్రత్యేకమైన అభిమానాన్ని ఎప్పుడు కనబరిచేవారు అందెశ్రీ. ఈ నేలను, ఈ గాలిని, ఇక్కడి కళలను, సాహిత్యాన్ని, కవి గాయక వాగ్గేయకారులను, అమితంగా అభిమానించి గౌరవించేవారు అందెశ్రీ గారు.

ఇక 2002 సంవత్సరంలో తెలంగాణ ఉద్యమ సందర్భంలో కామారెడ్డిలో పురుడు పోసుకున్న గీతం **"జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం! – ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం!! / తరతరాల చరిత గల తల్లీ నీరాజనం – పదపదాన పిల్లలు ప్రణమిల్లిన శుభ తరుణం! జై తెలంగాణ!... జై జై తెలంగాణ!!"** అంటూ సాగే ఈ గీతం మొత్తం 12 చరణాలు. ఈ గీత రచనకు పట్టిన కాలం 12 సంవత్సరాలు. ప్రతి ఉద్యమ సందర్భంలో ఈ గీతం తెలంగాణ వాడవాడనా వీధి వీధినా మారుమోగింది. రాష్ట్ర అవతరణ తర్వాత పది సంవత్సరాలకు తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి గారు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు 2024 ఫిబ్రవరి 4వ తేదీన ఆమోదించి, జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ గీతాన్ని **"తెలంగాణ రాష్ట్ర గీతం"** గా ప్రకటించడం జరిగింది. ఈ గీతం రాష్ట్ర గీతంగా ప్రకటింపబడిన తర్వాత అటు అందెశ్రీ గారికి ఇటు తెలంగాణకు అఖండఖ్యాతిని తెచ్చిపెట్టింది

అందెశ్రీ గారికి కూడా రాష్ట్రగీత రచయిత అన్న గౌరవ అభిమానంతో సముచిత రీతిలో గౌరవించి సత్కరించింది. ఈ గడ్డం తెలంగాణ చరిత్రలోనే ఒక మహత్తర ఘట్టం అని చెప్పవచ్చు. ఎందుకంటే అందెశ్రీ గారి సాహిత్యంలోని గొప్పతనాన్ని గుర్తెరిగి, పలక బలపం పట్టని ఒక పండిత కవికి పట్టం కట్టడం అనేది గొప్ప విషయం. ఒక సామాన్య జీవనం గడుపుతున్న వ్యక్తికి, అసమానమైన గౌరవాన్ని ఇచ్చి గౌరవించడం, అగ్ర పథాన నిలబెట్టడం అనేది ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ప్రథమం.

రాష్ట్ర అవతరణ అనంతరం అందెశ్రీ గారు నిప్పుల వాగు పేరిట 1307 పేజీలతో ఒక బృహత్ పాటల సంకలనాన్ని వాక్కులమ్మ ప్రచురణలు ద్వారా వెలువరించారు. పాటకు, పాటకారులకు పట్టం కట్టి ఆ సంకల్పం ద్వారా ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చిన సందర్భం సాహిత్య చరిత్రకి గర్వకారణం. ఇది ఒక సునామి. ఇంత పెద్ద సంకలన గ్రంథం ఇప్పటివరకు చరిత్రలో వచ్చిన దాఖలాలు లేవు.

**గీత రచనలో అల్లిక సంప్రదాయం :**

తాను పాట నేపథ్యంగా తనలో పల్లవించిన భావాలను అద్భుతమైన రాగాలతో పాటలుగా మలిచే సందర్భం తనకన్నా ముందున్న యక్షగాన, భజన, జానపద కళా సాహిత్యం నుంచి వంట పట్టించుకున్నారు అందెశ్రీ. ముఖ్యంగా సుద్దాల హనుమంతు, దున్న ఇద్దాసు.. వంటి ప్రసిద్ధ వాగ్గేయకారుల పాటలను తరచూ వినడం, విని ఆకళింపు చేసుకుని ఆ లయకు అనుగుణంగా, బాణీని సమకూర్చుకొని, శ్రమ జీవన సౌందర్యాన్ని వజ్రాల వంటి పాటల్లో ఇనుమడింపజేశారు. అందుకే ఎక్కడా కూడా ఎవరిని అనుసరించిన అనుకరించిన నేపథ్యం కనిపించదు. అందెశ్రీది ప్రత్యేకమైన శైలి. దానిని అందిపుచ్చుకోవడం అనేది అసామాన్యం.

**సినిమా ప్రస్థానం :**

ప్రస్తుత సమాజంలో సినిమాలో కనీసం ఒక పాటను అన్న, లేక మాటనైనా వ్రాయాలన్న కోరిక కలం పట్టిన ప్రతి కవికి కలగడం సహజమే. కానీ అందెశ్రీ గారి సినిమా ప్రస్థానానికి వస్తే, సినీ గీత రచయితగా ఒక గొప్ప చరిత్రను సృష్టించారు. అదేమిటంటే సాధారణంగా సినిమా దర్శకులు రచయితలకు కథను వినిపించి, వారు కోరిన విధంగా పాటలు రాయించుకుని నేపథ్యం కనిపిస్తుంది. కానీ అందెశ్రీకి అటువంటి దుస్థితి ఎప్పుడు రాలేదు. ఆచార్య బిరుదురాజు రామరాజు మరియు సూరమ్మ అనగా సూర్యదేవమ్మ గుర్తుచేసుకొని వ్రాసుకున్న గీతం..**"చూడ చక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి మళ్లీ జన్మంటూ ఉంటే సూరమ్మ! తల్లి నీ కడుపున పుడతా మాయమ్మ!!"** అన్న గీతం **ఊరు మనదిరా** అనే సినిమాలో ప్రముఖ నటులు, సినీ దర్శకులు ఆర్. నారాయణ మూర్తి గారు ఎంపిక చేసుకుని పెట్టడం జరిగింది. అలాగే వారి దర్శకత్వంలో వచ్చిన మరికొన్ని సినిమాలకు అందెశ్రీ గారి చేత ఏరి కోరి ఒక్క పాటనైనా ఎంపిక చేసుకుని పెట్టారు. **"మాయమై పోతున్నడమ్మా ! మనిషన్న వాడు! మచ్చుకైనా లేడు చూడు మానవత్వమే ఉన్నవాడు! నూటికి కోటికో ఒక్కడే ఒక్కడు! యాడ ఉన్నడొ గాని కంటికి కనరాడు!"** అనే గీతం పరిచయం అక్కర్లేని గీతం. మానవ జీవన క్రమ పరిణామ చిత్రాన్ని తెరకెక్కించిన ఈ గీతం డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేయడం జరిగింది అంటే ఎంత గొప్ప విషయం. ఈ గీతాన్ని ఆర్. నారాయణమూర్తి గారు **ఎర్ర సముద్రం** అనే చిత్రంలో పెట్టడం జరిగింది. **"కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిచి మొక్కితే అమ్మ రా!"** అంటూ గ్రామ దేవతలను కీర్తించిన గీతం వేగుచుక్క అనే సినిమాలో ప్రధాన గీతాలు నిలిచింది. అంతేకాదు వీర తెలంగాణ అనే సినిమాలో **"చూడు తెలంగాణ! చుక్క నీళ్లు లేని దాన! నా గోడు తెలంగాణ! బ్రతుకు పాడయిన వీణ!!"** అదే వరుసలు **జై బోలో తెలంగాణ** అన్న సినిమాలో **"గలగల గజ్జల బండి గళ్ళు చూడు/ ఓరుగల్లు చూడు నాటి కాకతీయులేలినట్టి ఖిల్లజూడు ! నా జిల్లా చూడు!!"** అన్న గీతాన్ని పెట్టడం జరిగింది. ఈ గీతం 1400 ఓరుగల్లు చరిత్రను కళ్ళ ముందు సాక్షాత్కరింప చేస్తుంది.

తెలంగాణలోని ఉమ్మడి ఇందూరు జిల్లాలో పూర్వం అత్యంత దారుణంగా ఉండే జోగిని వ్యవస్థను చూసి, ఆ తల్లుల వేధను గమనించి, తీవ్రంగా కలత చెంది, వాళ్ల బ్రతుకు చిత్రాన్ని పాటలుగా మలుచుకున్నారు. దాని పర్యవసానమే తర్వాతి కాలంలో గంగ అనే సినిమాగా మారి, అందులోని మాటలు, పాటలు పూర్తిగా అందెశ్రీ గారి సమకూర్చగా, ఆ చిత్రానికి నాలుగు నంది అవార్డులు రావడం విశేషం. అందులో జోగిని దుస్థితిని చెబుతూ.. **వెళ్ళిపోతున్నావ తల్లీ!**

**– నేల మసకబారీన జాబిల్లి!** అనే గీతం విశేషంగా జనాన్ని ఆకర్షించింది, అంతేగాక **ఒడిసె చెమట చుక్కల్లోన పొడిచే పొద్దులు ఎన్నమ్మో?! – బ్రతుకు పోరులోన నేల రాలే ప్రాణాలెన్నమ్మో!...** అంటూ సాగిన గీతం వ్యభిచార జీవన విధానాన్ని కళ్ళకు కట్టినట్లు చేయిస్తారు అందెశ్రీ గారు. ఇలా మొత్తం తన సినీ ప్రస్థానంలో 21 సినిమాలకు పాటలను అందించిన ఘనత అందెశ్రీ గారికి మాత్రమే చెల్లింది.

**అందుకున్న సత్కారాలు – సన్మానాలు :**

చిన్ననాడు సమాజం నుంచి ఎన్ని చీత్కారాలను అందుకున్నారో అనంతర కాలంలో అన్ని సత్కారాలను, ప్రముఖులచే అంతటి మర్యాదను పొందారు అందెశ్రీ గారు. కాలం ఎప్పుడూ ఏకతను ప్రదర్శించదు అంటూ వారి ఆత్మవిశ్వాసాన్ని నమ్ముకుని జీవించిన కవిశిఖరం అందెశ్రీ గారు.

1. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పట్టా ను పొందారు.

2. 2006 సంవత్సరంలో విడుదలైన గంగ సినిమాకు నంది అవార్డును అందుకున్నారు.

3. 2015 సంవత్సరానికి గాను డాక్టర్ రావూరి భరద్వాజ సాహితీ పురస్కారాన్ని పొందారు

4. 2025 సంవత్సరానికి గాను మహాకవి దాశరథి పురస్కారాన్ని పొందారు.

ఇవేకాక అందెశ్రీ గారి కీర్తి కిరీటాల్లో ఒదుగని, పొదుగని సన్మానం కానీ, సత్కారం కానీ లేదు అంటే అది అతిశయోక్తి అవుతుంది.

ప్రకృతిని ప్రేమిస్తూ, నిత్యం సమాజాన్ని అధ్యయనం చేస్తూ కొనసాగిన తన జీవితంలో ఎన్నో మలుపులు, ఎన్నో ఉత్థాన పతనాలు చూసిన అందెశ్రీ గారు ఏ రోజు అవకాశాల కోసం ఎక్కడా కూడా ఎదురు చూడలేదు. ఒక నిఖార్సైన వ్యక్తిగా, ఒక దార్శనికుడిగా, ఒక సామాజికవేత్తగా, ఒక ఆధ్యాత్మిక తత్వవేత్తగా, కులరహిత సమాజాన్ని కాంక్షించి, కులాలకు అతీతంగా జీవించినప్పుడే మనిషికి మనుగడ సాధ్యమవుతుంది అని వారి ప్రతి అక్షరంలో ప్రకటించారు. అంతేకాకుండా ఈనాటి సమాజం వారిని ఏ ఒక్క వర్గానికో, తెగకో అంట కట్టడం సబబు కాదు. అందెశ్రీ లోక కవి, సమాజ కవి, సహజ కవి, ప్రజాకవి, ప్రజల కవి. తన దైనందిన జీవితంలో ఎన్ని ఉద్యమాలు తనను, తన బ్రతుకును అతలాకుతలం చేసిన చలించక కేవలం కవిత్వం కోసమే జీవించి అక్షరాల కవిత్వ దీక్ష చేసిన మహనీయుడు అందెశ్రీ.



నేటి కాలపు ఎందరో కవులకు మార్గదర్శకులు అందెశ్రీ గారు. తన కవితా ప్రస్థానంలో ఒకచోట చెప్పినట్టు **"సొమ్ములకు నా కవిత అమ్మ చూపనుగాన / రొమ్మిరిసి చెబుతున్న అమ్మ పైన అని! కవిత నేరాయ చేజాచి కాసులడుగా! సిరులకెప్పుడు నిన్నమ్మ సిగ్గుమాలి"** అన్న దీశాలి. బ్రతుకంతా తెలుగు నేలకు వాగ్గేయార్చన చేసిన నిరంతర కవితా ఝరి. అందుకే ఏ అవకాశం అయినా తనను వెతుక్కుంటూ వచ్చాయి తప్ప, తాను ఏ అవకాశం కోసం ఎదురు చూడలేదు. కాలమే తనకు తోడుగా ఉంటుంది అని నమ్మిన స్వాభిమానికేతనం అందెశ్రీ.

నేలను విడిచి మనిషి ఎప్పుడైతే సాము చెయ్యాలి అనుకుంటాడో అప్పుడే వాడు చచ్చినట్టు లెక్క అన్న జీవన సత్యాన్ని గుర్తు ఎరిగిన రచయిత. **"ఈ లోకం నీ ఇల్లు / జనమంతా నీ వాళ్ళు / ప్రగల్భాలు మార్చుకో / ప్రజల నుండి నేర్చుకో//"** అంటూ హితవు పలికిన అందెశ్రీ గారు 2025 నవంబర్ 10వ తేదీన ఈ లోకాన్ని విడిచి (వాక్కులమ్మ చరణ సేవకు) వెళ్లారు.


తన కలం ద్వారా, తన గళం ద్వారా జన హితాన్ని కాంక్షించిన రచయిత, లోక కవి అందెశ్రీ గారి ఆశయం ఎప్పుడు సమాజ ఉన్నతి కోసమే పరితపిస్తూ ఉంటుంది. వారి పాటల ద్వారా, సాహిత్యంలో వారు వేసిన బాటల ద్వారా నిరంతరం జాతి చైతన్యానికి తోడ్పాటును అందిస్తూనే ఉంటుంది, ఆచంద్రతారార్కం అందె సిరి వెలుగు వెలుగుతూనే ఉంటుంది, గుర్రం జాషువా గారు చెప్పినట్లు **"సుకవి జీవించు ప్రజల నాలుకల యందు"** ఈ పుడమి తల్లి పులకరించేలా సాహితీ జగత్తులో నిత్యం అందెల సందడి మ్రోగుతూనే ఉంటుంది. తెలుగు సాహితీ యవనికై అందెశ్రీ అనే మూడక్షరాలు ఎప్పుడూ నిలిచే ఉంటాయి.! జయహో అందెశ్రీ!!

**(అందెశ్రీ గారికి భార్య మల్లమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.)**

❖ ❖ ❖ ❖ ❖

# అమృత ప్రాయుడు – అందెశ్రీ

డా. అంబటి సురేంద్ర రాజు, ఫోన్ : 87 90 90 8538



తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా గంధర్వలోకం నుంచి దిగివచ్చిన వాగ్గేయకారుడు అందెశ్రీ. కులమతాల అణచివేతను గట్టిగా పట్టించుకుంటే అడుగులు అసంకల్పితంగా అటు దిశగా పడతాయనే గ్రహింపు ఉన్నవాడు కనుక, పుట్టుక వలన ఎదురైన ఇక్కట్లను అవసరార్థం నిగ్రహించుకొని, అప్పటికి పక్కన పెట్టి, స్థానికుడిగా ప్రాంతీయ అణచివేతను, పీడనను తన గళంతో ముఖాముఖి ఒంటిగా ఎదుర్కొన్న ధీశాలి అందెశ్రీ. బడి చదువులకు బహుదూరంగా మనుగడ సాగించడం వలన, నేటివ్ ఇంటెలిజెన్స్ చెక్కు చెదరకుండా సహజ స్థితిలో ఉండటం వలన, స్వాభావికంగా, అప్రయత్నంగా అతడు పాటగాడయ్యాడు. పుట్టిన పల్లె, చేపట్టిన పనులు అందెశ్రీని కవిగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాయి.

తెలుగునాట పేరెన్నికగన్న పెక్కుమంది పాటకవులకు అందివచ్చిన వామపక్ష రాజకీయ నేపథ్యం అందెశ్రీకి లేకపోవడం మూలాన కవి/ గాయకునిగా ఆయన సామాజిక అస్తిత్వం ప్రశ్నార్థకమైంది. వామపక్ష భావజాలంతో ప్రభావితులైన కవులకు ఉండే సైద్ధాంతిక పరిమితి అందెశ్రీకి లేకపోవడం అతని రచనా వ్యాసంగానికి స్వేచ్ఛను ప్రసాదించింది.

నిష్కర్షగా చెప్పాల్సి వస్తే అందెశ్రీ అడుగుజాడ జానపదం కాదు. తెలంగాణ శూద్ర/అతిశూద్ర జనుల నోట మనం వినే పలుకుబడులు అందెశ్రీ పాటలలో శ్రోతలు అరుదుగా కనుగొంటారు. అందుకు కారణం ఒక్కటే. అందెశ్రీ సాంస్కృతిక మూలాలు పద్య/గేయ సంప్రదాయంలో ఉన్నాయి. ప్రాచీన కావ్యాల శ్రుత పాండిత్య ప్రభావం అతడిని సమకాలీన సాహితీ ప్రపంచంలో ఒంటరిని చేసింది. విద్యాధిక పాటల కవులు అనేకులు జానపద బాణీలతో ప్రభావితమై ఆ బాణీలకు లోబడి పాటలు కైగడుతుంటే, ఒకేఒక్క అందెశ్రీ వారికి పూర్తి భిన్నంగా జానపద బాణీల ప్రభావం కనిపించని సంప్రదాయ /వ్యవహార భాషలో రాసిన తన పాటలకు తనవైన బాణీలతో పాటలు కట్టి తెలంగాణ అంతటా కంచుకంఠమై గర్జించాడు.

తొలినాళ్లలో అందెశ్రీ పద్య కవిత్వం రాసిన దాఖలాలు ఉండటం ఈ వాస్తవాన్ని రుజువు చేస్తున్నది. పద్యం/ గేయం/గీతం విధించే ఆంక్షలు/నిషేధాలను కాలగతిలో అతిక్రమించి పాటకవిగా పరిణమించిన క్రమాన్ని, తనదైన విశిష్ట కవన అస్తిత్వాన్ని సాధించిన క్రమాన్ని అందెశ్రీలో మనం చూస్తాం. గద్దర్, గోరటి వెంకన్న వంటి అగ్రగామి పాటకవులలో స్థూలదృష్టికి సైతం కనిపించే 'జానపద' పరిమితి అందెశ్రీలో సూక్ష్మదృష్టికి సైతం కనిపించకపోవడం (కనిపించినా అరుదుగా కనిపించడం) గమనార్హం.

అకడమిక్ చదువులకు నోచుకున్న కవులు ఒకవైపు పల్లెను వీడి, జానపద సంప్రదాయంలో పాటకవులుగా రంగప్రవేశం చేస్తే, మరోవైపు ఏ చదువుకు నోచుకోని అందెశ్రీ పల్లెను వీడక పండిత సంప్రదాయంలో పాటకవిగా రంగమెక్కడం విశేషం. తెలుగునాట ఇది అత్యంత అరుదైన సందర్భం.

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో పాలుపంచుకుని, వివిధ దశలలో పాటలు రాసి పాడి జనానికి చేరువైన హెచ్చుమంది కవులంతా దాదాపు కుల, మత, లింగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ అణచివేతపై పాటలు రాస్తూ, అందరికందరూ ఒకవైపు జట్టు కడితే, అందెఖ ఒక్కడు అందుకు విరుద్ధంగా, సామాజిక పీడనల జోలికి పోకుండా, తనదైన స్వీయ సంప్రదాయానికి కట్టుబడి విడిగా, ఒంటిగా మెజారిటీకి అభిముఖంగా నిలుచుని, కేవలం తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా శాయశక్తులా పాటుపడి, చివరికి ఆ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసి చూపించాడు.

ఈ క్రమంలో తోటి దళిత బహుజన సామాజిక ఉద్యమ వేదికల బాధ్యుల కంటగింపుగా మారేందుకు కూడా వెనుకాడలేదు.

అందుకే, అందెశ్రీ అవ్వల్ దర్జా పాటకవిగా నిలిచాడు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 2 (17) హైదరాబాద్ డిసెంబర్ : 2025

# వైవిధ్య భాషా సమ్మిళితం - అందెశ్రీ గీతం

**డా. పసునూరి రవీందర్,** కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత. ఫోన్ : 7702 648 825



తెలుగు నేల మీద వాగ్గేయ సంప్రదాయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. త్యాగయ్య, అన్నమయ్య, భక్త రామదాసు, దున్నా ఈద్దాసు, వేపూరి హనుమద్దాసు, రాకమచర్ల వేంకటదాసు వంటి ప్రాచీన వాగ్గేయకారులు ఎందరో ఉన్నారు. తమ భక్తిని చాటుకోవడానికి కీర్తనలు, సంకీర్తనలు వేలకొలదిగా రచించారు. తెలుగు సాహిత్యాన్ని ఈ వాగ్గేయ సాహిత్యం మరింత సంపద్వంతం చేసింది. శైవ, వైష్ణవ సంప్రదాయాల కోసం కవులు కవిత్వం రాయడం ఒక యుద్ధప్రాతిపదికన కొనసాగిన చరిత్ర కూడా ఉంది. పండితులనే కాకుండా పామరులను సైతం ఆలోచింపజేసేలా భక్తిభావనను ప్రచారం చేయడానికి గేయాన్ని ఆశ్రయించారు వాగ్గేయకారులు. ఆధ్యాత్మిక చింతనతో కూడిన ఈ ప్రాచీన వాగ్గేయ సాహిత్యం బలమైన ప్రభావాన్నే వేసింది. ఇక ఆ తరువాత ఆధునిక కాలాన వెలువడిన ప్రజావాగ్గేయ సాహిత్యమంతా ఎక్కువగా అభ్యుదయ భావజాలంతో కూడుకున్నదే. సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, గద్దర్, గూడ అంజన్న, మాస్టార్జీ, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజు తదితర వాగ్గేయకారులంతా తిరుగుబాటుతత్వాన్నే పాటల్లోకి ఒంపారు. వీరి పాటల్లోని వస్తు, శిల్పాల్లోనే కాదు, సృజనలో కూడా ఎవరి పంథా వారికే ఉంది. ముఖ్యంగా ప్రస్తుత సందర్భంలో అందెశ్రీ అకాల మరణానంతరం ఆయన పాటల్లోని విశేషాల మీద ఎక్కువమంది పరిశోధకులు, విమర్శకులు దృష్టి సారిస్తున్నారు.

అందెశ్రీ పాటలకు మిగిలిన వాగ్గేయకారుల పాటలకు ఒక స్పష్టమైన భాషాపరమైన తేడా ఉంది. గోరటి వెంకన్న వంటి వాగ్గేయకారులు పూర్తిగా తెలంగాణ గ్రామీణ మాండలికంతో పాటలు అల్లి ప్రపంచాన్ని ఆకట్టుకున్నారు. అందెశ్రీ మాత్రం తన పాటల్లో రెండు రకాలైన భాషను ప్రయోగించారు. తాను పండితుల సాహచర్యంలోకి వెళ్లక ముందు అచ్చమైన గ్రామీణ పదాలతో కూడిన పాటలు అల్లి రంజింపజేశారు. అలాగే పండితులను సైతం సమ్మోహన పరిచేలా గ్రాంథిక పద ప్రయోగాలు చేసిన పాటలు సైతం రచించాడు. ఈ రకమైన వైవిధ్యమే అందెశ్రీని ప్రత్యేకంగా నిలబెట్టింది.

**పల్లె పద ప్రయోగ పాటలు :**

తెలంగాణ మాండలిక భాషతో కూడిన పాటలను అందెశ్రీ అత్యంత హృద్యంగా సృజించారు. ప్రజల నోళ్లల్లో నానుతున్న పదాలను తన పాటల్లోకి ఒంపి ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. నిజానికి ఈ రకమైన పాటలు రాయడానికి అందెశ్రీ ప్రత్యేకమైన సాధనేది చేయాల్సిన పనిలేదు. తాను పుట్టిన వరంగల్ జిల్లా గ్రామీణ నేపథ్యమే తనను అటువైపుగా ప్రేరేపించింది. చిన్ననాడు తాను పశువుల కాపరిగా చూసిన, అనుభవించిన జీవితం తనకు, తన పాటకు కావాల్సిన నేపథ్యాన్ని అందించింది. అందుకే ఈ రకమైన పాటల్లో అత్యంత సహజంగా వాటిని సృజించారు అందెశ్రీ. ప్రజల జీవనవిధానం, పలుకుబడులు, ఆచార వ్యవహారాలు, వాటితో పాటు వారి జీవన తాత్వికత ఈ వాగ్గేయకవి పట్టుకున్నారు. అట్లా పాటల్లోకి తీసుకొచ్చి ప్రాణం పోశారు. అయితే ఈ పాటలు తెలంగాణ ఉద్యమం కంటే ముందు రాసినవి. అప్పుడు ఇప్పుడున్నంత సామాజిక మాధ్యమాలు అందుబాటులో లేవు. అప్పుడంతా క్యాసెట్ల కాలం. అందుకే ఎక్కువమందికి తెలియవు. ఈ పాటల్ని పరిశీలిస్తే అందెశ్రీ పాటల్లో ఉన్న సహజ మాండలిక సంపద ఏమిటో అర్థమవుతుంది.

తెలంగాణ నేల మీద భాషాపరంగా అనేక వైవిధ్యాలు ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలు మాట్లాడే మాండలికాన్నే తెలంగాణ మాండలికంగా పరిగణించే దృష్టికి ఎక్కువ ప్రాచుర్యం ఉంది. అందుకు కారణం ఉత్తర తెలంగాణ జిల్లాలైన కరీంనగర్, వరంగల్కు సరిహద్దులుగా ఇతర రాష్ట్రాల జిల్లాలు లేవు. అందువల్ల ఇక్కడి ప్రజలు మాట్లాడే భాషలో ఈ రకమైన ప్రత్యేకతను చూడవచ్చు. మిగిలిన జిల్లాలు సరిహద్దుల్లో ఉండడం వల్ల వాటికి ఆ సరిహద్దు రాష్ట్రాల భాషల ప్రభావానికి తెలంగాణ మాండలికం గురవుతుంది. అందెశ్రీ పూర్వ వరంగల్ జిల్లాలో జన్మించడం వల్ల ఆయన పాటల్లో ఈ ఉత్తర తెలంగాణ మాండలికం సహజంగా వచ్చి చేరింది. ఆయన తొలిరోజుల్లో రాసిన పాటల్లో ఈ ప్రయోగాలను ఎవ్వరైనా సులభంగానే గుర్తించవచ్చు.

**"తలమీద సుట్టాబట్టా**
**ఆ పైనా పండ్లా తట్టా...**
**పండ్లు పండ్లోయని పల్లెంత తిరుగుకుంటూ**
**బజార్ల కూర్చోని అమ్మి**
**బతుకెల్లా దీసుకున్న...తెనుగోల్ల ఎల్లమ్మా ఏది?**

**మన పల్లెలల్ల కండ్లల్ల కానారాదేమి"** (పాటల పూదోట) అంటూ అందెశ్రీ రాసిన పాట నాటి తెలంగాణ పల్లెను, బహుజన కులాల జీవితాన్ని కండ్లకు కదుతుంది. ఇందులో వాడిన తెలంగాణ మాండలిక పద ప్రయోగాలు ఎవ్వరి హృదయాన్నైనా కరిగింపజేస్తాయి. ఊళ్లల్లో పండ్లమ్ముకునే తల్లులు అమ్మేటప్పుడు వారు కూసే కూత "పండ్లు..పండ్లో" అని. ఆ మాటను యథాతథంగా కవి పాటలో పలికించారు. అలాగే 'బతుకెల్లదీసుకోవడం' అనే మాట కూడా నేటికి గ్రామీణ ప్రజలు వాడుకునే మాటే. అట్లాగే 'కండ్లల్ల కానరాదేమీ'అనే మాట కూడా అచ్చమైన జానపద పదం. ఆ మాటను కూడా అందెశ్రీ అద్భుతంగా ప్రయోగించాడు. ఈ పదానికి ఒక తాత్విక గాఢత ఉంది. అన్ని రోజుల పాటు కనిపించిన మనిషి, ఇప్పుడెందుకు కానరావడం లేదనే ఒక దిగులు ఈ ఒక్క మాటలోనే పలికించాడు రచయిత. అట్లాగే ఈ పాట నిండా తెలంగాణ మాండలికం మత్తడి దుంకింది. ప్రతీ పదంలో అచ్చమైన తెలంగాణ జానపద సోయగం తొణికిసలాడింది.

**"కమ్మంగ ఉదుకబెట్టి, తల్లీ జాడ పల్లెల్ల కానరాదేమీ, సిమసింతకాయలు, సింతపలుకపండ్లు, ఊసిల్ల, అడవిని గుత్తాపట్టి, తిండిగింజల కోసం తిప్పలు, కండ్లల్ల నల్లాపూస, బుద్ధి ఏడ తీరేది, కాసన్ని పండ్లు కొసరేసి, వలలు సీకీపోయే, కట్టమనక తిరిగి అమ్మి, పొట్టాపోసుకున్నా, పొరకాపొరకయ్యి పోతుందో, ముచ్చట్లు, పలుగుల జాడ, అల్లాడిపోవడం, గోసెల్లపోయడం"** వంటి పదాల కూర్పుతో ఈ పాటకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు అందెశ్రీ. అలాగే **'సూడు తెలంగాణ సుక్కనీరు లేనిదానా'**అంటూ సాగే మరో ఉద్యమ గీతంలో కూడా అందెశ్రీ ...తెలంగాణ గ్రామీణ ప్రజల యాసను ఉపయోగించారు.

**"సూడు తెలంగాణ సుక్కనీరు లేని దానా**
**మా గోదు తెలంగాణ బ్రతుకు పాడైన వీణ**
**ఇది దగాపడ్డ దరువు మాకేది బతుకుదెరువు**

**అరె నినాదాలు కాదు రాష్ట్ర పునాదులే కదలాల"** (కన్నీటి పాట సంకలనం నుండి) అంటూ వాడుక భాషలో పాటను పరవళ్లు తొక్కించారు. ఒకవైపు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టారు. మరోవైపు అచ్చమైన మాండలిక సొగసును ప్రయోగించారు. 'చూడు' అనడానికి బదులు జనవ్యవహారంలో ఉన్నట్టు 'సూడు' అని వాడారు. 'గోదు, దగాపడ్డ దరువు'వంటి మాటలు ప్రజల్లో ఉన్నవే. **"ఇల పారినా, కంటనీరు కారిన, పంచ జేరి వంచించగా, గుండెపలిగి, మందే ఆకలి కేకలు"** వంటి పదాలను ప్రయోగించారు.

**గ్రాంథిక పద ప్రయోగ పాటలు**

అందెశ్రీ పాటల్లో కొట్టొచ్చినట్టు కనపడేది భాషా ప్రయోగం. గ్రామీణ ప్రాంతంలో అక్షరాస్యత లేని కుటుంబం నుండి వచ్చారు తాను. చిన్ననాడు చదువుకోలేదు. అయినా సరే పాట అల్లడంలో మెలుకువలు ఒంటపట్టించుకున్నారు. ఆ తరువాత అందెశ్రీ సాధనలో కనుగొన్న విషయం పాటను భిన్నంగా నిలిపేది ప్రత్యేకమైన పదజాలమే (Separate Diction) అనేదాన్ని గుర్తించాడు. అందుకే తన పాటల్లో గొప్పగొప్ప పదప్రయోగాలు చేశారు. పాటలో తాను చెప్పదలుచుకున్న భావం తాలూకు గాఢ సాంద్రతను పలికించడానికి తాను గ్రాంథిక భాషను ఆశ్రయించారు. ఎంతో విద్యను అభ్యసించిన వారికి మాత్రమే సాధ్యమయ్యే ఈ ప్రయోగ పద్ధతి...అందెశ్రీకి అలవోక అలవడడం ఆశ్చర్యకరమైన విషయం.

తాను పుట్టిన వరంగల్ జిల్లా చారిత్రకంగా ఎంతో పేరుగాంచింది. క్రీ.శ. 11,12 వ శతాబ్దాల కాలంలో ఈ ప్రాంతాన్ని ఏలిన కాకతీయుల రాజధాని ఇది. అందుకే అందెశ్రీ ఈ 12వ శతాబ్దం నాటి చరిత్రను ఇప్పటి దాకా కొనసాగిన వందల యేండ్ల చరిత్రను పాటలో వర్ణించాడు. వరంగల్ చరిత్ర మీద చాలా తక్కువగానే పాటలు వచ్చాయి. వాటిలో ఇది తలమానికమైంది ఈ పాట. ఇందులో కూడా అందెశ్రీ గ్రాంథిక పద ప్రయోగాలనే చేశారు.

**"గలగల గజ్జెల బండి ఘల్లు చూడు ఓరుగల్లు చూడు**

**నాటి కాకతీయులేలినట్టి ఖిల్లా చూడు నా జిల్లా చూడు"**(అందెల సవ్వడి పాటల సంపుటి) అంటూ సాగే ఈ పాట నిండా స్థల చరిత్ర పరవళ్లు తొక్కింది. జిల్లాలో పేరుగాంచిన ప్రదేశాలు, వ్యక్తులు, చరిత్రను అందెశ్రీ ఇందులో ఎలుగెత్తి చాటారు. అదే సమయంలో చరిత్రకు సంబంధించిన పాట కావడం వల్లనేమో చాలా వరకు పండిత భాషనే ప్రయోగించారు.

**'గండరగండడు, చిరస్మరణీయుడు, నాట్యాచార్యుడు, విజయ తోరణ వింతలు, కళామతల్లి, కాలరుద్రుడు, గతమెంతో ఘనకీర్తి, వేల్పులగుండె, మొక్కవోని ధ్వని అనుకరణ, గారాలబిడ్డ, అక్షరశిల్పుల రక్షణకవచం"** వంటి పద ప్రయోగాలు ఈ పాటలో ఎన్నో చేశారు అందెశ్రీ. జానపదాన్ని వదలకుండానే ఇట్లా గ్రాంథిక పదాండబరం వెంట నడిచారు. సాహిత్యంలో పేరుగాంచిన వారు, వారి రచనల్లో ఇట్లా ప్రయోగాలు చేశారనే విషయాన్ని తెలుసుకున్నందువల్లనే, తాను ఇటువైపు తన దృష్టి నిలిపారు.

అలాగే తెలంగాణ రాష్ట్రానికి రాష్ట్ర గీతంగా ఉన్న **'జయజయహే తెలంగాణ'**పాట నిండా కూడా ఇలాంటి పద ప్రయోగాలే పదపదాన దర్శనమిస్తాయి. సాధారణంగా ఆధ్యాత్మిక గ్రంథాల రచనలో ఉండే ప్రామాణిక భాషా ప్రయోగం వాటి యొక్క స్థాయిని పై మెట్టులో నిలుపుతుంది. అలాగే అందెశ్రీ ఆయా సందర్భాలలో రచించిన ప్రామాణిక పాటల్లో భాషను పండిత భాషనే నిలిపే ప్రయత్నం

చేశాడు. దాని వల్లనే ఆ పాటలకు ఒక ఆదరణ లభిస్తుందనుకుని ఉంటాడు. కొన్నిసార్లు పదాల అర్థాలు తెలియకపోయినా పాటను అభిమానించేతనం ఆధ్యాత్మిక భక్తి పాటల్లో ఉంటుంది. సంస్కృత భూయిష్టమైన సమాసాలతో కూడిన పాటల పట్ల భక్తులు అమితాసక్తిని కనబరుస్తారు. ఈ కారణం వల్లనే అందెశ్రీ కూడా ఈ రాష్ట్ర గీత రచనలో అలాంటి ప్రయోగాలను కనబరిచారు.

**"జయజయహే తెలంగాణ జననీ జయకేతనం**
**ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం**
**తరతరాల చరిత గల తల్లీ నీరాజనం**
**పదిజిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం"** (జాగో జగావో సంకలనం నుండి) అంటూ సాగే ఈ రాష్ట్ర గీతం నిండా గ్రాంథిక పద ప్రయోగం దండిగా చేశారు అందెశ్రీ. **"చేతనం, నీరాజనం, ప్రణమిల్లిన శుభతరుణం"** వంటి పదాల యొక్క అర్థాలు చదురాని వారికే కాదు, చదువు వచ్చిన వారికి సైతం సగం సగమే అర్థమయ్యే అవకాశం ఉంది. అందుకు కారణం అవి వాడుకలో లేవు. అందెశ్రీ మాత్రం వాడుక భాషను కాదని ఈ రకమైన ప్రయోగాలు ఈ పాట నిండా చేశారు. **"కళాప్రభలు, క్రాంతిరేఖ, జావళీలు, కవిగాయక వైతాళిక, కళల మంజీరాలు, జాగృతపరిచే, అనునిత్యం, పసిడి సిరులు, సుభిక్షం, స్వరాష్ట్రం, స్వర్ణయుగం"** వంటి పద ప్రయోగాలు చేశారు అందెశ్రీ.

ఇక తెలంగాణ ఉద్యమ కాలంలో రాసిన **'జనజాతరలో మనగీతం'** పాటలో కూడా అందెశ్రీ ఇలాంటి పద ప్రయోగాలు విరివిగా ఉపయోగించారు.

**"జనజాతరలో మన గీతం**
**జయకేతనమై ఎగరాలి**
**ఝంఝూ మారుత జననినాదమై**
**జేగంటలు మ్రోగించాలి...**
**ఒకటే జననం...ఓఓఓ**
**ఒకటే మరణం...ఓఓఓ**
**కష్టాల్ నష్టాల్ ఎన్నెదురైనా కార్యదీక్షలో తెలంగాణ"** (నిప్పులవాగు సంకలనం నుండి) అంటూ ఈ పాటలో అనేక గ్రాంథిక పద ప్రయోగాలు చేశారు.

ఆధ్యాత్మిక చింతనతో కూడిన తాత్విక గీతాలు కూడా అందెశ్రీ రచించారు. అందులో ఒకటైన **"పాము పడగపై పాదిగినట్టి ఆ పాదముద్రలు ఎవరివో..."** పాట. ఈ పాటలో అందెశ్రీ కొన్ని తాత్విక ప్రశ్నలు వేశారు. ఆ సందర్భంలో గ్రాంథిక పదాల రుచిచూపించారు.

**అన్యభాషా పద ప్రయోగ పాటలు**

అందెశ్రీ తెలుగు, సరళ గ్రాంథిక సంస్కృత పద ప్రయోగ పాటలే కాకుండా అన్యభాష పద ప్రయోగ పాటలు కూడా సృజించారు. తాను పుట్టిన నేల అచ్చమైన తెలంగాణ పల్లె. ఈ ప్రాంతాన్ని నిజాం



రాజులు పాలించడం వల్ల ఇక్కడి భాషలో ఉర్దూ పదాలు కలగలిసి ఉంటాయి. అవి జన వ్యవహారంలో బలంగా ఉన్నాయి. అందుకే తాను ఆ విషయాన్ని కనుగొని అన్య భాష ప్రయోగాలతో కూడుకున్న పాటలు కూడా రచించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో అందెశ్రీ రచించిన జనజాతరలో పాటలో అనుపల్లవిలో **"జైబోలో తెలంగాణ"** అంటాడు. ఇందులో ఈ బోలో అనే మాట ఉర్దూ భాషకు చెందినది. అలాగే గలగల గజ్జెలబండి పాటలో **"జాగోరే జనగామను చూడు"** అంటాడు. ఈ 'జాగోరే' అనే మాట కూడా ఉర్దూనే. అలాగే 'కాజీపేట జంక్షన్' అంటాడు. అది ఆంగ్ల పదం. 'దర్జాగా పారెనేమి' అనే పదంలోని 'దర్జా' కూడా ఉర్దూ పదమే.

ఇట్లా అందెశ్రీ తన పాటల్లో భాషా వైవిధ్యాన్ని ప్రదర్శించారు. కేవలం ఒకే రకపు భాషకే పరిమితం కాకుండా ఒకవైపు జన వ్యవహారికంలో ఉన్న భాషతో పాటు, సాహిత్యంలో పేరుగాంచిన లబ్ధ ప్రతిష్టులు ప్రయోగించే భాషను సైతం ప్రయోగించి అన్ని వర్గాల ప్రజల చేత ప్రశంసలు అందుకున్నారు. భావాన్ని ప్రజలకు చేర్చే సాధనం భాష. అందెశ్రీ మాత్రం తన ప్రేక్షకులు ఒకే వర్గంగా లేరనే విషయాన్ని గమనించి, ఈ రకంగా రకరకాల ప్రయోగాలు చేసి, అన్ని సమూహాలను అలరించాడు, ఆలోచింపజేశాడు. ఈ పరిశీలన ఆధారంగా అందెశ్రీ మొత్తం పాటలను పరిశోధించవచ్చు. భాషా శాస్త్ర పరంగా పలు విషయాలను వెలుగులోకి తీసుకురావచ్చు.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

**అందెశ్రీ పాటల సంకలనాలు :** పాటల పూదోట, అందెల సవ్వడి.

అందెశ్రీ సంపాదకత్వంలో వచ్చిన నిప్పుల వాగు తెలంగాణ ఉద్యమ పాటల సంకలనం.

ప్రజాకళామండలి: 2007, కన్నీటి పాట, ప్రజాకళామండలి పాటలు, పీకేఎం ప్రచురణలు, హైదరాబాద్

రవీందర్, పసునూరి: 2016, తెలంగాణ ఉద్యమ పాట, తేనా పబ్లికేషన్స్, హైదరాబాద్

స్కైబాబ: 2009, జాగోజగావో, తెలంగాణ ఉద్యమ కవిత్వం, తెలంగాణ కవులు, కళాకారుల ప్రచురణ

❖ ❖ ❖ ❖ ❖

# పాటల పరిమళం - అందెశ్రీ

**తోట శారద,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 990880 3471

ప్రజాకవిగా, ప్రకృతికవిగా ప్రసిద్ధులైన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఆయన అనాథ కావడం వల్ల ఏ విధమైన చదువు చదువుకోలేదు. గొర్రెలతో తిరుగుతూ ప్రకృతిని చూసి పరవశించిపోయి, పాటలు పాడుతున్న అందెశ్రీని చూసిన శృంగేరి మఠం పీఠాధిపతి స్వామి శంకర్ మహారాజ్ ఇతన్ని చేరదీశారు. అందెశ్రీ కూడా అనుభవాల నుంచి నేర్చుకున్న జీవిత పాఠాలకు పదును పెట్టి వాటిని గేయాలుగా మలుచుకున్నారు. ఈయన రాసిన పాటలన్నీ ప్రజాదరణ పొందినవి.

తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వచ్చిన జై బోలో తెలంగాణ చిత్రంలో ఆయన రాసిన పాట అత్యంత ప్రజాదరణ పొందినది.

**"జన జాతరలో మనగీతం జయకేతనమై ఎగరాలి**
**ఝుంఝూ మారుత జన నినాదమై జై గంటలు మోగించాలి"**

అంటూ తెలంగాణలోని ప్రజలు ఒక చోట గుమిగూడి ఐకమత్యంతో తెలంగాణ ఉద్యమ జాతరను జరుపుకుంటారు. ఉధృతంగా వీచే గాలిలా మన తెలంగాణ నినాదం విజయ కాంక్ష తెలిపే సంకేతాన్ని ఈ గేయంలో చెప్పారు. మనిషి జీవితంలో ఒకేసారి జననం ఉంటుంది. ఒకేసారి మరణం ఉంటుంది. బ్రతికినన్నాళ్లు నీ ప్రాంతం కోసం లేదా నీ దేశం కోసం బ్రతకడంలోనే నిజమైన బ్రతుకు ఉందని రచయిత స్పష్టంగా చెప్పారు. తెలంగాణ విద్యార్థులందరి తెగింపును, ఉద్యమ ఆకాంక్షను ఈ పాటలో రచయిత స్పష్టంగా వర్ణించారు. ఎర్ర సముద్రం సినిమాలోనూ అందెశ్రీ అద్భుతమైన పాటను రాశారు.

**"మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు**
**మచ్చుకైనా లేదు చూడు మానవత్వం ఉన్నవాడు"**

ఇందులో మనుషుల మధ్య ఉన్నటువంటి మానవత్వం గురించి వివరించడం జరిగింది.. మనిషికి మరొక మనిషి చేదోడువాదోడుగా ఉంటూ కలిసి మెలిసి జీవనాన్ని కొనసాగించేవారు. కానీ ఇప్పుడు నడుస్తున్న ఈ ఆధునిక కాలంలో స్వార్థం అనే మత్తులో మునిగిపోయి మానవత్వం మరచిపోతున్నాడు. అని రచయిత మానవ సమాజం పై అక్షర బాణాలను సంధించినాడు. ఆత్మీయ బంధాలను విడిచి, మనిషి తనకు తానే దిగజారిపోతున్నాడు. నీతి నిజాయితీ అనేది మచ్చుకు కూడా కనపడటం లేదు. అవినీతి చీకట్లో కూరుకుపోయి అల్లాడుతున్నాడు. స్వేచ్ఛగా సాగించవలసిన జీవితాన్ని, అగాధంలోకి నెట్టి వేస్తున్నాడని రచయిత ఈ పాటలో చాలా చక్కగా విశదీకరించారు. వేగుచుక్కలు సినిమాలోని మరో అద్భుతమైన పాట రాశారు (వేగుచుక్కలు)లోని..

**"కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిచి మొక్కితే అమ్మరా"**

అనే పాటను పరిశీలించినట్లయితే చెట్టుకు ఉన్న కొమ్మను చెక్కితే బొమ్మలా తయారవుతుంది. అదే కొమ్మను చెక్కకుండా కాపాడుకుంటే ఆయువు పోసే అమ్మలా ఆదరిస్తుంది. జాతి ఎదలో సజీవంగా ఉన్న జానపదాలను తెలంగాణా గ్రామాలను కాపాడటానికి ఎన్నో గ్రామదేవతలు వెలిశాయి. గృహాలను వదిలి గూడు కట్టుకొని, వారి గుండెల్ని రాయి చేసుకున్నవారు ఎందరో ఉన్నారు. వారు కండల్ని కరిగించి కన్న కలలు పండించుకోవడానికి ఎంతో కష్టపడ్డారని ఈ పాటలో రచయిత బలంగా చెప్పారు.

**'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం తరతరాల చరిత గల తల్లీ నీరాజనం పది జిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం'**

జై తెలంగాణ జై జై తెలంగాణ అంటూ అందెశ్రీ తెలంగాణ జాతీయ గీతాన్ని రచించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలంతా ఒకే తాటిపై నడిచేలా ఈ పాటను రూపొందించారు. అందరిలోనూ తెలంగాణ కాంక్షను నింపారు.

ప్రజలంతా ఒకే గొంతుతో ఒకే నినాదంతో చైతన్యవంతులై ఒక చారిత్రక నేపథ్యంకై పాటుపడుతున్నారు. అది శుభతరుణం అని రచయిత కొనియాడారు. పోతన మహాకవి, రుద్రమదేవి, కొమరం భీం పరాక్రమాన్ని, రామప్ప శిల్పకళా నైపుణ్యాన్ని, గోల్కొండ చార్మినార్ వైభవాన్ని గొప్పగా కీర్తించారు.

**గంగ** చిత్రంలోని **వెళ్ళిపోతున్నావా తల్లి మసకబారిన జాబిల్లి** అనే పాట, **అధిపతి** సినిమాలో **ఆడ బతికే పాడు బతుకని** అనే పాట, **బతుకమ్మ** సినిమాలో **చినుకమ్మ వాన చినుకమ్మ** అనే పాట, **పోరు తెలంగాణ** సినిమాలో **చూడు తెలంగాణ సుక్క లేని నీళ్ల దాన** మొదలైన పాటలు అందెశ్రీ ప్రతిభకు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. స్వర్ణక్క, సింగన్న, గంగమ్మ జాతర, తెలంగాణ మొ॥ 21 సినిమాలకు దాదాపుగా 50 పాటలు వరకు రచించారు. ఆయన సినిమా పాటలే కాకుండా ప్రైవేట్ పాటలు ఎన్నో రాశారు. ఆయన పాటలన్నీ అటు పండితులకే కాదు ఇటు పామరులకు కూడ అర్థమయ్యే భాషలో రాశారు. కాబట్టి ఆయన రాసిన పాటలన్నీ బహుళ ప్రజాదరణ పొందినవి అని చెప్పవచ్చు. అందెశ్రీ పాటల్లో ఎక్కువగా మనకు వాస్తవజీవితం కనిపిస్తుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :** 1. తెలంగాణ సినీ గేయ వైభవం: డా॥ కందికొండ. 2. ప్రజాకవి అందెశ్రీ.. వ్యాసం: బొడ్డు మహేందర్ 3. పరుగెత్తు నా పాట ప్రజల నోట వ్యాసం : అందెశ్రీ

# లోకకవి, వాగ్గేయకారుడు 'అందెశ్రీ' తత్త్వం

**డా. బండారు సుజాత శేఖర్**, రచయిత్రి, ఫోన్ : 98492 77389

**విత్తనంలోకి వెళ్లడం అంటే**
**మనలోకి మనం తొంగి చూడడమే**
**ఆగని కాలాన్ని సాగుతున్న గమనాన్ని అర్థం చేసుకుంటూ**
**రేపటి కోసం సిద్ధపడడమే....** రేపటి చేతన సమాజాన్ని కాంక్షించే కళలు నిత్య నూతనంగా ప్రతి గుండెకు చేరుతాయి. వేకువలో సాయం సందెలో తోడు నిలుస్తాయి. ఆ కలం మానవత్వం కోసం తపిస్తే! ఆ గళం పల్లెను ప్రకృతిని వర్ణిస్తే! ఆ గొంతు తెలంగాణ సంకెళ్ల విమోచనకై నినదిస్తే! ఆ స్ఫూర్తి, ఆ గానం, ఆ స్వరం అజరామరమై నిలుస్తుంది. ఆ స్ఫూర్తి రూపం లోకకవి అందెశ్రీ. ఆ గానభావం వాగ్గేయకారుడు అందెశ్రీ. ఆ స్వరం తెలంగాణ సంకెళ్ల విమోచన ఐక్యతలో జయ జయహే తెలంగాణ అంటూ మూడు కోట్ల గొంతుకులను ఒకటి చేసిన పాట రచయిత కవి గాయకుడు అందెశ్రీ. అందెశ్రీ మానవతావాది. చైతన్య ధీరుడు. అభ్యుదయకాంక్షతో గలమెత్తిన అక్షర తూటాల యోధుడు.

చిన్న విత్తనం మొలకెత్తి మహావృక్షం అయినట్టు రాతి నెర్రలో నుంచి పుట్టిన బిడ్డ, అనాథగా, ఆదరణ లేని స్థితి నుండి పసుల కాపరిగా, తాపీ పనివాడుగా జీవనం సాగించిన కష్టజీవి. బడిలో పాఠాలు చదవకుండానే అక్షరాన్ని అలా ఓ చివర మాత్రమే సృజించి, ప్రకృతి నుండి పల్లె నుండి, మట్టినుండి, మనిషినుండి, పారేఏటి నుండి, సాగేనది నుండి, పశుపక్షాదుల నుండి.... ఒకటేమిటి జీవన గమనంలో ప్రతి అనుభవాన్ని అనుభూతిగా పాడుకుంటూ అందె ఎల్లయ్య అందెశ్రీగా ఎదిగి, అనుబంధం ఆత్మీయత మానవత్వం కోసం నిలదీస్తూ చెడును అన్యాయాన్ని ఎదిరించే సింహగర్జనగా నిలిచి అందనంత ఎత్తుగా సాహితీ శిఖరంగా ప్రత్యేక స్థానాన్ని పొందాడు.

అట్టి లోకకవి, ప్రజాకవి ఉచ్ఛ్వాసనిశ్వాసలో కవిత్వాన్ని, పద్యాన్ని, పాటను మ్రోగించిన తెలంగాణ రాష్ట్ర గీత రచయిత ప్రపంచ నదీ తీరాలన్నింటి వెంట నడుస్తూ కవిత్వీకరించిన బాసరాంబ అందె, తెలంగాణ మువ్వల సవ్వడి. ముఖ్యంగా మా దంపతులను ఎంతో ఆత్మీయంగా అక్కా బావ అంటూ ప్రేమతో పిలిచి మా ఇంటి పెద్దగా సాహిత్యాన్ని, అభిమానాన్ని బంధుత్వాన్ని చూపిన అందెశ్రీ ఇక లేడు అన్నమాట వినడం కనడం రాయడం.. అన్నీ ఇప్పటికీ తట్టుకోలేని స్థితి. అన్న యాదిలో అన్న కోరిన సామాజిక భావనను, రాసిన పాటల్ని వాటి భావాలను అందరితో పంచుకోవడం, కవితార్చనగా భావిస్తూ, వారి సాహితీ ప్రయాణమే కాదు సాహిత్య సేవను కూడా అందరిముందు ఉంచాలని ఈ వ్యాసాన్ని రాస్తూ ఈ అవకాశానికి ధన్యవాదాలు.



అందెశ్రీ ..అతని పాటే.. అతని ప్రాణం ..

పాట లయబద్ధంగా సాగుతూ ఉంటే చిన్ని పాపకు జోల పాట, పాట గలగల పారే సెలయేరు, చిటపట చినుకుల సందడి. పాట గర్జించే మేఘమై ఉరుముతుంది, మెరుపులా మెరుస్తుంది, పిడుగులా పడుతుంది, చల్లగా వర్షిస్తుంది. అందుకే పాటే తన శ్వాసగా ప్రణవ నాదంగా వేదరూపంగా చైతన్యగీతంగా పాడిన అందెశ్రీ తన చిన్ననాటి నుండే పాటలల్లడం మొదలెట్టాడు.

చిన్ననాడు పసులు కాపరిగా ఉన్నప్పుడు మల్లారెడ్డి గారు చెప్పిన కథలు భారత రామాయణ పురాణ ఇతిహాసాలు వేద వేదాంగాలపై మక్కువను పెంచడమే కాదు దైవత్వమై ఓ నమ్మకాన్ని పెంచాయి. ఎంతో ప్రేమతో చిన్ననాడే గురు బోధన చేసిన గురువు వల్ల చందోబద్ధ పద్య కవిత్వం పురుడుపోసుకుంది. సుద్దాల హనుమంతు పాట పాలబుగ్గల జీతగాడా తన జీవితానికి ప్రతిబింబంగా పల్లె పదాన్ని అందె గుండెను చేరింది. జానపద సాహితీదిగ్గజం డాక్టర్ బిరుదురాజు రామరాజు గారి సాన్నిహిత్యం ప్రజాకవిగా అందెశ్రీ కలాన్ని గళంగా వినిపించింది.

అందెశ్రీ పాటను సహజంగా ఆశువుగా అనర్గళంగా పాడటం ప్రత్యేకత. అందరు కవులు గాయకులు కారు. గాయకులందరూ కవులు కారు. కానీ జలపాతహోరుల అందెశ్రీ గొంతులోంచి తాను స్వయంగా పాడుకునే పాట, పాడేతీరు, ఎత్తుగడ ప్రత్యేకమే. వారి పాటకు వారి గొంతుకే న్యాయంచేస్తుంది అన్నది నిజం. వారి రీతిలో వారి పాటను పాడడం వేరెవ్వరికి సాధ్యం కాదనిపిస్తుంది. బాసరంబ దర్శనంతో నీ జీవనగమనం మారుతుందని ఆశీస్సులు ఇచ్చిన శ్రీరాం సార్ ఆశీర్వచనం; బాసరాంబ గోదావరి స్పర్శ తనను నిలిపిందని ఎల్లవేళలా గుర్తు చేసుకునే అందెశ్రీ సాక్షాత్తు జగన్మాతకు అందెగా నిలవడమే కాదు, ప్రతి నెల బాసరాంబ దర్శనం చేసుకుంటూ ఆమె ఒడిలో ఓలలాడినట్టుగా భావించడం, వారిని ఆధ్యాత్మిక కాలజ్ఞానిగా

కూడా పలు సందర్భాల్లో రుజువు చేసింది. కాలం విసిరిన ఖడ్గంగా వారిని, కాలాన్ని శాసించిన లేఖినిగా వారి కలాన్ని నిలిపింది.

అభినవ కాళిదాసుగా పాండిత్యాన్ని ప్రదర్శించిన అందెశ్రీ నేటి బమ్మెర పోతనగా ఆత్మాభిమానాన్ని సంపదగా నిలబెట్టుకున్నారు. కష్టాలకు ఎర్రగా కాలిన ఇనపకడ్డీ అందెశ్రీ. ఇనుప కడ్డీని పట్టుకుంటే కాలిపోవడం ఎంత సహజమో, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే వారికి అందెశ్రీ స్వరం వాత పెట్టేది. అట్లాగే కాలిన ఇనపకడ్డిని ఉపయోగపడే రీతిలో మలుచుకోవడం ఎంత సహజమో, మానవ సమాజ పరిరక్షణకు మంచి భావనకు వారండగా ఒదిగి వొడి చేరుస్తారుబీఇక వారి కొన్ని పాటల్ని, పాటల్లో భావాన్ని,నేపథ్యాన్ని చూద్దాం..

అందెశ్రీ పాటలు ప్రజల గుండెల్ని చేరడమే కాదు గొంతు కలిపాయి. ఐక్యతగా నినదింప చేశాయి. తనలోని కవితాత్మని కదిలించిన వారందరినీ తలుచుకుంటూ పాటలపూదోట లలిత గీతాల సంపుటి మరియు అందెల సందడి కవితా సంపుటి వెలవరించ బడ్డాయి. ఆనాడే నాటి కవితోత్తములు వారిపై భావనను తెలుపుతూ అందెశ్రీ నీ దేశం నిలపకపోతే కాలం నిలుపుతుందన్నారు.. అది కాలజ్ఞానమైంది.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆసరాగా నిలిచిన కవితా స్వరం ధూమ్ ధామ్. ఉద్యమ జనచైతన్య పోరులో అందెశ్రీ పాత్ర అందవేసిన చేయిగావారు, వారి పాట, కలం నిలిచాయి.

జై బోలో తెలంగాణ / గళ గర్జనల జడివాన / జై బోలో తెలంగాణ నిలువెత్తు గాయాలవీణ.. అందెశ్రీ ఈ పాటలోనీ ఒక్కోవరుస తెలంగాణ ప్రజల కష్టాలను తెలుపుతూ ఉద్యమంలో నిలిచే ఉత్ప్రేరణను సమాజానికి అందించింది.

పల్లె నీకు వందనాలమ్మ, నన్ను కన్నతల్లి నీకు వందనాలమ్మ, నాకు ఆటనేర్పి, పాటనేర్పి బతుకు బాట చూపినందుకు.. పల్లె నీకు వందనాలమ్మ అంటూ సాగిన అందెశ్రీ పాట.. పల్లె ప్రజలకు ఏం నేర్పుతుందో! తెలుపుతూ పల్లె సమస్యలపై గళమెత్తిన తీరుతో తన జీవితాన్ని కూడా మమేకం చేసుకోవడం ప్రతి గుండెను కదిలించింది.

సూడా సక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి, నవ్వుల్లో నాగమల్లి, నా పల్లె పాలవెల్లి.. సూరమ్మ మళ్ళీ జన్మంటూ ఉంటే అంటూ సాగిన అందెశ్రీ పాట తెలంగాణ పల్లె తల్లిని సుక్కమ్మగా జాబిల్లిగా నాగమల్లిగా పోల్చిన విధం ప్రకృతి పల్లవమే కాదు, ఇక్కడే మళ్లీ పుట్టాలని కోరడంలో ఈ మట్టికి మనిషికి బంధాన్ని రుణాన్ని తెలుపుతూ ప్రతి ఒక్కరు కోరుకునేలా చేస్తోంది.

కొమ్మ చెక్కితే బొమ్మరా, కొలిసి మొక్కితే అమ్మరా.. ఆదికే ఇది పాదురా, కాదంటే ఏదీ లేదురా..అంటూ సాగిన పాటలో గొప్పతత్వమే కాదు మానవ చరిత్రను అందించారు. "గూడు గుట్ట గుహలను వదిలి, గుండె రాయి చేసుకున్నాడు; కండలను కరిగించి కన్న కలలను పండించుకున్నారు; సేదదీరీ మనసులోన శక్తి ఏదో ఉందని ..శక్తి పుట్టే అంటూ శక్తి అనే భావనలోన గ్రామ దేవతలుగా వెలసిన తీరును ప్రస్ఫుటంచేయడం అందెశ్రీ పాటను వారిని ప్రకృతి చెక్కిన శిల్పంగా నిలిపింది. అందెశ్రీని విశ్వ మానవునిగా నిలిపిన మరో గొప్పపాట.. మనిషికోసం రాసిన **"మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు, మచ్చు కైనా లేడు చూడు, మానవత్వం ఉన్నవాడు, నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు, యాడ ఉన్నడొ కాని కంటికే కనరాడు"** అంటూ మానవత్వం మచ్చుకైన కానరాకుండా పోతున్న ఈ కలిస్వార్థపు లోకంలో మనిషి అవినీతితో అత్యాశలతో ఎలా రాక్షసంగా మారుతున్నాడో సందర్భాలను కళ్ళకు కట్టినట్టుగా పాడుతూ ప్రజలందరూ ఎలా దానవులవుతున్నారో గానం చేశారు. నూటికో కోటికో ఒక్కడే కనిపించడాన్నీ చూస్తూ మానవత్వం కోసం తపించారు అందెశ్రీ.

ప్రతి గుండెను ప్రశ్నిస్తున్న మాయమైపోతున్నడమ్మా పాట మానవత్వం పిలుపుకు పరాకాష్టగా నిలిచి ఆత్మ పరీక్షకు సిద్ధ పరుస్తుంది. ఒక శతక కర్తగా కాలజ్ఞానిగా ప్రశ్నిస్తూ రేపటి మంచి కోసం తపించారు అందెశ్రీ.

గలగల గజ్జల బండి, గల్లు చూడు ఓరుగల్లు చూడు, నాటి కాకతీయులు ఏలినట్టి ఖిల్లాచూడు నా జిల్లా చూడు.. ఈ పాట పాడుతూ 1200 సంవత్సరాల చరిత్ర 100 పంక్తుల్లో 12 నిమిషాలు వచ్చేలా రాయబడిందని తెలుపుతూ కాకతీయుల రాజ్యాన్ని చరిత్రను స్థల ప్రాధాన్యతను కీర్తిస్తున్నారు అందెశ్రీ. ఇక్కడ నా జిల్లా అనడంలో వరంగల్ జిల్లా జనగామ రేబర్తి గ్రామంలో పుట్టిన వారుగా వారిని గుర్తింపు చేస్తూ కవిత అద్భుతంగా ఉంది. ఆగకుండా పాడిన వారి స్మృతికి జ్ఞాపకశక్తికి, గిజిగాని అల్లికకు అక్షర వందనాలు.

**"జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం.. ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం.."** అంటూ అందెశ్రీ రాసినపాట పల్లె నుండి పట్టణం, పిల్లవాడి నుండి ముసలోళ్ల వరకు తెలంగాణ గొంతుకై నిలిచింది. తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో ముక్కోటి గొంతుకులను ఒకటి చేసి సంకెళ్ల విమోచనలో ముందు స్థానంలో నిలిచింది. తెలంగాణ వైభవాన్నీ తెలంగాణ రాష్ట్ర కాంక్షను రాబోయే మంచిని క్రాంతి గా దర్శించి వ్రాసిన ఈ పాట తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయుధం అయ్యింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా అందెశ్రీ జయహే తెలంగాణ పాట పాఠశాల విద్యార్థుల నుండి ప్రపంచమంతా కూడా వాడుకోవడం ఆపలేదు. వందేమాతరం బంకించంద్ర పాటలా జనగణమన జాతీయగీతంలా ఈ పాట గుర్తింపు కోసం అందెశ్రీతో పాటు జనం అంత ఎదురు చూడటం జరిగింది. ఓ వ్యక్తి చెప్పినట్టు మన ముఖ్యమంత్రి ఉపన్యాసంలో వివరించినట్టు, పెన్నుల మీద మన్నుగప్పితే గన్నులై మొలకెత్తుతాయి,

రాజ్యాలనే మారుస్తాయి అన్నట్టు ఉద్యమంలో తెలంగాణ సాధన పాటల తూటాలను సంధిస్తూ ఉద్యమ విజేతగా నిలిచింది పాట. విజేతగా నిలిచి సాహితీ శిఖరంగా అత్యంత ఎత్తులో నిలిపిన ఈ పాట రాష్ట్ర గీతంగా గుర్తించబడింది. రాష్ట్ర గీత రచయితగా కవిలోకాన రారాజుగా నిలిచిన అందెశ్రీ మనస్సు ఉల్లాసం పొందింది. తెలంగాణ ప్రజలే కాదు యావత్ ప్రపంచంలో తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలిసిన ప్రతి ఒక్కరూ అభినందనలు తెలుపుతూ సంతోషపడ్డారు. ఆ తర్వాత ఈనాటి ప్రభుత్వం కోటి రూపాయల నజరానతో, 300 గజాల జాగ హైదరాబాదులో ఇస్తూ అందెశ్రీతో పాటు మొత్తం తొమ్మిది మందిని సత్కరించిన సందర్భంగా వారిని ఉన్నత స్థితిలో గౌరవాన్ని పొందేలా చేసింది.

అయితే ఇన్ని రాస్తుంటే అయ్యో! అన్నలేడాయే నన్న బాధ మిగిలింది. మాయమైపోతున్న మానవత్వాన్ని నింపుకోమని బతికించుకోమని అనుకోకుండా అందెశ్రీ మాయమైపోవడం నవంబర్, 10/2025 సాహితీ ప్రపంచానికి తెలంగాణ గడ్డకు తీరనిలోటే. అయినా ఆ గొంతు ఆ స్వరం ఆ పాట ఆ ఉపన్యాసాలు ప్రతి గుండెలో వారిని విజేతగా జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీత రచయితగా నిలిపాయి.

ఇక అందెశ్రీ గారి పాటలు ఎన్నో ఎన్నెన్నో. కానీ ఇక్కడో మాట.. పుంఖానుపుంఖాలుగా వచ్చిందల్లా రాస్తూ ప్రచురించడంలో సాహిత్యం బతకదు. రాసిన పదం, పాట, తత్వం జనం నాలుకలపై పలికినప్పుడే వారు ఆదరించినప్పుడే నిజమైన సాహితీ సార్థకత. అందెశ్రీ రాశి కోరిన వాడు కాదు, వాసిని గుణాత్మకతను పొందినవారు. వారిని కేవలం పాటలకవిగా వాగ్గేయకారుని గానే కాదు పాండిత్యం ప్రదర్శించిన పద్యకవి పుంగవునిగా చూడవచ్చు.

వాక్కులమ్మ మకుటంతో వారు పాడిన రాసిన పద్యాలు అత్యద్భుతంగా ఉన్నాయి ఇక అందెశ్రీ అభ్యుదయం కోరిన చైతన్యశీలి. పల్లె ప్రజలు పీడిత వర్గాల బాధల్ని మానవత్వాన్ని మాత్రమే కాదు ప్రకృతిని వర్ణించిన తీరు అత్యద్భుతం. ఎంతమంది శాస్త్రవేత్తలైన ఎన్ని పరిశోధనలు చేసి ఎంత సాధించినా సరే ఒక నయగారా జలపాతాన్ని సృష్టించగలడా! మనిషికి సాధ్యం కానంత గొప్పది ప్రకృతి! అంటారు. కవిత్వంతో పాటు వక్తగా వివరణతో ఉపన్యాసంతో ఎన్నో వాదాలను వేదాలుగా నిలిపారు. ఓ సభలో వారు వినిపించిన ఆదిత్యవర్ణన సాంప్రదాయ నమ్మకాన్ని బతికిస్తుంది. ఏడు గుర్రాలపై సూర్యుడు ఏడుగుర్రాలపై సూర్యుడు ప్రయాణం చేస్తాడా! నువ్వు చూసావా! అంటూ ప్రశ్నిస్తే మనం బిక్క మొఖం వేస్తాం! కానీ అది మనలోనే ఉందంటూ అందెశ్రీ తన గేయం ద్వారా నిరూపించారు. అందెశ్రీ గారి ఆదిత్య గేయం **ఆదిత్య నీపాద దూళి సంధ్యమత కేలి** అంటూ సాగే ఈ గేయంలో ఉదయాన నా నుదుట బొట్టుగా క్షణకాలంలో లోకమంతా అంటూ మానవ శరీర నిర్మాణంలో నాడీ వ్యవస్థలో



మస్తిష్కల్లో సూర్య భగవానుని స్థితిని వర్ణించారు. ఆశలే అశ్వాలు, శ్వాసలే అంటూ సాగిన ఈ గేయంలో జనన మరణాలు రాత్రి పగలుగా కనిపిస్తాయి.

ఇక అందెశ్రీ ఉపన్యాస దిట్ట. వారు నమ్మిన విషయాన్ని స్పష్టంగా చెప్పడమే కాదు, తప్పు చేయడం తప్పించుకోవడం తెలియదు. విజేతగా పాటలు అందించిన అందెశ్రీ నీ పదవులు ఆహ్వానించాయి. బమ్మెరపోతన కవి పండితులు పుట్టిన ప్రాంతంలో పుట్టిన, నేటి పోతన్నగా, అక్షరం చదవకుండా అభినవ కాళిదాసుగా నిలిచిన అందెశ్రీ పదవుల వల్ల తన వ్యక్తిత్వానికి ఆత్మాభిమానానికి మచ్చ రావచ్చు.. జనం మధ్య తలదించే పరిస్థితి రావచ్చు.. అనుకున్నాడు అందుకే అన్నింటిని తృణప్రాయంగా తిరస్కరించారు.

నేను అమ్మ కాలిగజ్జెను, అందెను, సింహాన్ని ..ఆకలి వేస్తే తల పగలగొట్టుకొని చనిపోయే సింహంలా నా ఆహారాన్ని మాత్రమే తింటాను, కానీ గడ్డితినను అనడంలో వారి ఆత్మాభిమానం ఎనలేని కొండగా కనిపిస్తుంది. అదే వారి సంపద. వారి అభిమానులే వారిని అక్కున చేర్చుకున్నారు. ఏ కవికి దక్కని ఎన్నో అపురూప అనుభూతులు అందించారు. ప్రపంచ పటాన్ని వారు సృజించేలా చేశారు. అయితే మా దంపతుల మధ్య ఒక పసిపిల్లవాడిలా సున్నిత మనస్తత్వాన్ని ఆవిష్కరించేవారు. అది మా పూర్వజన్మ సుకృతం.

**చినుకమ్మ వాన చినుకమ్మ నేల చిన్నబోయే చూడు బతుకమ్మ మేఘాల దాగుండి పోకమ్మ** అంటూ బతుకమ్మ సినిమాకు వారు మాటలు పాటలు రాసిన సందర్భంగా ఆ సినిమా దర్శకుని కోరిక మేరకు తెలంగాణ బతుకమ్మ పాటలపై తొలి పరిశోధకురాలుగ నా గ్రంథం నుండి ఆరు పాటలు అందించడం జరిగింది. ఇది 2008 నాటి మాట. బతుకమ్మ ఆటపాట తెలంగాణ ఉద్యమంలో బాగా చోటు చేసుకున్న సమయం. ఆనాటి నుండే మా బంధం. బతుకమ్మకు, బతుకమ్మ పాటకు కావ్య గౌరవాన్ని అందించిన తల్లివి నీకు శరణాగతి అంటూ అన్నయ్య చూపిన ఆత్మీయత ఇప్పటివరకు సాగింది. పాటకు కావ్య గౌరవం దక్కించిన అందెశ్రీకి వందనాలు. ఇక వారి ఓ చిన్నవాదన.. ఏ వాదనైనా సరే కానీ ఏ తులవాదంగా మారొద్దని చెప్పేవారు.

నీవేసిన ప్రతి అడుగు నీ ఎత్తుని తెలుపుతుంది. నీ వాడే ప్రతినుడుగు నీ లోతుని తెలుపుతుంది... అంటూ అందెశ్రీ ప్రకృతి నుంచి పాఠాలు నేర్చుకోమన్నారు.

ఇక సాహిత్యాన్ని సృష్టించడమే కాదు, సాహితీ పోషకులు అందెశ్రీ. మౌఖిక సాహిత్యాన్ని కళాకారుల్ని అభిమానంగా చూసిన అందెశ్రీ ఎంతో గొప్ప సాహితీ పోషకునిగా వాక్కులమ్మ ప్రచురణలను చేశారు. వారికి సహకరించిన అందరిని వారు ప్రశంసిస్తూనే, చరిత్రకు ప్రత్యేకంగా వాక్కులమ్మ ప్రచురణ ద్వారా "నిప్పుల వాగు" ఉద్యమ పాటలు.. తన సంపాదకత్వంలో 2022లో వెలువరించారు. ఉద్యమ చరిత్ర, తొలిమలి ఉద్యమ తెలంగాణ మట్టి గీతాల సంచిక ఇది. ప్రస్తుతం నిప్పుల వాగు ప్రతి గ్రంథాలయంలో ఉంచేలా చేయడం ముదావహం.

"సౌందర్య లహరి" ఆచార్య పప్పు వేణుగోపాలరావు గారు వ్యాఖ్యాన గ్రంధాన్ని అందెశ్రీ వాక్కులమ్మ ప్రచురణగా 2020లో డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన "సృష్టిగర్భ" వాక్కులమ్మ ప్రచురణగా అందెశ్రీ 2025లో. డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రూపకావ్యం "శ్రీ శూద్రగంగ"ను వాక్కులమ్మ ప్రచురణగా అందెశ్రీ నవంబర్ 2024లో వెలువరించారు. ఏ ఇక ఓ గొప్ప గురువు అందెశ్రీకి, ఇంకా ఎందరెందరికో శ్రీరామ్ సార్ కు వందనాలు, కృతజ్ఞతలు, అక్షరాంజలి శ్రీరామ్ సార్ కు సమర్పించే దిశలో అందెశ్రీ గారు వాక్కులమ్మ ప్రచరణగా శ్రీరామ్ గారి స్వీయ కావ్యం "హసిత బాష్పాలు" వెలువరిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా 2025 కృష్ణాష్టమి నాడు ఆవిష్కరించారు.

కాలజ్ఞానిగా, కాలం కన్న లేఖకునిగా, కాలం విడిచిన ఖడ్గంగా అందెశ్రీ గారి ప్రతి పనిలో ఓ పరమార్థం ఉండేది. ఈ గ్రంథాలన్నీ ప్రత్యేకంగా విలువైనవి. లోతైన భావనగల ముఖచిత్రాలతో ఆయిల్ కలర్ పేజీలతో ఓ అద్భుతాలుగా ఉన్నాయి. ఇక వాక్కులమ్మ ద్వారా విలువైన సాహితీ సంపద కలిగిన కవివర్యుల 100 పుస్తకాలను ప్రచురించాలని వారి కోరిక. వాక్కులమ్మ ఆరవ ప్రచురణగా నేను రాసిన మహోజ్వల గీతం (మట్టి గీతం) దీర్ఘ కవిత ముద్రణకు అన్న సిద్ధం చేయడానికి వెలిసిన తరుణంలో వారిని కోల్పోవడం బాధాకరం. ఇక్కడో మాట "బావా చావు నాకు చెప్పే వస్తుంది, ఇంకా 20 సంవత్సరాలు నేను బతుకుతాను" అన్నవారు ఇలా మాయం అవ్వడం దురదృష్టకరం. అందెశ్రీ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వారు రాసిన పాటలు విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలుగా ఉన్నాయి. ఇకపై ప్రతి పాఠశాలలో పాఠ్యపుస్తకంలో రాష్ట్ర గీతం ఉండబోవడం గర్వకారణం.

ఇక అందెశ్రీ తత్వంలో మరో ముఖ్యమైనది మనిషిని వర్గీకరించిన కుల వ్యవస్థ. నా దేహంలో అన్ని కులాలు ఉన్నాయనే వారు అందెశ్రీ. అంతే కాదు లోకమంతా నా ఇల్లు జనమంతా నా వాళ్ళు... అంటూ విశ్వ మానవులుగా మనుషుల నిలిపే ప్రయత్నం చేశారు. మానవత్వాన్ని నిలిపేందుకు కృషి చేసిన వారి కవితాత్మకు వందనం, అక్షర వందనం. అక్షరాభివందనంతో సాహితీ సోదరి డాక్టర్ బండారు సుజాత శేఖర్.

❖ ❖ ❖ ❖ ❖


# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# పసుల కాపరి నుండి .... ప్రజాకవిగా... అందెశ్రీ అసాధారణ జీవన ప్రస్థానం

**డా. కోయి కోటేశ్వర రావు,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 9440480274

ఆధునిక తెలుగు కవిత్వంలో అందెశ్రీ సహజ కవి. అపార ప్రతిభా సంపన్నుడు. జాతిని జాగృతం చేసే పాటల జాతరలా నిత్యం ప్రతిధ్వనించాడు. మబ్బుగుండెనుండి వానచినుకు రాలిపడినట్లు మట్టిని చీల్చుకొని మొక్క దూసుకొచ్చినట్లు అందెశ్రీ గుండెల్లోనుండి పాట అలవోకగా ఉబికి వచ్చింది. వెదురు ముక్కవేణువై వేనవేల రాగాలు పలికి నట్లు, తాపీ మేస్త్రి ఒకతత్త్వ కవిగా పరిణామం చెంది ప్రజా విముక్తి గీతాలను ఆలపించాడు.

సంకల్ప శక్తితో ఏకలవ్యుడిలా సాధన చేసి, వినికిడి జ్ఞానంతో, సామాజిక పరిశీలనతో, అసాధారణ ధారణాపటిమతో లోక కవిగా ప్రసిద్ధి చెందాడు. పొట్టపొడిస్తే ఆకలి పేగులు తప్ప అక్షరం ముక్కరాని అందెశ్రీ కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు అందుకొని అందరికీ మార్గదర్శిగా నిలిచాడు. పశులకాపరిగా జీవితాన్ని ప్రారంభించి స్వయంకృషితో ప్రజాకవిగా రాణించి నీరాజనాలు అందుకున్నాడు. మట్టి చేతులతో మహాగీతాలు రాశాడు. బడిలో చదవక పోయినా అకుంఠిత దీక్షతో పాటలబడిగా ఎదిగిన అందెశ్రీ జీవన ప్రస్థానం అత్యంత స్ఫూర్తిదాయకం.

1961 జూలై 18 ఉమ్మడి వరంగల్ జిల్లా రేబర్తి గ్రామంలో జన్మించిన అందెశ్రీ (అందె ఎల్లయ్య ) తల్లిదండ్రుల ఆలనాపాలనకు దూరమై అనాథలా పెరిగాడు. బాల్యంనుండే అంటరానితనం ముళ్ళకంచెల మీద నడుస్తూ, ఆకలిఎడారిలో సంచరిస్తూ పశువుల గాచే జీతగాడిగా మారాడు. ముక్కుపచ్చలారకుండానే కాయకష్టం ఒడిలో, కన్నీళ్ళతీరంలో పెనుగులాడాడు. తన దగ్గర జీతగాడిగా పనిచేస్తున్న అందెశ్రీకి జక్కిరెడ్డి మల్లారెడ్డి, రామాయణ, మహాభారత కథలను పరిచయం చేశాడు.. "ఊరే నాకు స్ఫూర్తినిచ్చిన కీర్తి కిరీటం" అని తాను చెప్పుకున్నట్లుగా అక్షర జ్ఞానం లేని అందెశ్రీ కి రేబర్తి పెద్దబాల శిక్షయై మౌలిక జ్ఞాన వనరులను బోధించిచింది. ఊరే ఆయనకు సాంఘిక శాస్త్రమయింది. ఈ పాలబుగ్గల జీతగాడికి ప్రకృతి మాత పాఠాలు నేర్పింది. పల్లె తల్లి నిఘంటువై జీవభాషను నూరిపోసింది. పల్లె అందెశ్రీకి పాట నేర్పి, మాట నేర్పి బతుకు బాట చూపించింది. ప్రతినిత్యం పల్లెలో ప్రతిధ్వనించే యక్షగానాలు, శారదగాంధ్ర కథలు, ఒగ్గు కథలు జానపద కళారూపాలు అందెశ్రీకి సృజనోత్తేజాన్ని కలిగించాయి. తాపీ మేస్త్రీగా జీవిస్తూ పల్లె పాటలు పాడుకుంటున్న అందెశ్రీకి శంకర్ మహారాజ్ సరికొత్త ఆధ్యాత్మిక మార్గాన్ని చూపించాడు. **"ఎవరో రాసిన పాటల్ని ఎన్నాళ్ళు పాడతావు? నీవే కైగట్టాలి"** అన్న శంకర్ మహారాజ్ మాటలతో, అందెశ్రీ స్వయంగా పాటలు అల్లడం సాధన చేశాడు. బిరుదురాజు రామరాజు



సాంగత్యంలో జానపద సాహిత్య విశిష్టతను అవగతం చేసుకున్నాడు. పరిశీలనాజ్ఞానంతో భాషమీద అపారమైన పట్టుసాధించాడు. పామరులతో, పండితులతో, సాధువులతో, ఉద్యమ నాయకులతో, కార్యకర్తలతో, ఆచార్యులతో, విద్యార్థులతో ఎప్పటికప్పుడు అనుబంధం పెంచుకొని వారితో సంభాషిస్తూ, వాదిస్తూ తద్వారా సముపార్జించు కున్న అనుభవాలతో తన సృజన నైపుణ్యానికి పుటం పెట్టుకున్నాడు.

**"సాగే జీవన సమరంలో నిన్ను చూడకుండా నిలువ / నవ తరంగములతో / పరుంగులిడు, రసతురంగములను/విరించి తలపుల / విపంచి రవముల తపించె గీతిక"** అంటూ పాటకోసం, వినూత్న కవనం కోసం పరితపించాడు . పద్య కవిత్వం వైపు దృష్టి సారించి అందెశ్రీ రాశాడు.

**"మేఘాల లోగిళ్ళ మెరుపు తీగల దాగి**
**ఉరుముల శబ్దమై ఉన్నదెవరు?**
**అజ్ఞానమును చీల్చ విజ్ఞాన జ్యోతిగా**
**జిజ్ఞాస కలిగించు జీవ మెవరు..?"**

"అణువుఅణువులో వినిపించు ధ్వనివి నీవే, ...వసుధ వినిపించు నా మాట వాక్కులమ్మ" పంచమాత్రా గణాలగతిలో పరిణితి చెందిన పద్యకవిలా వాక్కులమ్మను ప్రస్తుతించాడు. అన్నమయ్య, త్యాగయ్య కీర్తనల ప్రభావంతో మునిగితేలుతున్న అందెశ్రీ, **"పల్లెటూరి పిల్లగాడా పశుల గాచే మొనగాడా"** అనే పాటలో తనను తాను చూసుకొని ప్రజాకవుల ఒరవడిని అందిపుచ్చుకున్నాడు. సుద్దాల హనుమంతు, గూడా అంజయ్య, గద్దర్, గోరటి వెంకన్న, అశోక్ తేజ, జయరాజు తదితర కవులస్ఫూర్తి తో భక్తి పాటల వైపు నుండి ప్రజా విముక్తిగీతాల వైపు చూపు సాగి పోయాడు.

**"అల్లిబిల్లి అంగురతోట/నేను పాడుకుంటూ పోయేది పల్లెపాట/ పల్లె పాటెంట బోతుంటే పల్లెబాట నేను మెల్లంగా చేరాలి సిద్ధిపేట"** అంటూ సునాయాసంగా పాటనుఆలపించాడు. సిద్ధిపేటకు వెళ్ళే ప్రయాణ మార్గాన్ని అందులోని మలుపులను, పంటపొలాల సోయగాలను ఆసక్తి దాయకంగా పాటగామలిచి, ప్రారంభ దశలోనే అందెశ్రీ కవి గాయకుల మనసులను గెలుచుకున్నాడు . ఆకాశవాణిలో ప్రసారమైన అందెశ్రీ లలితగీతాలు విని, బోయి భీమన్న ఇంటికి పిలిచి అందెశ్రీని అభినందించి ప్రోత్సహించాడు.

పద్యం, పాటతో పాటు అందెశ్రీ వచన కవిత్వంలోనూ సముచితమైన ప్రతిభ ప్రదర్శించాడు. 'అందెల సందడి (1994)' సంకలనం లోని కవితల్లో దళితసాహిత్యం, స్త్రీవాద సాహిత్యం ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. **'వాస్తవాలను వక్రీకరించే కవిత్వం ఒక కవిత్వమేనా?'** అంటూ ఆయన సాహిత్య నైజాన్ని ఎత్తి చూపాడు. **'ఆర్యుల ఆధిపత్యం, ద్రావిడుల దాసోహం గురించి..'** ఇదేనా సంస్కృతి విమర్శనాత్మకంగా ప్రశ్నించాడు. మనిషిని విస్మరించి, దైవాల పేర ఇలలో ధనాన్నంతా తగలబెడుతున్నారని, ధర్మం శరణం గచ్ఛామి అన్న బుద్ధుని బోధనల్ని బురదలో తొక్కేశారని (సాదృశ్యం) అందెశ్రీ ఆరోపించాడు. 'కారంచేడు కాలనాగులను' **"చుండూరు దళితుల గుండెల్లో చురకత్తులు దించిన"** మహా హంతకులను, **'కులపిచ్చి గాళ్లను, మత ఉచ్చుగాళ్లను'** కవిత్వంలో ధిక్కరించాడు. 'నేను నీకు బానిసనా?' అనే కవితలో యుగాల నుండి స్త్రీలను దగాచేస్తున్న పురుషాధిపత్యాన్ని తదనుగుణమైన రాజకీయాలను నిరసించాడు.

బహుముఖీనమైన తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని తన పాటల్లో అందెశ్రీ అద్భుతంగా గానం చేశాడు, **"చూడు తెలంగాణ చుక్కనీరు లేనిదాన"** అంటూ తెలంగాణ కరువు పరిస్థితులను, వలసపాలనలో జరిగిన విధ్వంసాన్ని కళాతత్త్వ భరితంగా పాటలో చర్చించాడు. తెలంగాణ గుండె డప్పు వినిపించాడు. **'జయ జయ హే తెలంగాణ జననీ జయ కేతనం ముక్కోటి గొంతులు ఒక్కటైన చేతనం'** అనేపాట మలిదశ ఉద్యమానికి మహత్తరమైన స్ఫూర్తిని అందించింది. ఈపాట తెలంగాణ జనగీతమై, వైతాళిక గానమై నింగీనేలా మారు మ్రోగింది. తెలంగాణ చారిత్రిక, సాంస్కృతిక, సాహిత్య వైభవ, ప్రాభవాలను, ఆత్మగౌరవ చైతన్యాన్ని ఈ పాటలోఅందెశ్రీ ఉత్తేజభరితంగా ఆవిష్కరించాడు. ఉద్యమసందర్భంలో అశేష ప్రజాసమూహాన్ని ఉ ద్రూత లూగించిన ఈ పాట తెలంగాణ జాతీయ గీతమై దశ దిశలా మారు మోగుతుంది. **"జన జాతరలో మన గీతం /జయ కేతనమై ఎగరాలి /ఝంఝూమారుత జన నినాదమై జేగంటలు మ్రోగించాలి"** పాట అణువణువులో ఉద్యమోత్తేజాన్ని రగిలించింది. గుండె గుండెలో అనంతమైన భావోద్వేగాన్ని ప్రజ్వలింప జేసింది. ప్రత్యేక రాష్ట్ర పోరాట కార్యాచరణను ఈ పాట వేగవంతం చేసింది. **"నిప్పులు చెరిగే తుపాకి రవ్వల గుప్పెటబట్టి నలిపేస్తాం / నెత్తురు చిందే దారుల్లోన విత్తనాలమై మొలకేస్తాం / లాఠీలిరిగినా లడాయి మానం/పిడుగులుపడ్డా మడిమలుదిప్పం"** ఇలాంటి అసాధారణ భావాల్లో తెలంగాణ ఉద్యమ ఆవేశాన్ని అందెశ్రీ ప్రభావశీలంగా పలికించాడు . **"రోషం గుండెలో రోకలి బండలు /బిగిసిన పిడికెళ్లు వాడిసెలరాళ్ళు"** అంటూప్రజల్లో పోటెత్తుతున్న ప్రతిఘటనాత్మక చైతన్యాన్ని సమున్నతంగా పాటలో ప్రతిఫలింపజేశాడు. **"జై బోలో తెలంగాణ గళగర్జనల జడివాన"** లాంటి పాట చరణాలు ఊరూ వాడా పోరు విత్తనాలను నాటాయని చెప్పవచ్చు. **"నీలంపు చీరె లెల్ల దచ్చన్న దారిలో"** అంటూ తెలంగాణ ఆడబిడ్డల పోరాట పటిమను, వారి ఉద్యమైక దృష్టిని గొప్పగా పాటబద్ధం చేశాడు.

తెలంగాణ ఉద్యమ సందర్భంలో **"చూడచక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి"** పాట ధూమ్‌ధామ్ సభలకు చుక్కాణి గా నిలిచింది. ఈ పాటతో అందెశ్రీ ప్రతి హృదయంలో పల్లె ఆనవాళ్లనప్రతిష్ఠించాడు. **"చేతి కుల వృత్తులకు చెయ్యెత్తి దండం బెడతా"** అంటూ వృత్తి కార్మికుల అసమాన శ్రమైక జీవన ఔన్నత్యానికి అందెశ్రీ జేజేలు పలికాడు. నిసర్గ సౌందర్య శోభితమైన పల్లె జీవనానికి ప్రాణమెవరో ఈ పాటలో అందెశ్రీ సోదాహరణగా అక్షరబద్ధం చేశాడు. ఊరి బయటకు నెట్టివేయబడిన దళిత, బహుజనులే ఊరికి దివిటీలుగా, రక్షణగా, నిలుస్తున్నారని వీరకెవరూ సాటిరారని పాటలో కీర్తించాడు. ప్రాచీనసాహిత్యంలో కులవృత్తిగతమైన శ్రమను ఆదర్శీకరించి ఆ వృత్తికారులకు గౌరవ మర్యాదలను నిషేధించారు. ఈ రకమైన దుర్నీతిని కవి నిరసించాడు. ఈ పాట వింటే కులవృత్తి కార్మికులపట్ల గొప్పగౌరవం పెరుగుతుంది.

మర్రి విత్తనంలో మహా వృక్షం దాగిఉన్నట్లు అందెశ్రీ పాటల్లో బతుకు తత్త్వం ఉట్టిపడుతుంది. **"కనరా కనరా కాలాన్ని/వినరా వినరా విశ్వాన్ని", కాలం కరవాలం / కాకున్నదేదీ ఆహారం** లాంటి పాటల్లో అందెశ్రీ ఒక తత్త్వవేత్తలా దర్శనమిస్తాడు.

**'దారిన నడువు దైవము నీవే/దారి తప్పితే దెయ్యం నీవే' , "కొమ్మ చిక్కితేబొమ్మరా / కొలిసిమొక్కితేఅమ్మరా", 'అందరూవచ్చిందొకటే ద్వారం, అందరూ ఒక్కటే, ఎందుకు దూరం?**" వంటి అందెశ్రీ సూత్రీకరణలు పాఠకులను ఆలోచింపజేస్తాయి. ప్రపంచీకరణ సంస్కృతి వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మానవ సంబంధాలు మృగ్యమవుతున్నాయి. ఆర్థిక తీవ్రవాదంతో మనిషి పచ్చి స్వార్థపరుడై ప్రవర్తిస్తున్నాడు. కులోన్మాదిగా, మతోన్మాదిగా, కామోన్మాదిగా మారిపోతున్నాడు. ప్రమాదకరమైన సామాజిక వైపరీత్యాన్ని సరళ సుందరంగా విశ్లేషిస్తూ అందెశ్రీ ఆలపించిన **"మాయమై పోతున్నాడమ్మా/మనిషన్నవాడు"** అనే పాట మానవతా పతాకమై సాహిత్యంలో చిరస్థాయిగా నిలుస్తుంది. వస్తు వినిమయ సంబంధ బాంధవ్యాల తీరుతెన్నులను ఈ పాటలో శక్తివంతంగా కవి ఆవిష్కరించాడు. దశాబ్ద కాలం పాటు డిగ్రీ లో పాఠ్యాంశంగా వున్న


ఈ పాట వేలాదిమంది విద్యార్థుల్లో మూర్తిమత్వ స్ఫూర్తిని కలిగించింది. **“మనిషితనమే నాకు పరాకాష్ఠ. మనిషితనపు ఆనవాళ్ళ చిరునామా ఎక్కడ వుంటుందో నేను అక్కడ ఉంటాను”** అని చెప్పిన అందెశ్రీ ఈ సమున్నత సందేశాన్ని తన పాటల్లో పొందు పరిచాడు.

ఒకప్పుడు బస్సు చార్జీకి కూడా డబ్బులు లేక హైదరాబాద్ నగరమంతా కాలినడకన తిరిగిన అందెశ్రీ అరుపదుల వయస్సులో పరమ ఉత్సాహంగా విశ్వ సంచారం చేశాడు. మహా కావ్యం రాయాలనే సంల్పంతో ప్రపంచ నదులను సందర్శించాడు. అరుదైన పర్యటనానుభవాలతో నది అనే దీర్ఘకావ్యానికి శ్రీకారం చుట్టాడు. **‘‘నదినడిచిపోతున్నది/హొననుహొ నావనైరమ్మన్నది/నాలో ప్రాణదాగున్నది/ పాదాలులేకున్న పయనమెపుడాగదు/ఎదురేది నిలుచున్న బెదిరి వెనుతిరుగదు/గాయలు ఎన్నయినా గానమై గమనాన/నది నడిచిపోతున్నది”** నది ప్రతీకగా చేసుకొని, అనంత జీవనతత్వానికి అందెశ్రీ అపురూప భాష్యం చెప్పాడు .

**“తొలి చినుకు పడగానే/నేల నెల దప్పింది/తొలకరి జల్లులతో పుడమి పురివిప్పింది ప్రకృతికి హారమై /జీవనాధారమై/కొండలను కోనలను కొనగోట గెలిచింది/నేలపై నెలవంక తీరమై నిలిచింది/ అడవులనుముద్దాడి ఆకుపసరయ్యింది/లోయల్లో పాయలుగ/ఊయల లూగింది”** ఇలా అవిచ్ఛిన్నంగా సాగే అందెశ్రీ సృజన వాహిని పాఠకుల్ని ప్రరవశింప జేస్తుంది. అందెశ్రీ మరణంతో ఈ కావ్యం అసంపూర్ణంగా మిగిలిపోయింది.

ప్రజాకవిగా, గాయకునిగా వాగ్గేయకారునిగా ప్రఖ్యాతి గాంచిన అందెశ్రీ సంపాదకుడిగా, ప్రచురణ కర్తగా కూడా ఆదర్శనీయమైపాత్ర పోషించాడు. సాయుధ పోరాటం దగ్గరనుండి తొలిదశ, మలిదశ తెలంగాణా ఉద్యమం వరకూ వచ్చిన వందలాది పాటలను, వచన కవితలను సేకరించి ‘నిప్పుల వాగు’ పేరుతో ఆయన బృహత్ సంకలనాన్ని ప్రచురించాడు. పాటలకూర్పులో, ప్రాధాన్యత క్రమంలో చిన్న చిన్నలోపాలు ఉన్నప్పటికీ నిప్పులవాగు సంకలన గ్రంథం ఒక గొప్ప ప్రయత్నంగా చెప్పవచ్చు. అందెశ్రీ వాక్కులమ్మ ప్రచురణ సంస్థను స్థాపించి అరుదైన పుస్తకాలు ప్రచురించడం విశేషంగా భావించవచ్చు. సౌందర్య లహరి, పప్పు వేణుగోపాలరావు (సరళ వ్యాఖ్యానం) శ్రీ శూద్రగంగ – సుద్దాల అశోక్ తేజ; సృష్టి గర్భ – దీర్ఘాసి విజయ భాస్కర్; హసిత భాష్పాలు – శ్రీరామ్ లాంటి విశిష్ట కావ్యాలను అందెశ్రీ ఎంతో బాధ్యతాయుతంగా ప్రచురించాడు. వట్టికోట ఆళ్వారుస్వామిలా ఈ లోకకవి సమకాలీన కవుల రచనలను గుండెలకు హత్తుకున్నాడు. గంగ, బతుకమ్మ వంటి సినిమాలకు సంభాషణలు అందించడంతో పాటు ఇరవైకి పైగా పాటలు రాసి సినిమా కవిగా కూడా అందెశ్రీ టాలీవుడ్ మన్ననలు అందుకున్నాడు.

ఒక్కొక్కసారి జానపదాల రీతిలో, మరొకసారి లలిత గీతశైలిలో ఒక పర్యాయం సంస్కృత సమాస భూయిష్ట రచనా సంవిధానంతో




ఇంకొక్కసారి అచ్చమైన తెలంగాణ నుడికారంతో లయాత్మకమైనపద విన్యాసంతో సాగే అందెశ్రీ పాటలు, ఆయనబాణీలు విలక్షణంగా ఉంటాయి. భావ గర్భితంగా, రాగరంజితంగా దీర్ఘ శ్రుతిలో, తీవ్ర ధ్వనిలో పాటలు ఆలపిస్తుంటే అందెశ్రీ గాన కళా ఝరిలో మునిగి ప్రేక్షకులు మైమరచి పోతారు. సామాజిక స్ఫూర్తి, ఆధ్యాత్మిక ఆర్తి కలగలిసిన స్వతంత్రమైన తాత్త్విక దృష్టి ఆయన పాటల్లో, మాటల్లో తొంగిచూస్తుంది. అందుకే ప్రజాస్వామ్య వాదులతో పాటు గణపతి సచ్చిదానందస్వామిలాంటి సాధు పుంగవులుకూడా, అందెశ్రీ పాటను అభిమానించారు. తనకుల అస్తిత్వాన్ని ఆయన అంగీకరించలేదు. విశ్వనరుడిగా వెలుగొందాలనే సదా ఆరాటపడ్డాడు.

**“పాటను కనటానికి కూడా కవి ప్రతిరోజూ అమ్మలా ప్రసవ వేదన పడకపోతే ప్రజల్లో నిలబడలేడు. నిత్యం అమ్మతనాన్ని ఆపాదింప జేసుకొని పరకాయ ప్రవేశం చేసి ప్రజల ఆలోచనలకు రూపమై జనహృదయాంతరాళాల్లోకి తెలియకుండా ప్రవేశం చేసేవాడే కవి”** అని నిర్వచించిన అందెశ్రీ ఈ రకమైన రచనా రీతితోనే చివరి దాకా సృజన సాగించాడు. వైవిధ్యభరితమైన, స్వల్ప వైరుధ్య భరితమైన అందెశ్రీ పాటలగురించి లోతైన చర్చ జరగాల్సిన అవసరముంది.

అలభ్యంగా నున్న అందెశ్రీ పాటల సంపుటి, కవితా సంకలనాన్ని, ఆయన పాటలను పునర్ముద్రించి అందరికీ అందుబాటు లోకి తీసుకురావాలి. అసంపూర్ణంగా మిగిలిపోయిన అందెశ్రీ నదీ కావ్యాన్ని పరిష్కరించి ప్రచురించాలి. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలు అందెశ్రీ సమగ్ర రచనల సంకలనాన్ని ప్రచురిస్తే ఆయన సాహిత్య పరిణామ క్రమం అందరికీ అర్థమవుతుంది. “విత్తనం చనిపోతూ పంటను వాగ్దానం చేసినట్లు” సంపద్వంతమైన సాహిత్యాన్ని జాతికి అందించి కవన నక్షత్రమై నింగినధిరోహించిన అందెశ్రీ ప్రజల గుండె గొంతుల్లో కాలంతో పాటు ప్రతిధ్వనిస్తుంటాడు.

❖ ❖ ❖ ❖ ❖

# మాయమై పోయినాడమ్మా ... అందెశ్రీ

**గిరిధర్ రావుల,** ఇండియన్ పోలీస్ సర్వీస్, ఫోన్ : 91771 44119

అది ఫిబ్రవరి, 2020 అనుకుంటా...అప్పుడు నేను సమ్మక్క సారలమ్మ జాతర విధి నిర్వహణలో ఉన్నాను. నేను VIP diversion point దగ్గర కూర్చుని ఉన్నాను. ఓ పెద్దమనిషి అక్కడే తచ్చాడుతూ ఉన్నాడు. ఎందుకు ఇక్కడే తిరుగుతున్నాడనుకుని, ఓ పెద్దమనిషీ! ఎందుకు అటూ ఇటూ తిరుగుతున్నావు? ఇట్రా అంటూ, నా వాకీటాకీ, క్యాప్ పెట్టి ఉన్న కుర్చీ మీద నుండి వాటిని తీసేసి కూర్చోమని అన్నాను. చాలా సంతోషం సర్, అంటూ కూర్చున్నాడు ఆ పెద్దమనిషి. ఎందుకు తిరుగుతున్నావు? దర్శనం కోసమా అని అడిగితే, అవును సార్, మీవోళ్ళు పంపట్లేదు అన్నాడు. సరేగానీ, నేను పంపిస్తా.. ఫస్ట్ మంచినీళ్లు తాగుమని చెప్పి నీళ్ల బాటిల్ ఇచ్చా. తర్వాత ఒక్కరే వచ్చారా అని అడిగా. లేదు డ్రైవర్‌తో వచ్చాను అన్నాడు. చాలా సాధారణంగా మాట్లాడుతూ ఉన్నా కానీ, నాకు ఎక్కడో ఈయనను చూసా అనిపిస్తుంది. ఆయన మీ పేరేంటని అడిగారు.. నా వివరాలు చెప్పి మీరెవరని ఆయనను అడిగాను. నేను అందెశ్రీని అన్నాడు. ఓహ్..మీరేనా అందెశ్రీ అన్నాను...అదే ఎక్కడో చూసినట్టు అనిపిస్తుందని అన్నాను.

ఆయనో గొప్పకవి అని గానీ, 'జయ జయహే తెలంగాణ' అనే గానామృతాన్ని మన జాతికి అందించాడని గానీ నా మట్టిబుర్రకు తెలియదు. (నీకు అందెశ్రీ తెలీదా అనేవారు ఉండొచ్చు. నా చిన్న ప్రపంచంలో అందెశ్రీ తెలియకపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదె.. అలాగే నాకు ఆయన తెలియకపోతే ఆయనకు ఒరిగే నష్టం ఏమీ లేదు.)

ఆయన తొందర చూసి మా కానిస్టేబుల్ ను తోడుగా ఇచ్చి పంపించాను..మా కానిస్టేబుల్ ఆయనను గుడి దగ్గరికి పోయే దారిలో దింపి వచ్చేశాడు. అయ్యో, మొత్తం దర్శనం అయ్యేదాకా ఉండక పోయావా అని మా కానిస్టేబుల్ తో అన్నాను. తనేమీ మాట్లాడలేదు.

మళ్లీ ఓ గంట తర్వాత ఆయన దర్శనం చేసుకుని తన భుజాల మీద శాలువాలతో ఆనందంతో వచ్చాడు. నా మనసులో ఈయనకు శాలువా కప్పేంత సీన్ ఉంటే వి.ఐ.పి.పాస్ ఎందుకు తీసుకోలేదో అనుకున్నా.

చాలా చాలా ధన్యవాదాలు అద్భుతమైన దర్శనం అయింది... ఎవరూ పట్టించుకోని నన్ను మీరు ఇలా పిలిచి కూర్చోబెట్టి దర్శనానికి పంపడం ఆ అమ్మ దీవెన మీ ద్వారా పంపడమే అంటూ తన భుజాల మీద వేసుకున్న శాలువా నాకు కప్పి కృతజ్ఞతలు తెలిపాడు. మీలాంటోళు పోలీస్ డిపార్ట్మెంట్ లో ఉండాలి అంటూ ఆశీర్వదించారు.

నాకు ఆయన మీద నిదానంగా గౌరవం పెరుగుతూ వచ్చింది. మాటల్లో మన సబ్జెక్ట్ 'అద్వైతం' మొదలైంది. విచిత్రంగా ఆయన సబ్జెక్టూ అదే. ఐతే నా దేవుడు శక్తి, ఆయన దేవుడు అమ్మ! ఏదైతేనేం మా ఇద్దరిదీ అద్వైతం. అక్కడ మరో విచిత్రమైన విషయం తెలిసింది... ఆయన చదువుకోలేదని తెలిసి ఆశ్చర్యపోయా..ఆయనకున్న జ్ఞానానికి, చదుకోలేదన్న మాటకీ పొంతన లేదు. ఆయన అనాథ అనీ, ఒక ఆధ్యాత్మిక గురువు చేతిలో పెరిగాడని తెలిసింది. ఆ గురువుగారి బోధనే అద్వైతమని, ఆ సరస్వతీ మాత కటాక్షం ఈ సాహిత్యమని చెప్పారు. మాటల్లో తానో నిర్లక్ష్యం చేయబడ్డ కవినని చెప్పుకున్నారు. మాటల నడుమ ఇద్దరమూ చాయ్ తాగేసాం. తాను వెళ్ళబోయే సమయంలో హైదరాబాద్ లో ఇంటికి రమ్మన్నాను, ఫోన్ నంబర్ తీసుకుని ఆయనను సాగనంపిన.

తర్వాత శివరాత్రికి మా ఇంటికి వచ్చారు. అపర్ణను చెల్లె! అని సంబోధించేవారు. పిల్లలు సిద్ధి, ఇశాన్ లు ఆయన పాదాలను తాకి ఆశీస్సులు తీసుకున్నారు. అపర్ణ చేసిన ఉసోద (సాబుదానాతో చేసే ఒక మరాఠీ వంట, పోహా లాంటిది), ఫ్రూట్ సలాడ్ తిన్నారు. తన పాటలు పాడాడు. ముచ్చట్లు చెప్పుకుంటూ కొన్ని గంటల పాటు ఇంట్లో సంతోషంగా గడిపారు.

ఆయన ఎంతో హుషారు..ఆయన గొంతు మరింత హుషారు.

ఆయన గొంతెత్తితే పరిసరాలు అదే శ్రుతిలో ప్రకంపించేవి..

ఆయన ఆశువుగా పాడే పాటలు మనల్ని ఎంతగానో ఆశ్చర్య పరుస్తాయి. సాహిత్యం ఇంత లోతుగా ఉంటుందా అని అనిపిస్తుంది.

తర్వాత మా బంధం మరింత బలపడింది..నా "శోధన" కవితాసంపుటి ఆవిష్కరణకు ఆయనను ఆహ్వానిద్దామనుకున్నాము. కానీ, కుదరలేదు. ఆయనకు నేను రాసిన కవితలు పంపేవాడిని. మళ్లీ ఓసారి ఇంటికి వచ్చారు. తాను సంకలనం చేసిన "నిప్పుల వాగు" అనే ఉద్గ్రంథాన్ని నాకు అందించారు. నేను నా 'శోధన' ను ఆయనకు అందించాను. మీరు విచిత్రమైన మనిషి అన్నారు. పోలీసు కవితలు రాసుడేంది అని నవ్వేవారు.

ఆయన "జయ జయహే తెలంగాణ" మన రాష్ట్రగీతం కాబోతుందని తెలిసింది. అందెశ్రీ సాహితీ రూపాలు మన హృదయాల్లో అందెల రవళులై మోగుతూ ఉంటాయి. ఆ రవళుల నాదాలకు మన తనువులు ప్రతిస్పందిస్తూ ఉంటాయి

ఆయన పోయినా ఆ నిప్పులవాగు మాత్రం సజీవమై అలా సాహితీ లోకంలో ప్రవహిస్తూనే ఉంటుంది.

ఆయనకు నివాళి...ఆయన పాటకు ఘననివాళి.. ఆయన సాహితీ సేవకు మహానివాళి.

# పాటల నెగడు – అందెశ్రీ 'నిప్పుల వాగు'


**ఎ. విజయ కుమార్,** రచయిత, విమర్శకుడు, ఫోన్ : 9573715656

**ఉపోద్ఘాతం :**

మానవ మార్పులను, మనిషి అనుభవాలను భావోక్తంగా వ్యక్తం చేయడంతో పాటు, శ్రమతో అల్లుకొని చెమట చుక్కను పొదివికొన్న భాష అనేక శబ్దాలుగా ప్రవహించి లయబద్ధమై పాటగా రూపొందింది. **"టపటప టపటప సెమటబొట్లు తాళాలై పడుతుంటే / కరిగి కండరాల నరాలే స్వరాలు కడుతుంటే / పాట పనితో పాటే పుట్టింది – పనీ పాటతోటే జతకట్టింది"** అని ప్రముఖ సినీ గేయకవి సుద్దాల అశోక్ తేజ రాస్తాడు. ఆయన చెప్పినట్లు పాట పనితో జత కట్టి మానవ జాతి ప్రయాణంలో అద్భుతమైన తోడుగా నిలిచింది. అలా మనుషుల చారిత్రక క్రమాన్ని, అనుభవ సారాన్ని, జ్ఞానాన్ని ఒక తరం నుండి మరో తరానికి అద్భుతంగా అందించింది. మోసుకొస్తున్నది పాటనే. భాషకు అత్యున్నత రూపం పాటనే చెప్పవచ్చు. లిఖిత భాష లేని మొత్తం కాలంలో పాటే జానపదులకు ఆధారం. అభివ్యక్తి కూడా. పాటకు కదలని పెదాలు ఉండవు. స్పందించని హృదయం ఉండదు. అలా ప్రజా జీవనాడిలో భాగమైన పాట ప్రజల ఆనందాలకు, వేదనలను, పరివేదనలకు, ఆక్రందనలకు, ఆక్రోశాలకు ఓ రూపంగా మారింది.

**నేపథ్యం :**

తెలంగాణకు, పాటకు అల్లుకున్న అనుబంధం విప్పనలవి గానిది. చేను చెలకల్లో కనిపించే మర్రిచెట్టుకి, తాటి చెట్టుకు ఎంతటి పరస్పర గాఢ సంబంధం కలదో అట్లనే తెలంగాణకు, పాటకు అంతటి విడదీయని బంధం ఉంటది. తెలంగాణ నుండి పాటను వేరి చేసి చూడలేం. పాటలలో జానపద పాటలే అసలైన పల్లె పాటలు, అవే జనం పాటలు. నిజం చెప్పాలంటే జాన పదాలకు పుట్టినిల్లు లాంటిది తెలంగాణ మాగాణం. అందుకే పాటనే పునాది చేసుకొన్న అప్పటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఉగ్రూతలూగింది. ఆ ఉద్యమాన్ని ఒక దశ నుండి మరో దశకు చేర్చింది, ఆ పోరాటాన్ని ఓ మలుపుకు తిప్పింది పాటనే. సుద్దాల హన్మంతు, బండి యాదగిరి, తిరునగరి లాంటి అనేక కవి గాయకులు నాటి ప్రజల్లో ఉన్న జానపద పాటలు ఎత్తుకొని ఆడి పాడి కైగట్టారు. కాబట్టే ప్రజల పోరాటంగా నాటి సాయుధ పోరాటం మర్లడానికి, ఉద్యమం ఉరకలెత్తడానికి దోహదపడ్డది. ఆ తర్వాత కూడా ఈ నేలలో పాట పరవళ్ళు తొక్కి ప్రవహించింది. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాట ఉరకలెత్తింది. పోరుకు పొగరు తెచ్చింది. త్యాగాలకు దారులేసింది. సై అని సైరన్ మోగించింది. ధూం దాంలతో ఉద్యమాల ఊయల్లాగా ఊర్లు అయ్యాయి. ప్రతీ ఊరు నిప్పుల కుంపటిలాగా మారాయి.




అందుకే జనం రగిలారు. ప్రతి ఒక్కరూ ఒక్కో కొరకాసుగా మారారు. అలా పాట మండే జన వాగులను సృష్టించింది. అలాంటి పాటల నెగడు నెత్తుకొని ఊరూరా హోరెత్తిన అగ్ని శిఖ, జన పద గాయకుడు 'లోక కవి' అందెశ్రీ సంపాదకత్వంలో 2022లో వెలువడిన పుస్తకం "నిప్పుల వాగు". ఆయన లేని ఈ తరుణంలో ఆ పుస్తకాన్ని యాది చేసుకోవడం ఆయనను స్మరించుకోవడమే అవుతది. ఈ పుస్తకాన్ని రివీల్ చేసుకోవడం ద్వారా ఆయన లోలోపలి అంతరంగాన్ని సమాజానికి గుర్తు చేసినట్లు అవుతుంది.

అర్థ శతాబ్దాంన్నర పాటలను ఏరి వాటిలో నుంచి కణికల్లాంటివి ఎంపిక చేసి మనముందు కుప్ప పోశాడు అందెశ్రీ. ఈ పాటలు చారిత్రక క్రమాన్ని మలుపుతిప్పే గుణమున్నవి. లోతుల్లోకి మూల మలుపుల్లోకి ప్రవహింప చేసే చేవగలవి. ఇందులోని పాటలు ఉద్యమాలకు పాటే ఇంజన్‌గా మారి పరిగెత్తించే శకటంలా గోచరిస్తాయి. ఉద్యమాలకు, చారిత్రక మార్పులకు, భౌగోళిక మార్పులను, వర్గ మూలాలను, వర్గ శక్తుల సంగతులను తేల్చి చెప్పే లోతుగలవి. ఆ అన్నింటినీ ఒక మలుపు మలిపి, ఒక చోదక శక్తిగా ఉండేటట్లు సమాజ మార్పుకు ఉపయోగపడే పాటలు ఇవి. ఈ అన్నింటినీ ఒకాడ కుచ్చడం అనేది గొప్ప ప్రయత్నం. ఇది కూడా ఉద్యమమే, ఒక పెద్ద ప్రయాసే.

పాట ఉద్యమాలను సృష్టిస్తే ఆ ఉద్యమాలను సృష్టించిన పాటలను ఒక దగ్గర చేర్చడం, యేరి కుప్ప పోయడం కూడా ఒక ఉద్యమమే మరీ. కుప్పలో నివురు కప్పి ఉంటే ఏదో ఒకరోజు రగులుతది. అది మరో పోరాటానికి ఊతమిస్తది. రాబోయే పోరాటాలకు మార్గ నిర్దేశికం కూడా అవుతది. అంత సరుకు సరంజామా, అంత వేడి, వాడి, అంత గాఢత, అంత ఉష్ణం ఈ పాటల, కవితల రూపంలో ఆ పుస్తకంలో పారుతుంది.

334 మంది కవి గాయకులు రాసిన 645 పాటలు, 112 మంది సుప్రసిద్ధ కవులు రాసిన 145 కవితల సంకలనంతో నిప్పుల వాగు పుట్టుకొచ్చింది. ఇంత పెద్ద పుస్తకం మన చేతికి పట్టనంత, పట్టుకోలేనంతా కనిపించినా తిప్పుతున్న ప్రతి పేజీ మన గుండె లోతుల్లోకి ప్రవహిస్తున్నట్లు మమేకం చెందుతాము. ప్రతి అక్షరం పోరాటాన్ని, వీరులను, వారు చేసిన త్యాగాన్ని గుర్తుచేస్తుంది.

**పాటల విభాగాల పరిశీలన**

ఈ **"నిప్పుల వాగు"** పుస్తకం 'తెలంగాణ ఉద్యమ పాట' అనే సబ్ టైటిల్ తో ఉంటుంది. ఇందులో తెలంగాణ మలిదశ ఉద్యమ పాట, మలిదశోద్యమ వచన కవిత, 1969 ఉద్యమ పాట, సాయుధ తెలంగాణ పోరాట పాట భాగాలుగా అందెశ్రీ పాటలను పేర్చాడు.

**1. తెలంగాణ మలి దశ ఉద్యమ పాట :** ఈ మొదటి భాగంలో 278 మంది కవులు రాసిన 557 పాటలు ఉన్నాయి. ఇందులో ప్రతి పాట నిప్పుల సంతకమే. తెలంగాణ అంతటా రగిలించిన ఉద్యమ కెరటాలే. గ్రామ గ్రామాన నిప్పు రాజేసిన గుర్తులే అని చెప్పక తప్పదు. ప్రతి కవి రాసి పాడిన ఈ పాటలు తెలంగాణను చుట్టూ ముట్టి రణంను వెలిగించాయి.

**"జయ జయహే తెలంగాణ.. జననీ జయ కేతనం/ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం"** అనే తన పాటతోనే ప్రారంభించాడు. ఈ పాట తెలంగాణ రాష్ట్ర గీతంగా నాడు ఉద్యమ సమయంలో ప్రతీ పల్లెలో మారు మోగింది. రాష్ట్రం సిద్ధించాక 10 ఏండ్లు పాలించిన గత ప్రభుత్వం ఈ గీతాన్ని పట్టించుకోలేదు. ఆ మైమరపును, మదం ఎక్కిన తనాన్ని ఈ పాటల ఈటెతో గుచ్చడానికే తెచ్చాడని అందెశ్రీ ముందు మాటలో చెప్పిన విధం మనకు అలా గోచరిస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం అందెశ్రీ తాహత్ ను, ఆయన ఉద్యమ పాట తాకత్ ను గుర్తించి రాష్ట్ర గీతంగా ఇటీవల ప్రకటించింది. అట్లనే ఈ మొదటి భాగంలో గద్దర్...

**"అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా/**
**అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా"** (గద్దర్, శీర్షిక: అమ్మా తెలంగాణమా, నిప్పుల వాగు, పేజీ. 4). పుట్ట బంగారమైన తెలంగాణ నేలంతా, ఆకలి కేకలను ఎలా గానం చేసిందో అత్యంత ఆప్తంగా తెలంగాణ అమ్మకే చెప్పిన విధము గద్దర్ గొంతుతో తారాడిన పాట రెండో పాటగా..

**"పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా/**
**పోరు తెలంగాణమా/**
**పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా"** (గద్దర్, శీర్షిక: పొడుస్తున్న పొద్దుమీద, నిప్పుల వాగు, పేజీ. 7). ఈ పాట సినిమాలోనే కాదు తెలంగాణ అంతటా ప్రపంచమంతా జై కొట్టిన పాట, యువత ఉగ్రూతలూగి ఆడిపాడిన పాట ఈ పాట. దీనిని మూడో పాటగా పొందు పరిచాడు. ఆ తర్వాత తెలంగాణ అంతటా మారు మోగిన గూడ అంజయ్య పాటలు చేర్చాడు.

**"రాజిగ ఓరి రాజిగ.. ఓరి రాజిగ.. ఓరి రాజిగ/**
**ఓరయిలపురం రాజిగ.. ఒరె తెలంగాణ రాజిగ – ఛల్/**
**పుడితొక్కటి సత్తె రెండు.. రాజిగ ఒరె రాజిగ/**
**ఎత్తుర తెలంగాణ జెండ.. రాజిగ ఒరె రాజిగ"** (రాజయ్య గూడ, శీర్షిక : రాజిగ.. ఓరి, నిప్పుల వాగు, పేజీ. 10). అనే పాట, "అయ్యోనివా" అనే పాట ధూంధాం వేదికలపై దుంకులాడినవి.

**"ఇది తెలంగాణ కోటి రతణాల వీణ**
**గుండె రగిలి కదన రాగమాలాపించి.."** (పేజీ.13)

**"కదిలి రండి తెలంగాణ భూమి పుత్రులారా**
**తరలి రండి తెలంగాణ వీర వనితలారా"** (పేజీ.15) అని కదల మని చెప్పిన సుద్దాల అశోక్ తేజ పాటలు.

**"సాగేటి సాల్లల్ల నా తెలంగాణ"** (పేజీ.16), **"తెలంగాణ పాట నేడు తేట గట్టుతున్నది"** (పేజీ.19) అని పచ్చని పాలు గారే తెలంగాణను యాది చేసిన నందిని సిధారెడ్డి పాటలు. అలా ఉన్న తెలంగాణ **"సూదు తెలంగాణ సుక్క నీళ్లు లేని దాన"** (పేజీ.21) అని తాగ నీళ్ళు లేక డొక్కలు ఎండగా డిల్లీ గుండెలు అదరాలి. దేశ పునాదులు కదలాలని, **"జై బోలో తెలంగాణ/ గళ గర్జనల జడివాన"** అని గడీల నుండి దొరలనురికించిన, నైజాం పైజాము ఊడగొట్టిన, రోకలి బండల చేతులు, పిడికిళ్లు బిగించి పిడుగులు పడ్డా లడాయి మానం అని అందెశ్రీ గర్జించిన పాటలు.

**"రేల దూల తాలెల్లాడె నేలో నా తెలంగాణ/**
**సుడిగాలికి సెదిరిన పక్షుల గూడోలాయె నా తెలంగాణ/**
**కొట్టమెక్కి కోడిపుంజు కొక్కొరొకో అని కూతలు పెద్దది**
**కొమ్మల శివర కుసొని కోయిల కమ్మటి రాగాలింపిస్తుంటది**
**గంటనూపుతు బాల సంతులు ఇంట ముంగిట దీవెనియ్యంగ"** (వెంకన్న, గోరటి. శీర్షిక: రేల దూల తాలెల్లాడె నేల, నిప్పుల వాగు, పేజీ.25 ). అద్భుతమైన సంస్కృతులు మేళవింపు తెలంగాణ. వలస పక్షులకు నెలవు తెలంగాణ. అలాంటి నేల సెదిరిన పక్షుల గూడు లాగా అయ్యి చెట్టుకొకరు పుట్టకొకరు అయినట్లుగా వలస కూలీలుగా తెలంగాణ అయ్యేను కదా అనే వేదనతో గోరటి రాసిన పాట ఇది. ఇట్లున్న తెలంగాణలో **"ఇద్దరం విడిపోతె భూమి బద్దలౌతుందా/ ఇండియా పాకిస్తానోలె ఇనుప కంచె పడుతుందా"** (శీర్షిక: ఇద్దరం విడిపోతె, పేజీ. 26) అని అన్నదమ్ములవోలె విడిపోయి ఆత్మీయుల్లా కలిసుందామనే గోరటి వెంకన్న పాటలు నాటి తెలంగాణ పోరాటాన్ని మలుపు తిప్పినవి.

**"అలయ్ బలయ్ తీసుకో ఆగకుండా సాగిపో/**
**సేతుల సెయ్యేసుకో పిడికిళ్ళె బిగుసుకో/**


**అటో ఇటో అర్సుకో అద్దులు నువు గీసుకో/**
**దుంకుర తెలంగాణకై దూలంటూ ఓలాంటూ/**
**సాగర తెలంగాణకై సై అంటూ జై అంటూ"**

(మిత్ర, శీర్షిక: తెలంగాణ జంగు సైరన్, నిప్పుల వాగు, పేజీ.28) అనే పాటలో సబ్బండ కులాల సోపతితో బహుజనులంతా ఒక్కటై సామాజిక న్యాయంకై జంగుసైరన్ ఊదాలని. **"పాదరా పాదరా మన పాట/జనతెలంగానమని ప్రతి నోట"** అనే తెలంగాణ గీతంతో తెలంగాణ తల్లి బతుకు పాటను మిత్ర వినిపించగా..

**"అమ్మమ్మ సింగరేణి అమ్మా సింగరేణీ/**
**సల్లంగ చూడవే తల్లి సింగరేణీ .."** (పేజీ.32)

**"ఇంకేమి మిగిలిందిరా తెలంగాణ**
**జిల్లేడు మొలిచిందిరా.."** (పేజీ.33) ఈ పాటలతో జయరాజు తెలంగాణకు కొంగు బంగారమైన సింగరేణిని అమ్మ జూస్తే బొగ్గులాగ మండుతామని హెచ్చరించాడు. పల్లేరు గాసిన తెలంగాణలో పాలుగారే పిల్లలు పండేటి మొగ్గల్లా రాలుతున్నారని పాటలతో ప్రజలకు ప్రతీ పల్లెలో జరిగిన వందల సభల్లో కాళ్లకు గజ్జ కట్టి రక్తాలు కారిన ఆడిపాడిన పాటలు తెలంగాణలో ఇంకా పచ్చిగా తాకుతున్నాయి.

వీరి పాటలే కాక **"ఎదనిండ గాయాలు"," తెగతెంపుల యుద్ధం"** **వరంగల్ శ్రీనివాస్ పాటలు, "పొడిసేటి పొద్దోలె ఎలమంద", "ఎట్లున్నవే నా పల్లె" పల్లెను పలకరించిన నేర్నాల కిషోర్ పాటలు. "ఉద్యమాల వీరుల గన్న", "ధూం ధాం"** లాంటి దయా నర్సింగ్ పాటలు, **"తెలంగాణ అచ్చే దాక"** అంటూ సురా పాటలు, **"వీరులారా వందనం"** అంటున్న దరువు ఎల్లన్న, **"ఉస్మానియా లోన చిందిన రక్తము"** దరువు అంజన్న, **"అస్సోయ్ దులా హోరతి"** కోదారి శ్రీను, **"పోరు సాగుతుంది కొడుకా", "ఏమని పాడాలి"** అనే ఏపూరి సోమన్న పాటలు తెలంగాణ నలుదిక్కుల వారి గొంతుల నుండి కాలి గజ్జెల సందడితో ఊరూరా మోగాయి. కొమిరె వెంకన్న, యశ్ పాల్, గిద్దె రామనరసయ్య, మిట్టపల్లి, పాటమ్మ బిక్షపతి, పైలం సంతోష్, యోచన, వై. వెంకన్న, అంబటి వెంకన్నలు, కందికొండ, నిస్సార్, సాయిచంద్, జనార్దన్ లు, బుర్ర సతీష్, దేశపతి, మురళీ మధు, ఓరుగంటి శేఖర్, ఎస్ వి మల్లిక్, భూపాల్, మాస్టార్జీ, అనిశెట్టి రజిత, పొద్దు పొడుపు శంకర్, మార్క శంకర్, కందిక శ్రీనివాస్, విప్లవ దత్ శుక్లా, పాతూరి విజయ, గుడిపల్లి రవి, బోనాల ప్రకాష్, శ్రీశైలం, యాద గౌడ్, సత్తయ్య, రాము, అయిలయ్య, సూర్యప్రకాశ్, జూలపల్లి, ఎన్నార్, శ్రీపాల్, నక్క సురేష్, వేముల శ్రీనివాస్, పసునూరి రవీందర్, నలిగంటి శరత్, మంత్రి శ్రీనివాస్, రమణా చారి, స్వామి గౌడ్, రామారావు, రామలింగం, జాని లాంటి వారి పాటలు పేర్కొని, చివరగా జలజ **"స్వరాష్ట్ర స్వప్నము"** పాటతో, అలాగే **"ఏందిరా.. ఏందిరా.. తెలంగాణము/ఎల మూగబోయింది జనగానము"** (అందెశ్రీ, పేజీ.863) స్వరాష్ట్రం సిద్ధించిన ఏడెండ్లకు తనే రాసిన




ఈ పాటతో ఈ విభాగం ముగించాడు. వచ్చిన తెలంగాణ ఏమి మారలేదని, యముల పాలయ్యిందనీ వాపోయాడు అందెశ్రీ. నదుల ఇసుక దోసేసిన తీరుని, నీళ్లను ఎత్తిపోసి నిధులను కాజేసిన దోపిడీనీ, దళిత ముఖ్యమంత్రి, ఇంటికొక్క జాబు, బంగారు తెలంగాణ బాగోతంలు, మాట తప్పితే తల నరుక్కుంటాననే కోతలు ఎటుబాయే నని నిలదీసిన ఈ పాటతో మొదటి భాగాన్ని ముగించాడు.

తెలంగాణ ఏర్పడ్డాక జరుగుతున్న దగాను కూడా మెన్షన్ చేద్దామని బహుశా ఆ పాటను జొప్పించాడు అందెశ్రీ.

ఇలా ఐదు వందల యాభై మందికి పైగా రాసి పాడిన పాటలు తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ఓ ఊపు ఊపాయి. ఈ అన్ని పాటలు ఒక్కొక్కటి ఒక్కో అగ్నికణం. మధ్యలో పడిపోతున్న ఉద్యమాన్ని మళ్లీ మళ్లీ రగిలించాయి. ఒక్కో సందర్భంలో ఒక్కో పాట తుపాన్ ఉ ధృతిని కలిగించింది. ఇవన్నీ పాటలు వేటికవే ప్రత్యేకం. ప్రవాహం గుణం ఉన్నవి. ప్రవాహాన్ని పరిగెత్తించే సత్తువ ఉన్నవి. ఈ పాటలే ఉద్యమం. ఇవి లేకపోతే తెలంగాణ మలిదశ పోరాటం లేదు. దాని గాఢత ఉండకపోయేది. ఆరని చిచ్చులా నిత్యమండే లావాలా తెలంగాణ ఉద్యమ కొలిమిని అనునిత్యం రగిలించాయి ఈ పాటలు. అసలు ప్రత్యేక తెలంగాణ సాధకురాళ్లు పాటలే అంటే అతిశయోక్తి కాదు. అందుకే తెలంగాణ అంటే పాటే.

**2. మలిదశోద్యమ వచన కవిత :** మొదటి దశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం అయ్యాక అప్పుడప్పుడు రాజకీయ సప్పుడు ఉండేది కానీ సస్టైనబిలిటీ దానికి లేకుండే. రాజకీయ సస్టైనబిలిటీనీ నిలబెట్టింది. ఉప్పందించింది. నిరంతరంగా సాగించింది వచన కవిత సాగు వల్లే అని చెప్పొచ్చు. కవులు, రచయితలు, మేధావులు నిరంతర రచనల వల్లే మలి దశ తెలంగాణ పోరాటం లేచింది. మలి దశ పోరాటానికి నివురులా ఉన్న నిప్పును రాజేసింది వచన కవిత్వమనే చెప్పాలి. ఈ నిప్పుల వాగులో రెండవ భాగంగా మలి దశోద్యమ కవితలను పొందు పరిచాడు అందెశ్రీ. ఈ విభాగంలో 112 మంది సుప్రసిద్ధ కవులు రాసిన 145 వచన కవితలు ఉన్నాయి.




**“పరవళ్ళు తొక్కిన మూసి పరాయిదైపోయింది/వలస వచ్చిన పల్లె బాట/గొంతు ఎండి పొలమారింది”...**

**“వొడ్డును దొంగలించిన దౌర్జన్యాల రాజకీయం/ కాంక్రీట్ వంతెనలపై బండ బారిన బతుకులు”** (నిఖిలేశ్వర్, శీర్షిక: మా మూసీ ఎక్కడ?, నిప్పుల వాగు, పేజీ. 867) హైదరాబాద్ లో ప్రజల దాహార్తిని తీర్చి, పల్లెలకు పరుగులు పెట్టేది. పారినంత మేర పంటలు సాగు బడితో పల్లె కళ కళ లాడేది. ప్రవాహానికే ప్రహరీలు కట్టి కబ్జాలకు గురైనది కాబట్టే పల్లె పట్నం బాట పట్టింది. ఇక్కడ ఒడ్డు కూడా కబ్జానే కదా వంతెనలపైనే ప్రజలు బతుకులు వెళ్లదీస్తున్నారని భావాన్ని వ్యక్తం చేస్తున్నది ఈ మూసీ ఎక్కడ కవిత.

**“దేశంగాని దేశంల ఆయన ఖల్లవెల్లి అయితే/మేమిక్కడ ఇంట్ల ఊర్లె మనుషుల్ల/ సూత్తు సూత్తుండగానే ఖల్లవెల్లి అయిపోయినం”** (జగన్నాథం, జూకంటి. శీర్షిక: ఖల్లవెల్లి, నిప్పుల వాగు, పేజీ. 887) దుబాయికి పోయి వలసలతో ఆగమాగమైన ఉత్తర తెలంగాణ ప్రజల దుస్థితిని తెలిపే కవిత ఇది.

**“పారేది ఈ నేల నదులు/ప్రతిఫలపు పంట ఆ కోన”** (తిరుమల రావు, జయధీర్. శీర్షిక: ఇది వంద యుద్ధాల ఒడి, పేజీ. 868) కృష్ణా గోదావరి నదులు గల గలా పారుకుంటూ తెలంగాణ నుంచే పరుగులు పెడుతుంటాయి. కానీ ఇక్కడ బీళ్లు పట్టిన నేలలు కనిపిస్తుంటే ఆంధ్రలో మూడు పంటలతో సస్యశ్యామలంగా వెలుగొందుతున్నాదని, ప్రతిఫలం వారికే దక్కుతుందని వాపోతున్న తీరుని విప్పి చెపుతున్నాడు ఈ కవిత ద్వారా కవి జయధీర్ తిరుమల రావు. అలాగే **“తెలంగాణకు గో గ్రహణం”** (పేజీ. 879) పట్టిందని అంటాడు కవి బియ్యాల జనార్దన్ రావు.

**“మీరు బొగ్గు తియ్యండి, పవర్ జెనరేట్ చేసి/మేం లాభాలు పంచుకుంటాం/ కలిసి ఉందాం తమ్ముడూ కలిసుందాం”** (సిధారెడ్డి, నందిని. పేజీ. 890) వ్యంగ్యంగా విసిరిన **“కలిసి ఉంటే కలదు”** అనే శీర్షికతో ఉన్న ఈ కవిత తెలంగాణ పట్ల చేసుకున్న ఒప్పందాలను చట్టు బండలు చేసిన తీరుని, పవర్ పదవులన్నీ ఆంధ్ర వాళ్ళే పంచుకున్న మోసాన్ని, కంపెనీలు పెట్టుకొని అందులో తెలంగాణ బిడ్డలను నౌకర్లను చేసిన ఆంధ్ర ప్రాంత పెట్టుబడిదారుల బాగోతాన్ని వ్యంగ్యంగా నందిని సిధారెడ్డి ఈ కవితలో కడిగేశాడు.

**“తంగేడు పూలు పేద పేద పువ్వులు రా.. పేద వారి పువ్వులు రా”** (గోపి, ఎన్. పేజీ. 897) తెలంగాణ సెలకలల్లో విరగపూసే తంగేడు పూలు అందరికీ ఇష్టమే. కవి గోపి నాకు ప్రాణం అంటాడు. అలా తెలంగాణ పల్లె ప్రకృతి పూల అందాలను తెలుపుతున్నాడు. అలాగే **“చావుకు తెగిస్తే ఉద్యమం/ వేడుక చూసేది రాజకీయం”**, (పేజీ. 898) **“...ఉద్యమం జనస్వామ్యం/రాజకీయం ధనస్వామ్యం”** (గోపి, ఎన్. శీర్షిక: ఉద్యమం వర్సెస్ రాజకీయం, పేజీ. 899) అనే కవిత్వ పాదాలు అలా ఉద్యమ గొప్పతనాన్ని, రాజకీయం యొక్క అవకాశ వాదాన్ని విప్పి చెబుతున్నాడు కవి. ఉద్యమమే మార్పుకు దోహదకారి. రాజకీయాన్ని సరైన మార్గంలో నడిపేది కూడా ఉద్యమమే. ఇంకా **“నేను భాషను ప్రేమిస్తాను/యాసను ప్రేమిస్తాను”** (శీర్షిక: నా పేరు యాదగిరి, పేజీ.900) అని జింబో, **“నయవంచనను నయగారంగా ప్రకటించే భాష”** (పేజీ. 902) అని అధికార భాష అనే శీర్షికలో అధికార భాష మర్మాన్ని చెబుతాడు కవి ఎన్. వేణుగోపాల్. అలాగే కన్నతల్లి హైదరాబాద్ అంటూ నగరంపై ప్రేమ వెలిబుచ్చుతాడు అమ్మంగి వేణుగోపాల్. **“నా హైద్రాబాద్ ను హైద్రాబాద్ గానే ఉండనివ్వండి”** (పేజీ. 906) అంటాడు ఆశారాజు. **“వీడు తెలంగాణవాడు వీర తెలంగాణ వాడు”** (పేజీ. 907) అంటూ తెలంగాణ వాడు శ్రమజీవి కాదనే వాని మొహం గుద్ది చెప్పినట్లుగా, తెలంగాణ వాడు వీరుడు, ఒళ్ళువంచు శ్రమ జీవుడు అని తిరునగరి వీడు తెలంగాణవాడు అనే శీర్షిక ద్వారా సగర్వంగా ప్రకటిస్తాడు. తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని చెబుతూ తెలంగాణ కోసం జంగ్ నడపమని అల్లం నారాయణ కవి సుదీర్ఘ కావ్యంలో **“యాది మనాది”** (పేజీ.908) అనే శీర్షిక ద్వారా ప్రకటిస్తాడు.

కొంచెం నీరు కొంచెం నిప్పు అంటాడు కె. శ్రీనివాస్, కాయకల్ప చికిత్స తప్పదంటాడు రావణ్. బ్లాకౌట్ అంటాడు మొగిలి. వాళ్ళు

మేము అంటూ విడిపత్రం రాస్తాడు సుంకిరెడ్డి నారాయణ రెడ్డి. తెలంగాణల అప్పటి కరువును కండ్ల ముందు పెడతాడు ఏలేశ్వరం నాగభూషణాచార్య. తెలంగాణకోసం కలవరింత చెందుతాడు అన్నవరం దేవేందర్. ఆకలి ఆలాపనలు వినిపిస్తాడు గాజోజు నాగ భూషణం. సి హెచ్. మధు, దిలావర్, ఏనుగు నరసింహ రెడ్డి, కవి సిద్ధార్థ, దెంచనాల శ్రీనివాస్, మోహన్ రుషి, చెరుకు సుధాకర్, తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య, గాదె వెంకటేష్, బెల్లి యాదయ్య, వేముల ఎల్లయ్య, స్కైబాబ, దామెర రాములు, దేవ రావ్, జనజ్వాల, అఫ్సర్, సీతారాం, యాకూబ్, పగడాల నాగేందర్, ఎస్.రఘు, వనపట్ల సుబ్బయ్య, నాంపల్లి సుజాత, జ్వలిత, జూపాక సుభద్ర, గోగు శ్యామల, షాజహానా, కొల్లాపురం విమల, ఎన్. అరుణ, నాళేశ్వరం శంకరం, కాసర్ల నరేష్ రావు, శారదా హన్మాండ్లు, అన్వర్, బాణాల శ్రీనివాస రావు ఇలా ఇంకా కొంత మంది కవులు తమ పెన్నుతో తెలంగాణకై కవితలను జులిపించారు. ఈ కవులు ఇలాంటి కవితలను కుప్పపోసి మలి దశ పోరాటానికి దశ దిశను చూపారు.

**3.1969 ఉద్యమ పాట :** విశాలాంధ్ర ఏర్పడ్డాక పెద్ద మనుషుల ఒప్పందం అమలు కాలేదు. ఉద్యోగాల్లో ముల్కీ నిబంధనలు పాటించలేదు. చిన్నచిన్నగా మొదలైన ఉద్యమం చిలికి చిలికి గాలివానగా మొదలైనట్టు ఖమ్మం పాల్వంచ థర్మల్ పవర్ స్టేషన్ లో స్థానికులకే కొలువులు ఇవ్వాలని 1969 జనవరి 5న నిరసనలు ప్రారంభమై 8న రవీంద్రనాథ్ అనే విద్యార్థి నిరహార దీక్షతో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు ప్రతిగా ప్రభుత్వం నిర్బంధం విధించి కాల్పులు జరిపి 369 మందిని పొట్టనబెట్టుకుంది. ఈ తొలి దశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా పాట పాత్ర ఎనలేనిది. పాట పట్టరాని ఆక్రోశాన్ని, అంతులేని ప్రకోపాన్ని ప్రకటించింది.

ఈ విభాగంలో 30మంది రాసిన 46 పాటలు పొందు పరిచాడు అందెశ్రీ.

**"నీ రక్త నాళాలు నీరసాలైనవా/ పోలీస్ తూటాలు తూట్లు పొడిచిన గుండె/చివ్వుమని రక్తాన్ని పైకి చిమ్మిన వేళ"** (గిరి 69. శీర్షిక: శివుడు మూడవ కన్ను, నిప్పులవాగు, పేజీ 1159) రక్తము చూసి ఊరకుండా ఉండేటేల అంటూ యువతను కదల మంటూ పుట్టిన పాట ఇది.


**"అన్నదమ్ములము, ఆప్తమిత్రులమటంచు చేరినారు/ పొట్ట కూటికై వచ్చిన వారలు/ గట్టిపడిరి మనలో"** (రుక్కు'69. శీర్షిక: మనకు జరిగిన అన్యాయం, పేజీ.1161) అని ఆంధ్ర వారు అన్నదమ్ములం అని వచ్చి ఎట్లా గట్టిపడి తెలంగాణను మెల్లిగా ఆక్రమించుకున్న తీరుని వివరించింది ఈ రుక్కు పాట.

**"కదనాల శత్రువుల కుత్తుకల నవలీల**
**నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి**
**వీరులకు కాణాచిరా! తెలంగాణ**




**ధీరులకు మొగసాలరా.."** (వేంకట రామారావు, రావెళ్ళ. శీర్షిక: మాతృ గీతము, పేజీ. 1216) తెలంగాణ చైతన్య నేల అని, రుద్రమ లాంటి స్త్రీల శౌర్యము చూపిన ఈ నేల వీరులకు కాణాచి ధీరుల మొగసాల అని ఎలుగెత్తి ప్రకటించాడు గాయకుడు రావెళ్ళ. **"వీర తెలంగాణా యిదిగో సలాం నీకు తగదు ఆంధ్రతో గులాం"** (మల్లేశం, మేర. శీర్షిక: వీర తెలంగాణా.. తగదు గులాం, పేజీ. 1223) ఆంధ్రతో పొత్తు ఇక పొసగదని, పోరాటం తెలంగాణకు కొత్తేమీ కాదంటూ యుద్ధం ప్రకటించాడు మల్లేశం ఈ పాటతో. **"జాజిరి జాజిరి జాజిరి జావో"** సత్యనారాయణ,ముచ్చెర్ల. శీర్షిక: జాజిరి, పేజీ. 1226) ఈ పాటతో పోచంపాడు, మానేరు ప్రాజెక్టుల పొడగొట్టిన తీరుని కవి తెలుపుతాడు. అలాగే **"సంజీవ రెడ్డి మామా"** ఉర్దూ పాటతో ముచ్చెర్ల ముచ్చట గొలుపుతాడు. లేవరా సోదరా లేవరా సోదరీ అని చైతన్య పాటను అందుకున్నాడు ఎస్వీ సత్యనారాయణ. అలాగే భార్గవ, జి. యశోద, కాళోజీ, ఎమ్ సుదర్శన్ రెడ్డి, అనుముల శ్రీహరి, జి వి జగదీశ్వర స్వామి, ఇందుర్తి ప్రభాకర్, జి. శ్రీశైలం, రుక్నుద్దీన్, పెరుమాండ్ల సుధాకర్ ఇలా కొద్ది మంది కవి గాయకులు తమ పాటలతో తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నీరందించారు. పోరు మొక్కలకు మంచి ఎరువుగా మారాయి అప్పటి ఈ పాటలు.

**4. సాయుధ తెలంగాణ పోరాట పాట :** స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అందుకొని తెలుగు భాష రక్షణకు గ్రంధాలయ ఉద్యమం నాటి నైజాం రాష్ట్రంలో ఊపందుకుంది. క్రమంగా అది ఆంధ్ర మహాసభగా మారింది. జన సమస్యల వెల్లువగా వస్తున్న నేపథ్యంలో వాటి పరిష్కారం అంతా వ్యవస్థ మార్పు వల్లే సాధ్యమని తెలిపే కమ్యూనిస్టు పార్టీ ప్రభావంతో 10వ ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టుల నాయకత్వం లోకి వెళ్ళింది. దొరల పాలన పోవాలని, వెట్టి చాకిరీ పోవాలని, దున్నే వాడిదే భూమి అనే నినాదాలతో దొరలపై ఎర్రజెండా నాయకత్వంలో ప్రజలు పోరాడారు. ఐలమ్మ తెగువతో పంటను రక్షించుకోగా, కాజెయ్యాలని దొర ప్రయత్నం అడ్డుకోవాలని తిరుగు బాటు వచ్చింది. ఆ పోరాటంలో దొడ్డి కొమురయ్య తొలి అమరుడు అయ్యాడు. ఆ దొరల, వారి రక్షకులుగా నిలిచిన రజాకార్లను ఎదుర్కోవడానికి ప్రజలు సాయుధులుగా మారారు. స్థానిక దొరలకు, నైజాం రాజ్యానికి వ్యతిరేకంగా సాగిన ఆ పోరులో పాటే ప్రధాన



ఆయుధం అయ్యింది. ఆ పోరులో ఒకవైపు పెన్ను మరో వైపు గన్నుతో సుద్దాల హనుమంతు పోరు సల్పాడు. బండి యాదగిరి, తిరునగరి రామాంజనేయులు తమ గళంతో సాయుధ పోరును మరో దశకు చేర్చారు. ఈ విభాగంలో 26మంది కవులు రాసిన 42పాటలకు స్థానం లభించింది.

**"వేయ్ వేయ్ వేయర దెబ్బ/ దెబ్బకు దెబ్బ వేయ్ వేయ్/ దయ్యపు గూండా గొయ్యలు రజాకార్లు/కయ్యానికి మనపైబడి వచ్చిరి"** (హనుమంతు, సుద్దాల. శీర్షిక: దెబ్బకు దెబ్బ వేయ్, నిప్పుల వాగు, పేజీ. 1243) ఈ పాట గుమి కూడిన జనంపై హఠాత్తుగా మీద పడ్డ రజాకార్లను తిప్పికొట్టడానికి హనుమంతు అప్పటికప్పుడు ఎత్తుకున్న పోరు పాట ఇది. సాధారణ జనంలోంచి వచ్చిన మాటల్లోంచే పుట్టినది ఈ పాట. పోరును మండించిన పాట. జంగు సైరన్ అయినది ఈ పాట. ఇది ఉద్యమానికి ఊపు నిచ్చెన పాట.

**"బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి/ ఏ బండ్లే బోతవు కొడుకో నా కొడకా ప్రతాప రెడ్డి"** (యాదగిరి, బండి. శీర్షిక: నా కొడకా ప్రతాప రెడ్డి, పేజీ. 1247) ఈ పాటే తర్వాత **"కొడుకో నైజాము సర్కరోడా/ నాజీల మించినౌరో నైజాము సర్కరోడా"** (పేజీ. 1245) అనే పాటగా ప్రసిద్ధి కెక్కింది. **"అమర జీవివి నీవు కొమురయ్యా/ అందుకో జోహార్లు కొమురయ్యా"** (నరసింహారావు, కె. ఎల్. ఖమ్మం, శీర్షిక: తెలంగాణ తొలి అమరత్వం, పేజీ. 1233) పాట దొడ్డి కొమురయ్య అమరత్వాన్ని ఊరూరా కొనియాడింది. **"సై సై గోపాలరెడ్డి, రెడ్డి నీవు/ నిలిచావు ప్రాణాలొడ్డి"** (రామాంజనేయులు, తిరునగరి. శీర్షిక: సై సై గోపాలరెడ్డి, పేజీ. 1234) గోపాల రెడ్డి త్యాగాన్ని, ధైర్యాన్ని, అమరత్వాన్ని, యోధునిగా, వీరునిగా ఈ పాట పల్లెపల్లెన ప్రజలు పాడుకున్నరు. అంతేకాక వయ్యా రాజారాం పాటలు, అలువాల వెంకయ్య, దాశరథి, కొమరగిరి నారాయణ రావు, నల్ల నరసింహులు, నూతి నర్సయ్య, వట్టికొండ రామ కోటయ్య, కోగంటి గోపాల కృష్ణయ్య, మేర మల్లేశం, అజ్ఞాత కవుల పాటలు, స్త్రీలు పదుకున్న ఉయ్యాల పాటలు ఆ నాటి ప్రజలు హృదయాల్లోనుంచి పాడుతుంటే దొరల గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి.

**ముగింపు :**

ఈ నిప్పుల వాగు పుస్తకంలో ప్రతి పుట మండుతున్న కొర్రాసే. ఇందులో ప్రతీ పాట ఓ పోటెత్తిన కెరటమే. ప్రతీ పోరాటంలో పాట లావాలా ఎగసి పడ్డది. అలాంటి పాటలను కలపడం ఓ యుద్ధమే అవుతుంది.

కనీసం దశాబ్ద కాలం పనిచేస్తే గానీ ఇంత పెద్ద పుస్తకాన్ని ఎవరూ తీసుకురాలేరు. పాటలు ఒక దగ్గర పేర్చినవి కావు. అందెశ్రీనే అన్నట్లు **"చీకిపోయిన గుడ్డముక్క లెక్కనే పాటల చిక్కుముళ్ళను సక్కగా సరి చేయడానికి ఆరేడు నెలలు పట్టింది"** అని పుస్తక ప్రయత్నాన్ని, కష్టాన్ని మనకు నివేదించాడు. దీనికి ఉక్కు సంకల్పం అవసరం. వెనుదిరగని ధైర్యం అవసరం. అలసి పోని శ్రమకావాలి. నిద్రలేని రాత్రులు ఎన్నో కోల్పోతే తప్పితే ఇంతటి లావాటి బుక్ రావడం అసాధ్యం. అంతటి శ్రమను, కాలాన్ని వెచ్చిస్తేనే అందెశ్రీ ఈ పుస్తకాన్ని సృష్టించగలిగాడు. అందెశ్రీ పాటగాడిగా, పాటలకు అంకితమై ఉన్నవాడిగా, పాటలను అమ్మని వాడిగా, పాటలను నమ్మిన వాడిగా ఉన్నవాడు కనుకనే ఇంతటి గొప్ప పుస్తకం తీసుకు రాగలిగిండు. సహజంగా కవితల సంకలనాలు వస్తుంటాయి. అనేకం ఈ నేలన ఇప్పటికే వచ్చాయి. కానీ ఎంత కాదన్నా కవితల కంటే పాట ప్రభావితమైంది. తెలంగాణ అన్ని పోరాటాలలో కవిత్వాల కంటే పాటలే ఎక్కువ ప్రభావితం చేశాయి. నడిపించాయి. ఉరక లెత్తించాయి. ఇలాంటి పాటల సంకలనం రావడం అరుదే. ఇంకా రావాల్సిన అవసరం చాలా ఉంది. ఒక్క పాటగాడు ఒక్కరి పాటను కాకుండా సహచర పాటల కవులందరి పాటను నెత్తికెత్తుకొని భుజాన మోయడం, కాయలు కాస్తున్న సలుపులు తీస్తున్నా, పదేళ్ల పాటు బరువు ఎత్తుకొని దించని ప్రయత్నం చేయడం, మట్టిలోని పసిడిని తీసినట్లు నిప్పులవాగుని తీయడం గ్రేట్.

ఈ పాటలు పేర్చిన వాటిలో ఆ విభాగాల కిందికి రానివి ఉన్నాయి. ముందో తర్వాతవో అయినవి విభాగాల్లో ఉన్నాయి. వచన కవిత్వం ఈ పాటల గ్రంథంలో చేర్చడం అసంబద్ధం అనిపిస్తుంటది. ఇంకా చేర్చాల్సినవి కూడా ఉంటాయి. పాటలు వచ్చిన సమయాలు ముందెనుకలు ఉంటాయి. అయినా చేసిన ఈ ప్రయత్నం ఓ అద్భుతం.

నిప్పుల వాగు తెలంగాణ మట్టిలో దాగి ఉన్న సహజ దావానలం... బడభాగ్ని సమాజపు ప్రకృతి విరుద్ధ చేష్టలు మితిమీరినప్పుడు, మరిగి మరిగి ఒక్కసారే అగ్నిపర్వతం లా పేలి దుష్ట ప్రయత్నాలను తుడిచేసే శక్తి ఈ నేలలో ఎప్పుడూ ఉంటుంది. ఈ పుస్తకంలో ప్రతి అక్షరం, పదాలు, పాటలు, వచనాలు, కవితలు.. అవి తన వాడి వేడిని మనకు తగిలి మండే పొగరుని మనకు గుర్తు చేస్తుంటాయి. అలాంటి ప్రయత్నం చేసిన నిప్పుల మనిషి అందెశ్రీకి సెల్యూట్.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 2 (35) హైదరాబాద్ డిసెంబర్ : 2025

# మరణం కూడా మాట్లాడుతూనే ఉంది

**భూపతి వెంకటేశ్వర్లు,** ఎడిటర్, మోదుగుపూలు. ఫోన్ : 94900 38343

రాత్రి ..మనతో నవ్వుతూ.. తుళ్ళుతూ .. మాట్లాడి తెల్లారేసరికి ఆ వ్యక్తి మరణ వార్త వింటే .. గుండెను కోసేసిన తీరు భాషకు అందని భావోద్వేగం ఆ వార్త వినడానికి మించిన నరకం మరేదీ ఉండదు

ఇలా.. ఒకరేమిటి కవులు, కళాకారులు యావత్తు తెలంగాణ ప్రపంచమే తల్లడిల్లి పోయింది. అంతటి దిగ్భ్రాంతి కి లోనైన మరణం అందెశ్రీ ది ఎందుకంటే?

అతనొక సాధారణ మనిషి, సాధు జీవితం, ప్రకృతి తోనే ప్రయాణం – పాటే ప్రాణం, దారితప్పనివారు, దరి దాపులేనివారు, ధిక్కార స్వరం. కవిగా కాలాన్ని కాల గమనాన్ని కైకట్టినవాడు ప్రజల హృదయాంతరాలల్లో పాటల ముద్రలను నాటినవాడు పాఠశాల మెట్లెక్కని వారుయి, ఒక నిరక్షరాస్యుడు బహుభాషలు రాకుంటే ఏమి? ప్రపంచ నదుల మీద నావలా కదిలినవాడు తనది ఉక్కు సంకల్పం, ఊహలకందని ప్రయాణం. ఈ ధరాతలం మీద ప్రవహించే మహోన్నత జీవనదులను ఒక కావ్యంగా మలచాలని తానే ఒక నదీ ప్రయాణికుడు గా మారినవాడు.

నది నడిచిపోతున్నదీ.. నన్ను నావనై రమ్మన్నదీ
పలుమారు పిలుస్తున్నదీ.. నాలో ప్రాణమై దాగున్నదీ
పాదాలు లేకున్నా.. పయనమెపుడాగదూ ఎదురేది నిలుచున్నా .. బెదిరి, వెనుదిరుగదూ
గాయాలు ఎన్నయినా.. నా గానమై గమనాల..నది నడిచి పోతున్నదీ.. అంటూ..కావ్యకడలి సాగుతోంది.

కూర్చున్న కాడనే ప్రపంచం గురించి ఆలోచిస్తారు కూసింత ఆలోచన చేసి ఇగ ప్రయాణాలు మొదలెడితే ..మన కళ్ళకు కప్పిన పొరలు తొలగి అహంకారం అడుగంటి పోతుంది అంటారు.

ఈ విశ్వ ప్రాణికోటి పుట్టుక కు కారణమైన ప్రపంచ నదులకు ప్రాణమున్నంత వరకు ప్రణామం చేస్తాను అంటూ 'నదీ కావ్యం' రాస్తూ నది మధ్యలోనే నావాగి పోయినది.

జయ జయహే తెలంగాణ గీతాన్ని స్వరాష్ట్రోద్యమం గాయత్రీ మంత్రంగా ప్రవచించింది. ఆ పాటను 4 కోట్ల నాలుకలపై ప్రతిష్ఠాపనం చేసిన మహర్షి అందెశ్రీ.

ఇది దగాపడ్డ దరువు మాకు ఏది బతుకుతెరువు అని ప్రశ్నించాడు. రాజ్యధికార కవి పోతన వలె పోత పోసిన నిబద్ధత గల ఋషి అందెశ్రీ.

పల్లెటూరి పిల్లగాడు పసులగాసే మొనగాడు అమ్మ పాలు కూడా తాగని అనాథ, కొలువు కుదిరించుకున్న దొరోడు ఇచ్చే అద్దశేరు



నూకలు కూడా ఎగ్గొట్టినా కూడా ఎట్టోడిలా పనిచేసినవాడు తాటి జగ్గల కాలిజోడు తప్పటడుగుల నడక తీరుతో జీతంచేస్తూ.. మాయదారి ఆవు దూడలు మాటిమాటికి ఎనుగుదూంకి పంటచేలు పాడు చేస్తే పాలికాపుతో దెబ్బలు తిన్నోడు.

జీతం లేని జీతగాడు ఆయన జీవితమే దుఃఖం పాఠశాల మెట్లెక్కనోడు వెలుగు లేని జీవితం గడిపినవాడు బువ్వ లేని రోజుల్లో అడవే.. ఆదుకుంది అదే కృతజ్ఞతతో నేటికీ ఆయన అడ్రస్ అడవి కాదంటే కారడవి కాకుంటే ఉస్మానియా చిట్టడవి చెప్పుల్లేని నడక, మాయమైన మనుషులకు దూరంగా ప్రకృతి ఒడిలోనే పయనించిన వారు రాజ్యంతో రాయభారం పదవులు, ప్రశంసలు గిట్టనివారు.

**"ఏలుకుంటే అయిదేళ్ళు కాదంటే పదేళ్ల ఎల్ల కాలం ఏలటానికి తెలంగాణ ఎవ్వరి జాగీర్ కాదు.. నైజామోడిని దిగంతాలకు తరిమి కొట్టినది గడీలకు అగ్గి పెట్టినది తెలంగాణ మంటే పిడికెడు మట్టిరా అది కంపరం పుట్టించే మందుపాతర"** నా తెలంగాణ అని సవాల్ విసిరినవారు.

పొద్దుకెదురు తిరగడమే పొద్దు తిరుగుడు పువ్వు అందుకే ఆ పువ్వంటే నాకిష్టం అని అంటారు పగవాడే పాఠాలు చెపుతారు పాట కూడా నేర్పుతారు అంటారు

535 మంది కవులు, అజ్ఞాత కవులు పది సంవత్సరాల సుదీర్ఘ శ్రమ 75 సంవత్సరాల పాటల చరిత్ర 1400 పేజీలు 30 లక్షల ఖర్చు తెలంగాణకు అక్షర సంపదది. మనిషిని మరో లోకంలోకి తీసుకువెళ్లే శాటిలైట్ చరిత్రను వర్తమానానికి పరిచయం చేసే ఒక సాంస్కృతిక వారధి. ఈ పుస్తకం చేతిలో ఉంటే చాలు ఎందరో తెలంగాణ కవులు మనతో ఉన్నట్టే. పుస్తకం అంటే ఒక వస్తువు దాన్ని నిర్మించడంలో పనివాడితనం కావాలి. పనివాడితనము అందెశ్రీ లో ఉందో లేదో అర్థమవుతుంది. పుస్తకాన్ని పట్టుకోడానికి చేతులు చాలవు, చదవడానికి చూపులు చాలవు, పరువళ్లు తొక్కే పాటల ప్రవాహాన్ని కావులించుకోవడానికి గుండెలు సరిపోవు. రాజ్యాల వంక చూడని రాజ్యాలనే కుదిపేసిన పుస్తకం "నిప్పులవాగు"

ధిక్కరించే వారెవరికైనా కత్తిలాంటి జ్ఞాపకం "నిప్పులవాగు" తెలంగాణ వారసత్వ సంపదను అందించారు.

వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామం అందెశ్రీది మాతృదేవోభవ పితృదేవోభవ నా పాలిట శాపగ్రస్త శబ్దాలు అంటాడు. ఆదుకున్న చేతులు అన్నం పెట్టిన తల్లులకు నిరంతరం ఋణపడి ఉంటాను అంటాడు. ఆయనకు కులం లేదు మతం లేదు ఆయన నలుగురు పిల్లలకు కులం సర్టిఫికెట్లు ఉండవు. ఆ స్థానంలో ఇండియన్ అని మాత్రమే సగర్వంగా రాసి ఉంటుంది. చిన్ననాటి నుండి వెంట వచ్చిన కష్టాలను మర్చిపోవడానికి రామాయణం యక్షగానాలు కోలాటాల్లో మునిగిపోయేవాడు తెల్లవారులు మోట కొట్టడం, అక్కడ పని పాటలు అల్లుకోవడం అశువుగా పాడటం అబ్బింది. ఏక సంథాగ్రహి కావడం వల్ల ఆయనకు అలవోకగా బాణీలు, చరణాలు తోబుట్టువులయ్యాయి. తనను స్వాంతనపరిచాయి. పాట ప్రవాహమయ్యింది. గొంగళి పురుగుకు రెక్కలు వస్తేనే కదా ఎగర గలిగేది అందుకే ఆ సీతాకోకచిలకల పాటలు రెండు రెక్కలై మొలిచాయి. తన గుండె గాయం సలుపులు తీస్తున్న కొద్దీ కంట గేయం చిక్కగయ్యింది. కూలి పని మేస్త్రీ పని ఇలా కనపడ్డ ప్రతి పని చేసిండు. బువ్వలేని బతుకు దుఃఖపూరితమైన జీవితం 60 ఏళ్ల అందెశ్రీ జీవితం వడ్డించిన విస్తరి కాదు. వలపోతల కాగితం ఊరే కదా జీవితమంటే కత్తి అంచుల మీద ఆయన రచన కవాతు చేసింది.

తిరగబడనోడు గొప్ప కవి కాదు కదా కనీసం కవి కూడా కాలేదు లొంగిపోయేది వంగిపోయేది జీవితం కాదు అంటాడు పాట పాడితే కంఠాలు తెగిపడాలి నా పాటల పల్లవి అంటుకునే అగ్ని కావాలి అంతిమ చరణం శ్రోతల్లో బడబాగ్ని పుట్టించాలి అని కోరుకుంటాడు అందెశ్రీ.

జై బోలో తెలంగాణ జన గర్జనల జడివాన అని అందెశ్రీ పాడితే ఉస్మానియా విశ్వవిద్యాలయమే తొట్టెలో వేసిన శిశువులా ఊగిపోయింది. శివసత్తులా లేచి శిగం ఊగింది. ఆయన పాటలు ఉద్యమ అంబారి మీద ఊరేగిన గీతాలు. ఆయనది కవిగానం కాదు. కాలజ్ఞానం ఆయన పాటల యజ్ఞంతో ఓరుగల్లు నువ్వు వీరగల్లుగా మార్చిన వాడు. కాంక్రీట్ జంగల్ లో మాయమైపోతున్న మానవుడిని వెతుకుతున్న సంచారి. ఆయన విజ్జోల పాటలు కాదు. జోకులు పాటలు కాదు. రాజ్యం జో కొట్టి నిద్రలేపి నిటారుగా నిలబెట్టి ఆత్మగౌరవ యుద్ధానికి సిద్ధంచేసే పోరుపాటలు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన పాటలు గుప్పున మండే నిప్పు కణికలు. మా పాటల భిక్షే కదా మీరేలే పదవులు మా పాటలే కదా ముందుండి ప్రజలను నడిపినవి ఆ పాటలే పెట్టని కోటలై నిలిచినవి. పాటలే కదా రాష్ట్ర పట్టాభిషేకాలు. అలాంటి పాటల అవమానించిన పదవులకు అహంకారమా! ఏందిరో తెలంగాణము ఎల మూగ బోయింది జనగానం అని లేస్తాడు అందెశ్రీ. లోతైన మనిషి దుఃఖాన్ని నొప్పిని భరించిన వ్యక్తి అంచనాకు అందదు.

ఆయన అంతరంగాన్ని చదవటం కష్టం ఆయనకు ఓ తిక్క దానికి లెక్క కూడా ఉండదు. కొంతమంది సీతయ్య అని కూడా అనుకుంటుంటారు, సత్యం విషయంలో సత్యహరిశ్చంద్రుడే కానక్కర్లేదు. అందెశ్రీ లాంటి సామాన్యుడి కైనా అది సాధ్యమే బలమైన సత్యసంసంద్రుడు త్రికరణశుద్ధిగా సత్యవ్రతాన్ని ఆచరిస్తాడు.

మద్యం ముట్టడు మాంసం తినడు.. ఎప్పుడో చిన్నప్పుడు తన గురువుకు చేసిన వాగ్దానం నాటినుండి నేటి వరకు ఆచరణలో అగ్ని లాగే కట్టుబడి నిక్కచ్చిగా ఉన్నోడు. సత్యం అంటే మాట కాదు ఆలోచన అంటాడు. పైస లేకపోయినా ప్రజల సాయంతో ప్రపంచ నది యాత్ర చేసిన సాహసికుడు. మన మాటల్లో సత్యం ఉన్నప్పుడు మన స్థలంలో స్పష్టత వస్తుంది. దానికి గాంభీర్యం తోడవుతుంది. అందుకే ఆయన అక్షరాలు అంత పొగరుగా ఉంటాయి. సంపాదన సంసారం మీద ఆసక్తి ఉన్నవాడు కాదు కనుకనే సత్కాలంకృతులు సృష్టిస్తున్న సృజనకారుడయ్యాడు. కమ్యూనిజాన్ని చదివి చిన్నప్పుడే తన ఉపనయనాన్ని తెంపుకొని హేతువుతో హితువుగా మిగిలినోడు. పగోడే పాఠాలు చెపుతాడు అంటూ కూడా నేర్పుతాడు. ఇక నిక్కచ్చితనం ఎంత అంటే ఎదుటివాడు భయపడే అంత నిబద్ధత కలిగిన కవి.

ఫ్రెంచ్ స్పానిష్ సరిహద్దుల్లో ఉన్న వాల్తేరు బెంజిమన్ సమాధిపై రాయబద్ధ మాటల్ని చూశాడు. సమాధిని చూశాడు. జేమ్స్ జాయిస్ కవిని చదివి "నా మరణం కూడా మాట్లాడుతుంది" అన్నారు.

ప్రజా తత్వవేత్త నమ్మల్వార్ సమాధిని చూశాడు నమ్మల్వార్ గురించి ఒక విలేకరి చనిపోయేటప్పుడు అడిగాడట మీ సమాధిపై ఏం రాయమంటారని దానికాయన "ఎందరికో నిద్ర లేకుండా చేసిన వాడు ఇక్కడ ప్రశాంతంగా నిద్రపోతున్నాడని" రాయమన్నారట ఆ మాటలు నాకాదర్శం. అందుకే నా మరణాంతరం కూడా అవే మాటలు రాయమని అన్నారు.

**మేధావి మేధస్సు కానీయండి కళాకారుడి కళ కానివ్వండి**

**తత్వవేత్త అన్వేషణ కానివ్వండి అంతిమంగా జవాబుదారి కావాల్సింది ప్రజానీకానికే.. కానీ ప్రభుత్వాలకు కాదని** నిరంతరం చెప్పేవాడు

రష్యన్ కవి మయా కోవిస్కీ 'మార్క్స్' చనిపోయినప్పుడు కాలం కడుపుతో ఉండి కారల్‌మార్క్సును కన్నది అన్నట్లుగా .. కాలానికి ఒక కవి కావాలి .. ఒక కవిత కావాలి ... అందుకనే కాలం కడుపుతో ఉండి అందెశ్రీని కన్నది.

అందెశ్రీ చనిపోయాడని అనకండి.
ఒక మహాకవి అమరత్వం అతనిది.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 2  హైదరాబాద్ డిసెంబర్ : 2025

# యాస భాషలందు 'అందె' వేసిన చేయి

**డా. తిరునగరి శరత్‌చంద్ర,** తెలుగు అధ్యాపకులు, నిజాం కళాశాల. ఫోన్ : 630 987 3682

ప్రజాకవిగా, భావకవిగా తెలంగాణ లోకానికి అందెశ్రీ సుపరిచితులు. అక్షరాలు నేర్చుకోని ఆయన అనంతమైన భావాలు జాలువారే పాటల సాగరమై కదిలారు. మనిషి మనిషిలో నిదురిస్తున్న మానవత్వాన్ని తన అక్షరాలతో తట్టిలేపిన కవి, పల్లెపాటైనా, ఉద్యమ గీతమైనా, ఆశు కవితైనా ఏదైనా సరే తెలంగాణ మట్టి పరిమళాలతో అద్ది మన హృదయాలకందిస్తారు అందెశ్రీ.

ప్రజా వాగ్గేయకారునిగా, పల్లెపదాల రారాజుగా పేరుగాంచిన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. వరంగల్ జిల్లా మద్దూర్ మండలంలోని రేబర్తి గ్రామంలో 1961 జూలై 18 న జన్మించారు. తాపీ పనివాడిగా మొదలైన ఆయన జీవితం ఎన్నెన్నో కష్టాలకు ఓర్చుకుని ప్రజాకవిగా అంచెలంచెలకు ఎదిగింది. ఆయన చదువుకోలేదు. అక్షరం నేర్వలేదు. కానీ లక్షల అక్షరాల పుట్ట ఆయన కలం. కవిగా ఆయనను నడిపించింది మాత్రం నిజామాబాద్ యే అంటారు అందెశ్రీ. నిజామాబాద్ సమీపంలోని శృంగేరి పీఠానికి చెందిన శంకర్ మహారాజ్ అనే స్వామి దగ్గర మంత్రోపదేశం పొందారు. ఉపనిషత్తులు, భారత, భాగవతాలు చదివారు. ప్రకృతినే కవితావస్తువుగా చేసుకుని ఎన్నెన్నో పాటలు రాశారు. ప్రజల బాణీలోనే పాటల్ని అందించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్ని, మన మూలాల్ని చాటి చెప్పుతూ ఎన్నెన్నో సినిమా పాటలు రాశారు. తెలంగాణ పదాల సౌరభాన్ని తన కలానికెక్కించుకున్న అందెశ్రీ మన యాసను, మట్టి శ్వాసను పాటల్లో పొదిగారు.

1997లో 'సింగన్న' సినిమాతో పాటలరచయితగా అడుగుపెట్టారు. ఆ సినిమాలో 'జంబైరే జోరు జంబర్..గజిబిజి గారడి' అనే పాటను రాశారు. లోకం పోకడను, అసమానతలతో అతలాకుతలమౌతున్న ప్రపంచాన్ని గూర్చి ఈ పాటలో తెలిపారు. సమాజంలో జరుగుతున్న దోపిడీని, అవినీతిని, దురాక్రమణలను తన పాటలో కళ్ళకు కట్టినట్లు చూపించారు.

'ఊరు మనదిరా' (2002) లో రాసిన 'చూడ చక్కనీ తల్లి చుక్కల్లో జాబిల్లి' అనే పాటలో పల్లెని నాగమల్లిగా, పాలవెల్లిగా కొనియాడారు. తనను ఆదరించి అన్నం పెట్టిన తల్లిలాంటి సూరమ్మను ఈ పాటలో గుర్తు చేసుకుంటారు.

'తొలి కోడి కూయంగ..తెలతెల్లవారంగ..పాలు కడవళ్ళనిండా పల్లె బంగారుకొండ' అంటూ పల్లెలోని స్వచ్ఛమైన వాతావరణాన్ని, పల్లె సౌభాగ్యాన్ని అభివర్ణించారు. పల్లెని మహాకావ్యమంతగా భావించారు.




'వేగుచుక్కలు' (2004) లో 'కొమ్మ చెక్కితె బొమ్మరా – కొలిచి మొక్కితె అమ్మరా' అనే పాటలో గ్రామాన్ని కాపాడే గ్రామదేవతలను కీర్తిస్తారు. ఒక తల్లి తన పిల్లల్ని కాపాడినట్టుగా ఒక గ్రామదేవత ఊరి ప్రజల్ని తన బిడ్డలుగా భావించి కాపాడుతుందన్న సత్యాన్ని ఈ పాటలో ఆవిష్కరించారు. మన నమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి పాటలు రాశారు. పెడదారి పట్టిపోతున్న వారిని నిగ్గదీసి ప్రశ్నించిన వైనం అందెశ్రీ పాటల్లో అణువణువున కనిపిస్తుంది.

'ఎర్రసముద్రం'(2008) లో రాసిన 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' అంటూ మనిషిలో మానవత్వం మచ్చుకైనా లేదని, ఆధునికత పేరుతో మనిషి మానవీయ విలువల్ని కోల్పోతున్నాడని తెలియజేశారు. మనిషిలో పశుత్వం,అహంకారం ఆవహించుకు పోతుందని, అవినీతి మార్గంలో నడుస్తూ అన్యాయమై పోతున్నాడని ఈ పాటలో చెబుతున్నారు అందెశ్రీ. ఈ పాట ఆయన ఎప్పుడో రాసిన ప్రైవేటుగీతం ఎర్రసముద్రం సినిమాలో ఉపయోగించు కున్నారు. అప్పట్లో ఇది ఇంటర్ విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చడం విశేషం.

'బతుకమ్మ'(2008) లో రాసిన 'సినుకమ్మా వాన సినుకమ్మా నేల చిన్నబోయే చూడు' పాట రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తూ పడే బాధల్ని వివరిస్తుంది. వర్షాలు లేక నేల చిన్నబోయిన వైనాన్ని చెబుతారు. బీటలు వారిన నేలలో నీటిచుక్కలు పొంగిపొరలాలనే తపన ఈ పాటలో కనబడుతుంది. రైతుల కష్టనష్టాలు, వారి జీవనపరిస్థితులు కూడా ఈ పాటలో కనబడతాయి. అదే సినిమాలోని 'రండి కదలిరండి పోరుదండు పిలుస్తుంది మండుతున్న గుండెల దండోర మోగుతుంది' పాట భూస్వాముల దోపిడీని ఎదుర్కొంటూ సాగుతుంది. పేదలు ఏడ్చి, ఏడ్చి, ఇక సహనం నశించి, వారి కన్నీళ్ళు మరిగి సెగలైనప్పుడు పర్యవసానం ఎలా ఉంటుందో ఈ పాట వివరిస్తుంది. దోపిడిదారులను ఎదురుతిరిగి ప్రశ్నించే వైఖరి,

అన్యాయానికి ఎదురుతిరిగిన రైతుల సాహసం ఈ పాటలో కనిపిస్తుంది.

'గంగమ్మ జాతర' (2004) లో 'ఏడేడు దారుల్లో ఏడు తీర్ల దారుల్లో' పాట ఎంతో కరుణరసాత్మకంగా మనల్ని కట్టిపడేస్తుంది. 'అరిటాకుపై ముల్లు ముల్లుపై అరిటాకు ఏది ఎట్లైతేనేమి గాయాలు ఆకుకే' వంటి వాక్యాలు మోసపోయిన అబల జీవితాన్ని గుర్చి వివరిస్తారు. బాధను పంచుకునే హృదయం కోసం పడే ఆవేదన కూడా ఈ పాటలో స్పష్టంగా కనబడుతుంది.

'అధిపతి' (2001) లోని 'ఆడబతుకే పాడుబతుకని ఏడుస్త వెందుకే చెల్లెమ్మా' అనే పాట స్త్రీజాతికి ఆత్మవిశ్వాసాన్ని, గుండె ధైర్యాన్ని నూరిపోస్తుంది. ఈ పాటలోని 'ఎల్లకాలం చీకటుండదు అమాసెనుకే ఎన్నెలా' అనే పంక్తిలో కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోవద్దని, మనోధైర్యంతో నిలబడాలని ఈ పాట ద్వారా సందేశమిచ్చారు అందెశ్రీ.

'జై బోలో తెలంగాణ' (2011) లోని 'జనజాతరలో మన గీతం జయకేతనమై ఎగురాలి' అనే పాట తెలంగాణ మలిదశ ఉద్యమానికి రణనినాదమై నినదించింది. విజయతీరాల వైపు తెలంగాణను నడిపించింది. ఈ పాటలో అందెశ్రీ ఆవేశం, రాజసం కనిపిస్తాయి.

'పోరు తెలంగాణ'(2011) లోని 'చూడు తెలంగాణ చుక్కనీళ్ళు లేని దానా' అనే పాటలో తెలంగాణ దీనావస్థల్ని, కరువు పరిస్థితులను తెలియజేశారు. నీరులేని తెలంగాణ ప్రజల బతుకుల్లో కన్నీరే మిగిలిందని ఆవేదనను వ్యక్తం చేస్తారు.

ఇంకా– 'స్వర్ణక్క' (1998) లోని 'సంభవామి యుగే యుగే', 'తెలంగాణ' (1999) లోని 'ఘల్లు ఘల్లు' మొ. పాటలు కూడా అందెశ్రీ రాసినవే.

'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం
తరతరాల చరితగల తల్లీ నీరాజనం
పదిజిల్లల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభతరుణం'

అని తెలంగాణ ఖ్యాతిని తెలిపే పాట తెలంగాణ రాష్ట్ర గీతమై, మనకు నిత్య ప్రార్థనాగీతమై ప్రతిరోజు మన నోట మోగుతుందంటే ఆయన ప్రతిభాపాటవాలకు ఇంక వేరే నిదర్శనాలెందుకు? ఎదఎదలో మోగే తెలంగాణ ఆత్మగౌరవగీతమిది.. పదికాలాలు పదిలంగా గుండె మీద చేయి వేసుకుని ఇది నా తెలంగాణ ఔన్నత్యం అని సగర్వంగా చాటుకునేలా ఈ పాటను రాశారు.

కాకతీయ వైభవాన్ని చాటే 'గలగలగజ్జెలండి', 'పల్లె నీకు వందనాలమ్మో' మొ. ప్రైవేటుగీతాలు,జానపదగీతాలు కూడా ఆయన రాశారు.

2006 లో 'గంగ' సినిమా కోసం ఆయన రాసిన 'యెల్లిపోతున్నావా తల్లి' అనే పాటకు నంది పురస్కారం లభించింది.

కాకతీయ విశ్వవిద్యాలయం వారి గౌరవడాక్టరేట్, అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ వారి గౌరవడాక్టరేట్ మరియు 'లోకకవి' బిరుదు, వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వారి దాశరథి అవార్డు, రావూరి కాంతమ్మ ట్రస్ట్ వారి డా.రావూరి భరద్వాజ అవార్డు మొ. గౌరవ సత్కారాలు అందుకున్నారు. ఆశుకవితకు, అచ్చమైన తెలంగాణ పాటకు పర్యాయపదం అందెశ్రీ. ఆయన భౌతికంగా మనకు దూరమైనా పాటగా పదికాలాలు, తరతరాలు తెలంగాణ మట్టిలో, గాలిలో పరిమళిస్తూనే ఉంటారు.

❖ ❖ ❖ ❖ ❖

**శిలాక్షరం**


**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి

సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య

వెల : 300/-




సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్: 934 7971177

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్: 934 7971177

# తొలిపొద్దు గీతమై... లోక సంగీతమై..

**మల్లేపల్లి లక్ష్మయ్య,** ప్రఖ్యాత పాత్రికేయులు ఫోన్ : 970 55 66 213




**'వరముగల్లు జిజ్ఞాస నా ఇల్లు**
**మా ఊరు రేబర్తి మంచి స్ఫూర్తి**
**అందె ఇంటి పేరు అలరించు రాగాల**
**అత్మ మేలుకొలుపు అవనిలోన**
**నిష్ఠ కలిగియున్న కష్టాల నెదురీదు**
**మనిషికందని విద్య మహిని కలది**
**పల్క బలపం బట్టి పాఠశాలకు పోలె**
**అచ్చు హల్లులు కాస్త అభ్యసించ**
**కలము బట్టాను కరమున కళ్ల**
**పారజూశాను లోకాన్ని పట్టుబట్టి**
**ప్రజల భావాలె కవితగ పల్లవించు**
**తప్పులున్నచో దిద్దుడీ తండ్రులారా!"**

ఇది ప్రజాగాయకుడు అందెశ్రీ స్వగతం అతని మాటల్లోనే, తన గేయాల సంపుటి అందెల సవ్వడి పుస్తకం ఆఖరి అట్టమీద రాసుకున్న తన ఆనవాలు. అందెశ్రీ తెలంగాణ గడ్డ మీద తన పాటల తోటను పేర్చి దాని అందచందాలను, సువాసనల గాలులను మనకు వదిలేసి తన దారి తాను చూసుకున్నాడు.

ఆయన జీవితం గురించి ఆయనే చాలా సాధారణంగా మనకు చెప్పారు. అది అందరికి తెలిసిందే జీవితం సాధారణమైనదే. కాని ప్రయాణమే అంటె సాహితీ జీవితం చాలా చాలా మలుపులు తిరిగింది. ఒక దగ్గర ఆగిపోయే వ్యక్తిత్వం కాదు. ఎప్పుడు ఏదో చేయాలనే, మరేదో రాయాలనే తపనే ఆయనను అక్షరం రాని స్థితి నుంచి విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చే దాకా తీసుకెళ్లింది. ఆయన పేరు మీద అచ్చయిన రెండు గేయాల సంకలనాలు ఆయన సాహితీ సారాన్ని మనకు అందిస్తాయి. దానితోపాటు ఆయన సంకలనం చేసిన తెలంగాణ ఉద్యమ పాటలు **"నిప్పులవాగు"** కూడా అందరిలో తనను కూడా ఆవిష్కరించుకున్నాడు. అట్లా ఆయన మొదలు పెట్టిన ప్రయాణం నుంచి నేటివరకు ఆయన ఆలోచనల ధారను మనకు సాక్షాత్కరింప జేస్తుంది.

**'పాటల పూదోట'** అనే మొదటి పుస్తకంలో మనకు ప్రకృతి కవి, ప్రేమ కవి, దేశభక్తి కవి, ఆధ్యాత్మిక కవి ఎక్కువగా కనిపిస్తాడు. ఆ పాటల పుస్తకానికి పరిచయ వాక్యాలు రాసిన వాళ్లలో సి. నారాయణ రెడ్డి, పేర్వారం జగన్నాథం, రావూరి భరద్వాజ, ఆచార్య తిరుమల, నాగిశెట్టి లాంటి వాళ్లున్నారు. అందులో రావూరి భరద్వాజ రాసిన నాలుగు వాక్యాలైనా ఆనాటివరకు అందెశ్రీ గురించి మనకు అందించిన విషయాలు చాలా సంక్షిప్తంగా ఎంతో ప్రేమగా ఉన్నాయి. **"అందెశ్రీ గారి పాటల పూదోట" ను చూసి నేను సుక్షేత్రంలో విరిసిన సుమవనం అని అనుకున్నాను. నేనెందుకలా అనుకున్నానో, ఈ పుస్తకం చదివాక మీకే తెలుస్తుంది"** అని భరద్వాజ కవితాత్మకంగా రాసిన వాక్యాలు ఆనాడు అందెశ్రీకి ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చి ఉంటాయి. మిగతా పెద్దలు కూడా చాలా ప్రోత్సాహపూరితంగా రాసి, ఎంతో నైతిక మద్దతును పలికారు. ఈ పుస్తకం నిండా మనకు ప్రకృతితో అందెశ్రీ ఆడుకున్నట్టు కనిపిస్తుంది. ఇది 1993 కు ముందు ప్రచురించింది. సమస్య ఏమిటంటే ఇందులో ప్రచురణ సంవత్సరం, వివరాలు లేవు. రెండోది, **"అందెలసవ్వడి".** ఈ పుస్తకం లోని పాటలు, గేయాలు రాసే వాటికి అభ్యుదయ, ప్రజాకవుల ఆలోచనల లోకి రాగలిగాడు. అందుకే ఆ పుస్తకం ప్రజాకవి అలిశెట్టి ప్రభాకరుకు అంకితం ఇచ్చాడు.

**"అబద్ధాల గొంతునొక్కే వాస్తవ చిత్రాలు చెక్కే ఇజమె ఇప్పుడు వీడకుండా, నిజమన్నది వాడకుండా ప్రజాకవిగా ప్రభవించిన అజరామరుడు"** అంటూ ప్రభాకర్ను సొంతం చేసుకున్నాడు. ఇది 1995– 96 ప్రాంతంలో అచ్చయి ఉంటుంది. ఈ పుస్తకానికి ప్రముఖ పాత్రికేయులు జి. కృష్ణ రాసిన పరిచయం అందెశ్రీకి ఒక నిలువెత్తు ధ్రువపత్రం.. ఇది **"చదువు రానివాడు"** 'వ్రాసే కవిత' కు **"కవిత్వం రానివాడు"** "వ్రాస్తున్న పరిచయం" అంటూ మొదలు పెట్టాడు. ఇందులో చదువురానివాడు, కవిత్వంరానివాడు అన్న పదాలు ఇన్వర్టెడ్ కామాలలో ఉంచడం గమనించాలి. అసలు చదువురాని వాడు రాసే కవిత్వంలో నిజము, అమాయకత్వము సొంపుగా పైన వేసుకుని వైచుకొని సాక్షాత్కరిస్తూ ఉంటాయి.. అంటూ పరిచయ వాక్యాలు

కొనసాగాయి. ఆ తర్వాత వాసిలి వసంతకుమార్ కూడా ఈ పుస్తకానికి ముందు మాట రాశారు. ఈ పుస్తకం వచ్చేసరికి తనలో ఉన్న సామాజిక చైతన్యం బయటకు వచ్చింది. "పూర్వీకులు తవ్విన పునాదులను, పునర్జన్మలను పేరుతో నింపి భయభ్రాంతుల గోడల పెట్టే పురాణ ఇతిహాసాల మేడలు కట్టే స్వర్గం నరకాలు అను పేర్లు పెట్టి మానవతను మంటకల్పి మనుధర్మ శాస్త్రాలు మనకందని వేదాలు" అంటూ తనలో అంతర్లీనంగా దాగిన ధిక్కారాన్ని బయటకు లాగాడు. అయినా ప్రకృతిని, పల్లెను తన వెంటనే మోసుకొస్తున్నాడు. ఆ తర్వాత 2000 సంవత్సరాల తర్వాత తన గొంతును సవరించు కొని స్వరాన్ని పెంచాడు. అందులో, **"పల్లె నీకు వందనాలమ్మో, మముగన్నా తల్లీ నీకు వందనాలమ్మో"** అంటూ పల్లెను ప్రపంచం ముందుపెట్టాడు. అంటూ గత నాటి పల్లెను పలవరించే విధంగా చేశాడు. తెలంగాణ మలిదశ ఉద్యమం ప్రారంభమైన తర్వాత తన నిజరూపం, విశ్వరూపం ప్రదర్శించాడు. సూడసక్కని తల్లి – సుక్కల్లో జాబిల్లి అంటూ తెలంగాణ పల్లెను, ఆ పల్లెల్లో ఉండే గొప్పతనాన్ని తన పాటలో ప్రదర్శించాడు. అందువల్లనే ఆ పాట నృత్య రూపకమై పోయింది. అదే తెలంగాణ ధూంధాం ఆరంభ గీతమైంది. ఆ తర్వాత **"నూడు తెలంగాణ– చుక్క నీళ్లలేని దాన"** అంటూ జల దోపిడీ ఆర్థిక సిద్ధాంతానికి పాట పరిచయ గొంతునిచ్చింది. తెలంగాణ జాతీయ గీతమైన జయ జయ హే తెలంగాణపాట ఉద్యమ ఊపిరిగా మారిపోయింది. జై బోలో తెలంగాణ సినిమాకు రాసిన జై బోలో తెలంగాణ గళ గర్జనల జడివాన అన్న పాట తెలంగాణను ఉ ద్రూతలూగించింది.

చాలా మంది ఉద్యమకారులకు మానవతా వాదులకు సెల్ఫోన్లో రింగ్ టోన్గా మారిన "మాయమైపోతున్నాడమ్మా" అన్న పాటతో మాయమై పోతున్న సమాజాన్ని మన ముందుంచాడు. అదే మానవత్వం మనుగడ మీద, మనిషి ఉనికి మీదనే కొరడా ఝుళిపించి నట్టయింది.

అంతేకాకుండా, తన సామాజిక నేపథ్యాన్ని, గ్రామ దేవ తల వైభవాన్ని ముఖ్యంగా అమ్మతల్లులైన దేవతల మీద రాసిన పాట తన కవితా సృజనకు ఒక మచ్చుతునక. **"కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిసి మొక్కితే అమ్మరా, అదికే ఇది పాదురా కాదంటే ఏది లేదురా!"** అంటూ మనిషికి దేవుని, దేవతలపట్ల ఉన్న తాత్వికతను కళ్లముం దుంచాడు. వీటన్నింటితోపాటు, **"తల మీద సుట్టబట్ట ఆపైన పండ్ల తట్ట, పండ్లు పండ్లుయో అని పల్లెంత తిరిగి అమ్మే తెనుగోల్ల ఎల్లమ్మ ఏది మా పల్లెల్లోన కండ్లల్లో కానరాదేమి!"** అన్న పాట పల్లె జీవితాన్ని మనకు మరిచిపోకుండా చేయగలదు.

ఎంతో సాహితీ శక్తిని ప్రదర్శించిన అందెశ్రీ ఎవ్వరూ చేయని మరొక గొప్ప కార్యం చేశారు. ఇది చాలామందికి తెలియదు. ఆయన మెదడులో ఒక ఆలోచన పుట్టింది. అదే ప్రపంచంలోని నదులన్నింటిని సందర్శించాలనేది. అది ఆలోచన. దానికి ఆచరణ జోడించాడు. అమలు చేశాడు. అనుభూతిని పొందాడు. దాదాపు ప్రపంచంలోని ముఖ్య మైన నదులన్నింటిని చూసినవాడు అందెశ్రీ ఒక్కడే అయి ఉంటాడేమో. ప్రపంచంలో ఈ ఘనతను ఎవ్వరూ చేయలేదేమో అనిపిస్తుంది. ఎవరైనా ఇంతకన్నా ఎక్కువ నదులను సందర్శించి ఉంటే మన అభిప్రాయాన్ని సరిచేసుకోవచ్చు. అభ్యంతరం లేదు. 2010 సంవత్సరంలో తన **'నదీ యాత్ర'** ను ప్రారంభించి ఉత్తర అమెరికా, ఆఫ్రికా ఖండాల్లోని మిసిసిపి, అమెజాన్, నైలు, సరానా, కాంగో, జాంబేజ నదులను చూశారు. వాటి మీద యాత్ర చేశాడు. ఎన్నో వందల రోజులు ఆ నదులతో మాట్లాడాడు. ఆ తర్వాత రష్యా లోని రష్యా, ఇర్టిష్, ఓట్, యెన్సి నదులను కూడా తన కళ్లతో చూసి, మనసుతో మాట్లాడాడు. అదే విధంగా ఫ్రాన్స్ లోని సేన్, జర్మనీలోని రైన్ నదులను పలకరించి యాత్రను ముగించాడు. చైనాలోని యాంగ్జి, ఎల్లో నదుల జలాన్ని చేతుల్లోకి తీసుకొని కళ్ల కద్దుకున్నాడు. ఆస్ట్రేలియాకు వెళ్లి యారా, ముర్రె, హాకేష్బరి నదులలో ఆటలాడి, పాటలు పాడాడు. ఇది మరెవ్వరూ చేయలేని పని. అయితే ఇది అక్షర రూపం దాల్చలేదు. ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ నదీ యాత్ర మొత్తం ఒక పుస్తకంగా వస్తుందని చెప్పాడు. కాని అది పూర్తి కాలేదు. ఆయనతో ఈ నదీయాత్రలో పాల్గొని తుదకంటూ ఆయనతో నడిచిన సంగిశెట్టి సత్యం మీద ఈ బాధ్యత ఉందేమో. అయితే ఈ నదీ యాత్ర గురించి ఒక సందర్భంలో **"అవి నదులు కాదు. నడిచొచ్చే సముద్రాలు. ఆ నదులపై కావ్యం రాయాలనే కోరిక త్వరలోనే నెరవేరుతుందని ఆశిస్తున్నా"** అంటూ మనకు హామీ ఇచ్చాడు. అయితే కావ్యం రాసినట్టు తెలుస్తున్నది. అయితే అది అచ్చు కావాలి. నదీ యాత్ర మీద రాసిన నాలుగు వాక్యాలు మనకు లభ్యమవు తున్నాయి.

**"కొండలను కోనలను కొనగోట కొలిసింది.**
**నేలపై నెలవంక తారయై వెలిసింది**
**అడవులను ముద్దాడి ఆకు పసరయ్యింది.**
**నేలలో పాయలుగా ఉయ్యాల లూగింది.**
**తొలిపొద్దు గీతమై లోక సంగీతమై.**
**నడినడిచిపోతున్నది నన్ను నావనై రమ్మన్నది!"**

అంటూ **"నా జీవన గమనం నా ప్రపంచ నదీ యాత్రా"** అంటూ ఎంతో అనుభూతిని వ్యక్తపరిచాడు.

కవిత్వంలో, జీవితంలో ఎన్నో అనుభవాలను అనుభూతులను మనకు అందించి, మన నుంచి మరుగై, మాయమైపోయిన మానవతా మూర్తి అందెశ్రీ.

❖ ❖ ❖ ❖ ❖

# స్థల దు:ఖం జన దు:ఖం ఈ కవి చిరునామా

**మెర్సీ మార్గరెట్,** కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత. ఫోన్ : 905 280 9952

తెలంగాణ కవిత్వానికి మట్టి పరిమళం ఇచ్చిన పేరు.. అందెశ్రీ. ఆయన కవిత్వం పుస్తకాల పుటల్లో కాదు, పల్లెపంట పొలాల్లో పుట్టింది. గ్రామీణ జీవితంలోని సవ్వడులు, రైతు చెమటలోని సత్యం, సాధారణ మనిషి ఆవేదన.. ఇవన్నీ ఆయన పద్యంలో ప్రాణం పోసుకున్నాయి. అందెశ్రీ కవిత్వం సామాన్యుడి జీవితాన్ని అక్షరాలుగా మార్చిన సాక్ష్యం. ఈ ప్రజాకవి, తన మాటలతో ఒక తరం ఆలోచనలను మలిచాడు. మట్టి, మనిషి, మానవత్వం ఆయన సాహిత్య త్రివేణి. ఆ త్రివేణి ప్రవాహమే ఆయనను కవి మాత్రమే కాక, ప్రజల గుండె చప్పుడుగా నిలిపింది.

అందెశ్రీ కవిత్వం మానవ విలువల పునాదిపై నిలిచిన ఒక సాంస్కృతిక చరిత్ర, అది ఒక పల్లె మనిషి గళం... నిశ్శబ్దాన్ని కూడా మాటగా మార్చిన గొంతు. ఆయన పదాన్ని స్పృశిస్తే చాలు మట్టి పరిమళం అంటుకుంటుంది. స్వరాన్ని అలకిస్తే శతాబ్దాల సామాన్యుడి చరిత్ర కళ్ళ ముందు కదలాడుతుంది. ఆ గొంతుక ఇప్పుడు విశ్వబ్ద మైందంటే.. మన అంతరంగంలోని అర్ద్రత కూడా ఒక్క క్షణం మూగబోయింది..

### ప్రకృతి ఒడిలో అక్షరాభ్యాసం

అందెశ్రీ కవిత్వానికి అచ్చు పుస్తకాల కన్నా పల్లె జీవితమే పెద్ద బడి. మట్టి పొరల్లోంచి మొలకెత్తిన పదాలకు ఆయన దేహమే ఒక తాళపత్రం రాగానికి తాళం సహజంగా జతకూడినట్లు, ఆయన భాషలో ఒక అద్భుతమైన గ్రామీణ మాండలిక సౌరభం ఉంటుంది. అమ్మ పాడే జోలపాట మొదలు, కర్షకుడి స్వేదగీతం వరకు అన్నీ ఆయన కవితల్లో ప్రాణం పోసుకున్నాయి. పదం అంటే పల్లె తల్లి ఊపిరి, స్వరం అంటే రైతన్న చిందించిన రక్తాశ్రువు. నా కవిత్వం... 'సామాన్యుడి గుండె సప్పుడు' అన్నాడు అందెశ్రీ. ఆయన ప్రకృతి కన్న బిడ్డ.

### బతుకు వ్యథే ఉద్యమ నాదం

ఆయన వరంగల్ జిల్లాలోని ఒక సాధారణ గొర్రెల కావరి కుటుంబంలో జన్మించారు. ఎలాంటి చదువు లేకపోయినా సమాజం అనే పెద్ద బరిలో జీవితాన్ని చదివిన మహనీయుడు. **"నేను ప్రజల పక్షం. వారి ప్రజా మార్గం"** అని ఎలుగెత్తి చాటిన వ్యక్తి. ఆయన తన కవిత్వాన్ని అట్టడుగు వర్గాల అస్త్రంగా మలిచారు ఆయన గీతాల్లోని ఆవేదన కేవలం అభినయం కాదు. అది ఒక ఆచరణాత్మక దిశ, సమాజం కట్టుకున్న అసమానతల గోడలపై ఆయన పాట ఒక యుద్ధభేరి. అది రక్తం చిందించని ఒక మహాయుధం, కాలాన్ని




సైతం కదిలించగల పదునైన అస్త్రం. పలికితే మందారం, కురిస్తే అశ్రుధార.

ఆయన వాక్య నిర్మాణంలో నూలు పోగు లాంటి మెత్తదనమూ, చేతి కర్రలాంటి కరుకుదనమూ రెండూ ఉంటాయి. పల్లె పదాల సహజత్వంతోనే విశ్వజనీన సత్యాలను ఆవిష్కరించిన రసవాది. పాండిత్య ప్రకర్షతో బరువుగా కాకుండా, సామాన్యుడి వాడుక భాషలో అత్యంత లోతైన భావాలను పలికించారు. అందుకే ఆ పాటలు పసిపాపలకు జోలలుగా, యువతకు కర్తవ్య బోధలుగా, వృద్ధులకు జ్ఞాపకాల పేటికలుగా నిలిచిపోయాయి.

### ఒకజాతి కలడాగా ఎగిరిన జయజయహే!

పాటే ప్రాణంగా పదమే ప్రపంచంగా ప్రపంచం అంత తిరిగాడు. **"జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం"** అంటూ ఆయన రాసిన గీతం. తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసింది. ప్రతి తెలంగాణ బిడ్డ గుండెలో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించి, నేడు రాష్ట్ర గీతంగా ఒక జాతి జెండాగా ఎగిరింది. కేవలం ఉద్యమ గీతాలే కాదు, మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు.. అంటూ ఆయన పాడినప్పుడు కంటతడి పెట్టని తెలుగువాడు లేడంటే అతిశయోక్తి కాదు. మారుతున్న కాలంలో మానవ సంబంధాలు ఎలా మంటగలిసి పోతున్నాయో అత్యంత సహజంగా చెప్పిన దార్శనికుడు.

### మానవత్వం సంగమించిన కవిత్వం

మట్టి నుండి మానవత్వం దాకా అందెశ్రీ కవిత్వం ప్రధానంగా మూడు ధారలుగా ప్రవహించింది. అవి.. భూమి– నేలతో మనిషికున్న అవినాభావ సంబంధం, అన్న దాతల కన్నీటి వెతలు, ఇల సీదుల ప్రాధాన్యత, అస్తిత్వం మన జాతి గుర్తింపుకు మూలమైన భాష, సంస్కృతి, చరిత్రల ఆత్మగౌరవ పతాక. మానవత– అట్టడుగు వర్గాల వారి జీవి తాల్లోని విషాదాన్ని, ఆనందాన్ని సమానంగా హత్తుకోవడం.

**స్వరంలో ఆర్ద్రత – పదంలో గాఢత**

ఆయన గొంతులో ఒక విచిత్రమైన వైరుధ్యం ఉంటుంది. ఒకేసారి అమ్మ పాడే బాని పాటలోని మాధుర్యం, జీవితం విసిరే సవాళ్లలోని కాఠిన్యం రెండూ వినిపిస్తాయి. అక్షరాలు ఆవేదనతో అరిచినట్టూ ఉంటాయి. అదే సమయంలో ఆత్మను ఓదార్చినట్టూ ఉంటాయి. ఈ ద్వంద్వ ప్రవృత్తే ఆయన్ను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపింది. అందుకే 'నా' పాటలు వేదికల మీద ముగిసిపోవు. అవి జనజీవన క్షేత్రాల్లో నిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి.. అంటాడు అందెశ్రీ.

**ఆయన మిగిల్చిన వారసత్వం...**

ఒక కవి నిష్క్రమణ అంటే కేవలం ఒక వ్యక్తి వెలిగిపోవడం కాదు. ఒక విజ్ఞాన సర్వస్వం కనుమరుగవడం. అందెశ్రీ భౌతికంగా దూరమైనా మనముందు రెండు బృహత్తర బాధ్యతలను ఉంచి వెళ్లారు.. అవి మాతృభాషను ప్రాణ ప్రదంగా కాపాడుకోవడం. పల్లె నుడికారాలతో మానవీయ విలువలను పెంచడం, పాటను పీడిత ప్రజల పక్షాన నిలబెట్టడంతో పాటు పాటను సాంస్కృతిక ఆనందానికే కాదు, సామాజిక న్యాయానికి కూడా ఆయుధంగా మలచడం..

**నది సముద్రంగా మారిన కాలం..**

సాధారణంగా నదులు సముద్రంలో కలుస్తాయి. కానీ కొన్ని నదులే సముద్రాలుగా మారుతాయి. అందెశ్రీ ఆ కోవకు చెందిన అరుదైన స్రవంతి, ఆయన గుండె చప్పుడు ఇప్పటికీ కోట్లాది మంది తెలుగువారి హృదయాల్లో మారు మోగుతూనే ఉంటుంది.

**"మట్టి మనుషుల భుజాలపై ఆకాశాన్ని దించి బీడువారిన బతుకుల్లో ఆశల విత్తనాలు నాటి గుండె గొంతుకలో శ్రమజీవన రాగాన్ని పలికించిన లోక కవి నీవు నిశ్శబ్దమయ్యావని అనుకోవడం మా భ్రమ... ప్రతి వారం సాలులో వీచే ప్రతి పైరగాలిలో నీ పాట మొలకెత్తుతూనే ఉంటుంది."**

జోహార్ అందెశ్రీ! మీ పాట మా గుండెల్లో పదిలం.

(అందెశ్రీకి నివాళి సందర్భంగా)

❖ ❖ ❖ ❖ ❖

# సాదృశ్యం

షష్టిపూర్తి చేసుకున్న కుష్టుతో
నిష్టలో ముష్టికోసం
బండిమీద కూర్చున్న మొండి మొగుడు
ఎండమావిలా తోస్తున్నా
గుండె లోతుల్లో రెచ్చుపుండు
ముందుకసలు గుంజలేక
మగనిపై గల ప్రేమ చాపక
మోడుబారి కూలిపోక
బలము వుడిగిన నడుం చుట్టూ
బండి తాడును కట్టి గుంజుతూ
అమ్మా ధర్మం అయ్యా ధర్మం

అదిగో అదిగదిగో
చినుగు చాటలో / చిగురించే చాటలో
చిగురించే చిత్రం
చింపుల పేలికలను చుట్టి
పసికందును పడుకోబెట్టి
పచ్చి బాలెంత నోట
వినిపించే పాట
'ధర్మం బాబు ధర్మం'
అదిగో అరుపుల ఆలాపన
దగాబడ్డ చెల్లి చంకలో
వేలాడే పిల్ల ఏడుపు
ఏ ఎదవో చెల్లించిన ముడుపు
ఎత్తయ్యే పొత్తి కడుపు
బరువాయే తరుణం
'అమ్మా శరణం గచ్ఛామి'
అల్లాడే అబల / గల్లీ ప్రతి ఇల్లు గాలిస్తూ
పసికందుకు పాలిస్తే
కనిపించే స్తనాలపై
కామాంధుల కనుచూపులు
కత్తుల్లా గుచ్చుతున్నా
చినిగిన బట్టల్లో – చితికిన అందాల్ని
వెతికే వెధవలున్నా
వేకువెరుగని బ్రతుకును
పతులున్న పతులంతా
పతితలంటూ వెక్కిరించిన
సాటి స్త్రీగా గౌరవించని
సంఘమే ఇల ధిక్కరించినా
బ్రతకాలనే భ్రమతో
విసిరిన విస్తర్లకాడ
కుక్కలతో కుస్తీలు / గాలించే బస్తీలు

'భగవతీ భిక్షాందేహి'
నిర్జీవ నినాదం వినువీధులే ధ్వనులెల్లినా
వినిపించకున్నదా ఈ సాదృశ్యం
మీకు కన్పించకున్నదా

కష్టాల్లో మనిషుంటే
కాసులివ్వ మనసొప్పదు
కనిపించని దేవుళ్ళకు
కడతారు గుళ్ళెన్నో
కాసులెన్నో తగులెట్టి
కాశీయాత్రలు చేస్తారు
ఏడుకొండల ఎంకన్నకు
వేలు వేలు ముడికడతారు
అహోరాత్రులు దీక్షలతో
అయ్యప్పను సుఖపెడతారు
దైవాల పర ఇలపై ధనాన్నంతా తగలెడతారు

'ధర్మం శరణం గచ్ఛామి'
అన్న బుద్ధుని బోధ
బురదలోకి తోసే ప్రబుద్ధుల పర్వం
గరీబులంటే గర్వం
చందాల మందుల విందుల్లో
విలాసాలు మరిచి / మనిషిగా కళ్ళు తెరిచి
'మానవసేవయే మాధవ సేవ'
అన్న 'మహాత్ముని' బాధల్లో
సాటి మనిషిగా సాయం చెయ్యి
సమత రూపానికి ప్రాణం పొయ్యి.

(అందెల సందడి ... నుండి)

# మనం అందెశ్రీని అర్థం చేసుకున్నామా!?

**మౌనశ్రీ మల్లిక్,** రచయిత, విమర్శకుడు, ఫోన్ : 891 933 8546

ఈ తెలంగాణ నేల మీద ఎందరో కవులు, కళాకారులు జన్మించారు. ఆ పరంపర లోని కవి అందెశ్రీ. అయితే అందెశ్రీని ఏ కవితో మనం పోల్చలేం. ఎందుకంటే, ఆయన ప్రత్యేకమైన వ్యక్తిత్వం గలవాడు. ఆ ప్రత్యేకత వలన ఆయన చాలామందికి అర్థం కాలేదు. ఇంతకు అర్థం కాని ఆ ప్రత్యేకత ఏమిటి?

ఆయన అందరు కవుల లెక్క బతకలేదు. కొందరు కవుల లెక్క దిగజారలేదు. పశువుల కాపరిగా మొదలైన అతడి జీవితాన్ని సమాజం ఎంతో చులకనగా చూసింది. పేదరికం ఎన్నో అవమానాలను రుచి చూపించింది. తన కన్న కొడుకును పోగొట్టుకునేలా చేసింది. అన్నిటికంటే ముఖ్యంగా ఆకలి విలువెంటో తెలియజెప్పింది. తన పోరాటమంతా వీటి పైనే చేశాడు. బాల్యంలో తన కుటుంబంలో చెలరేగిన అలజడులు అతడిని బతికినంతకాలం కలవరపెట్టాయి. బతుకుతెరువు కోసం తాపీ మేస్త్రిగా పనిచేసి, కుటుంబాన్ని పోషించుకోలేక పడిన కష్టాలను జీవితాంతం మర్చిపోలేకపోయాడు.

ఏ మనిషి దృక్పథం అయినా తన వ్యక్తిగత జీవితానుభవాల నుంచే నిర్మించబడుతుంది. అందెశ్రీ కూడా ఒక రెట్టమతం వైఖరిని కలిగినోడు. అది చాలామందికి నచ్చలేదు. బతుకు పోరాటంలో హైదరాబాదుకు వచ్చిన తర్వాత చాలాకాలం మేస్త్రి పని చేస్తూ గృహ నిర్మాణ కార్మికుడిగా బతికాడు. హైదరాబాదు అంతా కాలినడకతోనే కలియ తిరిగేవాడు. బస్సులో ప్రయాణం చేయడానికి టిక్కెట్ కూడా డబ్బులు ఉండేవి కావు. అందెశ్రీతో అనుబంధం ఉన్నవాళ్లకు ఈ విషయాలన్నీ తెలుసు. అయితే అందెశ్రీకి ఉన్న మూడు ప్రత్యేకతలు, గుర్తింపును తెచ్చిపెట్టాయి. అందులో ఒకటి అతడు మంచి కవి, గాయకుడు, వక్త. ఈ మూడింటిలో అతడు చాలా పరిణతను సాధించాడు. ఆ క్రమంలోనే అతని పాటలు కొన్ని సినిమాల్లో వినిపించాయి.

గంగ సినిమాకు మాటలు, పాటలు రాసి ఉత్తమ గీత రచయితగా నంది అవార్డును పొందారు. అందెశ్రీ చాలా తక్కువ పాటలు రాశాడు. కాని వందల పాటలు రాసిన వారికి రాని గుర్తింపు అందెశ్రీకి వచ్చింది. ఆయన రాసినటువంటి ముఖ్యమైన పాటల్లో **మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు, కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిచి మొక్కితే అమ్మరా, కాలం కరవాలం, వెళ్ళిపోతున్నావా తల్లి, జన జాతరలో మన గీతం** విశేష ఆదరణ పొందాయి. ఈ పాటలతో ఆయన జన సామాన్యం హృదయాల్లో స్థానం సంపాదించుకున్నాడు. ఆయనకు ప్రత్యేకమైన అభిమానులు ఏర్పడ్డారు.



ఇక ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో తెలంగాణ ప్రజలు ఆయన పాటకు, మాటకు ఆకర్షితులైపోయారు. ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ' పాట ఉద్యమానికి ఊపిరిగా నిలిచిందనడంలో అతిశయోక్తి లేదు. తెలంగాణ ఉద్యమ సమయంలో వేలాది గీతాలు పుట్టుకొచ్చాయి. అందులో కొన్ని మాత్రమే గుర్తింపుకు నోచుకున్నాయి. వాటిలో మొదటిది జయ జయహే తెలంగాణ. ఉద్యమం సమయంలో ఈ పాటతోనే ఏ సభనైనా ప్రారంభించే వారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఆ పాటను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రార్థన గీతంగా ఆలపించడం మొదలుపెట్టారు.

ఆ పాటను రాష్ట్ర గీతంగా పెట్టాలని అప్పటి తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రయత్నించింది. కారణాలేవైనప్పటికీ కెసిఆర్ కు అందెశ్రీకి వచ్చిన విభేదాల వల్ల ఆ పాట రాష్ట్ర గీతంగా ఆమోదం పొందలేక పోయింది. ఇక్కడ ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం ఆ పాటను తిరస్కరించినప్పటికీ, పాఠశాలల్లో మాత్రం పిల్లలు పాడుతూనే ఉన్నారు. ఇందులో ప్రభుత్వ ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీచర్లు ఎప్పుడూ పనిచేయరు. కానీ ఈ పాట విషయంలో ఎవ్వరు పిల్లలకు అడ్డు చెప్పలేదు. పైగా పాఠశాలల గోడలపై తెలంగాణ రాష్ట్ర గీతం అంటూ జయ జయహే తెలంగాణ సాహిత్యాన్ని రాయించారు.

అందెశ్రీకి వస్తున్న అపారమైన గుర్తింపును సమకాలీన సాహిత్యకారుల్లో కొందరు ఓర్చుకోలేకపోయారు. అలా అందెశ్రీ పట్ల ద్వేషాన్ని పెంచుకున్నారు. పబ్లిక్ వేదికల మీద కూడా అందెశ్రీతో కొంతమంది కవులు విభేదించడం మనం చూశాం.

అందెశ్రీ దళిత వాదం పట్ల చాలా దూరంగా ఉన్నాడు. అసలు తనకు తాను దళితుడినే కాదు అని ప్రకటించుకున్నాడు. అది దళిత వర్గాలకు అస్సలు నచ్చలేదు. అలా దళిత మేధావులకు శత్రువుగా మారాడు.

అందెశ్రీ వైదిక సంప్రదాయంలో జీవించాడు. అది కూడా చాలామందికి నచ్చలేదు. ఆయన బాసర సరస్వతీ దేవి ఆరాధకులుగా ఉన్నారు. అందుకే తన కూతుర్లలో ఒకరికి వాక్కులమ్మ అని పేరు పెట్టారు. అందెశ్రీ స్నేహితులు, అభిమానుల సహకారంతో ప్రపంచంలోని పేరెన్నికగన్న నదులను సందర్శించాడు. ఇది అతనికి ఎలా సాధ్యమవుతుందని చాలామంది సాహిత్యకారులు ఆశ్చర్య పోయారు. కొంతమంది అసూయ కూడా పడ్డారు. అలా ప్రపంచమంతా తిరిగి లోకకవిగా బిరుదు పొందారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తన పాట రాష్ట్రగీతంగా పెట్టకపోయేసరికి చాలా కాలం బాధపడ్డాడు. అప్పటినుండి కెసిఆర్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఒక సాధారణమైన కవి ప్రభుత్వాన్ని, జంకు లేకుండా ధిక్కరించడం చాలామందికి విస్మయం కలిగించింది. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఆయన కెసిఆర్ ను ఉద్దేశించి చేసిన ప్రసంగం, అతని ధైర్యానికి మచ్చు తునకగా చెప్పుకోవచ్చు.

ఈ క్రమంలోనే ఆయన సంకలన కర్తగా ప్రచురించిన నిప్పుల వాగు సంకలనం సాహిత్య చరిత్రలో ఒక అద్భుతం. అలాగే సుద్దాల అశోక్ తేజ శ్రీ శూద్రగంగ దీర్ఘ కవిత, శ్రీరామ్ హసిత భాష్పాలు పుస్తకాలను తన వాక్కులమ్మ ప్రచురణల ద్వారా ముద్రించాడు.

ఆ పుస్తకాలను స్వయంగా ముఖ్యమైన వ్యక్తుల ఇంటికి వెళ్లి స్వయంగా అందజేశాడు.

అందెశ్రీ లోపల చాలా ప్రేమ ఉంది. కానీ అతనికి చాలా దగ్గరగా వెళ్లిన వాళ్లకు మాత్రమే అది కనిపిస్తుంది. మిగతా వాళ్లకు అతడు భగభగ మండే సూర్యగోళం లాగా కనిపిస్తాడు. అందెశ్రీ మీద వచ్చిన పత్రిక కథనాల్లో అతన్ని ప్రశంసిస్తూ రాసిన కథనాల కంటే విమర్శ వ్యాసాలు ఎక్కువగా వచ్చాయి. దానికి కారణం అందెశ్రీ అందరికీ అర్థం కాలేదు. అతని ఆలోచనలు, అతని భావజాలం, అతని జీవన విధానం, అతని గమ్యం కొందరికి నచ్చలేదు. అందువలన అతడిని తీవ్రంగా నిందిస్తూ, దుర్భాషలాడుతూ, చివరకు అతని శారీరక వైకల్యాలను బాడీ షేమింగ్ చేస్తూ కూడా వ్యాసాలు వచ్చాయి. నిజానికి అది ఖండించాల్సిన విషయం.

అప్పటి టిఆర్ఎస్ అభిమానులు కూడా సోషల్ మీడియాలో చాలా విపరీతంగా విమర్శించారు. ఆలోచించాల్సిన విషయం ఏంటంటే వీటన్నింటినీ అతను ఓర్పుగా తట్టుకున్నాడు. తట్టుకుని నిలబడ్డాడు. పులులను చూసి అతడు పారిపోలేదు. ఒంటరివాడైనా కూడా తాను సింహంలా గర్జిస్తూనే ఉన్నాడు.

ఒక మనిషి తనలా జీవిస్తూ ఉంటే, ఈ సమాజం అందరిలా జీవించమని చెబుతుంది. అలా జీవించకపోతే రాళ్లతో కొడుతుంది. అందెశ్రీ వీటన్నిటిని తట్టుకోవడానికి గల కారణం అతడు నడిచి వచ్చిన దారి.

ఈ మధ్యకాలంలోనే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన తర్వాత తన జీవితానికి సార్థకత చేకూరినట్టుగా భావించాడు. ఒక ప్రభుత్వం నుండి తిరస్కారానికి గురై మరో ప్రభుత్వం చేత గుర్తింపును పొందడం తను సాధించిన గొప్ప విజయంగా భావించాడు. ఆ పాట ఆవిష్కరణ జనవరి 26న జరిగినప్పుడు ఆనందబాష్పాలు రాల్చిన వీడియో ఇప్పటికి కళ్ళ ముందు కదలాడుతుంది అందెశ్రీ జీవితంలో జరిగిన అతిపెద్ద అద్భుతమైన విజయం అంటే అదే.

ఆయన పాట రాష్ట్రగీతంగా ఎంపిక కావడం కూడా చాలామందికి నచ్చలేదు. ఆ సమయంలో కూడా చాలా విమర్శలను ఎదుర్కొన్నాడు. రాష్ట్రగీతానికి సంగీతం అందించేందుకు కీరవాణిని ఎంపిక చేసుకోవడం వలన, తెలంగాణలో కీరవాణి అంతటి అంతటి స్థాయి సంగీత కారులు లేరు అనడం వలన, కొందరు వ్యతిరేకత తెలిపారు. ఏది ఏమైనా, ఎన్ని ఆటంకాలు వచ్చినా తను అనుకున్నది సాధించాడు.

కాంగ్రెస్ ప్రభుత్వం నవరత్నాలు పేరుతో 9 మంది సాహిత్య కారులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు ప్రకటించే విషయంలో అందెశ్రీ ప్రధాన పాత్ర పోషించారు. తనతో పాటు మరో ఎనిమిది మంది కవులను ఎంపిక చేయడంలో కూడా ఆయన ఉన్నారు.

ఆయనను ప్రేమించిన వారిని, ఆయన ప్రేమించిన వారిని, ఎవ్వరినీ బాధ పెట్టలేదు. అందరితోనూ బాగానే ఉన్నాడు. తనకు చేతనైనంత సహాయం చేశాడు. తనకు కష్టం వచ్చినప్పుడు తన ఆత్మీయులకు చెప్పుకొని బాధలను విముక్తం చేసుకున్నాడు.

అందెశ్రీ మొండిఘటంగా మారడానికి ఆయన బాల్య జీవితం ప్రధాన కారణం. ఆ తర్వాత తనకు నచ్చిన వైదిక సంప్రదాయంలో జీవించడం. ఎవరినీ లెక్క చేయకుండా మాట్లాడటం. అహంకారంతో మాట్లాడినట్టుగా ఉండే గంభీర స్వరం. ఇవన్నీ కూడా చాలా మందికి నచ్చలేదు. అంటే ముక్కుసూటి తనంతో మాట్లాడే అతనిని అర్థం చేసుకోలేని వారికి నచ్చలేదు.

**అందెశ్రీ జీవితంలోని విజయాలు :**

ప్రపంచంలోని ముఖ్యమైన నదులను సందర్శించాడు.

తిరస్కరించబడిన తన పాటను రాష్ట్రగీతంగా పెట్టేలా చేసుకున్నాడు.

పాడుతా తీయగా కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నాడు.

ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే టీవీ షోలో ఇంటర్వ్యూ చేయబడ్డాడు.

**వ్యాసకర్తతో అనుబంధం :**

అందెశ్రీతో నాకు వ్యక్తిగతమైన అనుభవంతో చాలా ఎక్కువ. 25 సంవత్సరాలుగా మా స్నేహం అరమరికలు లేకుండా సాగింది. మేమిద్దరం కలిసి ప్రత్యేకంగా మేడారం జాతరను సందర్శించాము. సరికొండ నరసింహారాజు, కె.వి. ఆహ్వానం మేరకు నాగార్జునసాగర్ సందర్శించాము. జాతీయ సాహిత్య సదస్సుకు ఢిల్లీకి వెళ్ళాము. ఇంకా అనేక కార్యక్రమాలకు, చాలా ఊర్లకు అతిథులుగా వెళ్ళాము. ప్రతిరోజు ఫోన్లో మాట్లాడుకునేవాళ్ళం. నేను ఆర్టీసీ క్రాస్‌రోడ్ లో పనిచేస్తున్నప్పుడు అందెశ్రీ మా ఆఫీసుకు వచ్చేవాడు. అక్కడ మధ్యాహ్నం కలిసి భోజనం చేసేవాళ్ళం. ఇద్దరం కలిసి చాలా సినిమాలు చూశాం. రోజంతా సాహిత్య చర్చలు చేసేవాళ్ళం. తాను ప్రచురించిన నిప్పులవాగులో నా గీతాన్ని ప్రత్యేకంగా ప్రచురించారు. అందెశ్రీ ఆంతరంగిక మిత్రులలో నేను ఒకడిని. ఆయన జీవితంలోని అనేక విషయాలను నాతో పంచుకునేవారు.

మా పరిచయానికి గుర్తుగా నా ఐదవ కవితా సంపుటి చలనకాంక్ష పుస్తకాన్ని రవీంద్రభారతిలో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆ తరువాత తన వాక్కులమ్మ ప్రచురణ ద్వారా నా ఆరవ పుస్తకాన్ని రెండు లక్షల రూపాయల ఖర్చుతో ప్రచురిస్తానని వేదిక మీద ప్రకటించారు. అది నా పట్ల అందెశ్రీకి ఉన్న వాత్సల్యం. సుద్దాల అశోక్ తేజ శ్రీ శూద్రగంగా, శ్రీరామ్ హసిత భాష్పాలు పుస్తకాలు ప్రచురించినప్పుడు మా ఇంటికి వచ్చి మరీ ఇచ్చాడు. కొన్ని రోజుల క్రితం మా ఇంట్లో భోజనం చేయాలని ఉందని చెప్పి ఇంటికి వచ్చి రోజంతా గడిపాడు.


చనిపోవడానికి ఐదు రోజుల ముందు ఫోన్ చేసి రాచకొండ రమేష్‌తో కలిసి వస్తున్నాను. నిన్ను కలవాలి అన్నాడు. తాను కొత్తగా నిర్మించే ఇంటిని నాకు చూపించాలన్నాడు. ఇంటికి వుడ్ వర్క్ చేసే వ్యక్తిని కలవడానికి వెళుతున్నప్పుడు రమ్మన్నాడు. కానీ నేను వెళ్లలేదు. కొత్త ఇంటికి దర్వాజా చేయిస్తున్నప్పుడు కూడా రమ్మన్నాడు. అప్పుడు కూడా నేను వెళ్ళలేకపోయాను. ఆ తర్వాత బాసరకు కలిసి వెళ్దాం రమ్మన్నాడు. అప్పుడు కూడా ఏదో పని ఉండి వెళ్ళలేకపోయాను.

చివరి కాల్.. తాను నిర్మిస్తున్నటువంటి కొత్త ఇల్లు ఇంటి దగ్గర నుండి అంటే, ఘట్కేసర్ నుండి వస్తున్నాను కలుద్దాం, నీకు కాఫీ తాగించాలి అన్నాడు. అప్పుడు దర్శక నిర్మాత బొమ్మకు మురళి దగ్గర ఉన్నాను కలవలేనని చెప్పాను. ఇంకా అదే చివరి కాల్.


అందెశ్రీలో మనం గమనించాల్సింది అనుకున్నది సాధించే పట్టుదల, ఎంతటి వారినైనా ఎదిరించే ధీరత్వం, మాట మీద నిలబడింది తత్వం.

పదవ తేదీ ఆయన మరణించిన రోజు చివరిచూపు కోసం వెళ్లాను. అక్కడ అందెశ్రీని విమర్శించిన చాలామంది ఉన్నారు. అదే ఆయన గెలుపు.


## శిలాశాసనం




మేధావుల మెప్పుకోసం
వాస్తవాలను వక్రీకరించే
కవిత్వం ఒక కవిత్వమేనా?
కరమున కలము పట్టి
పక్కవాళ్ళను కాపీగొట్టి
నే రాస్తానన్నవాడు
ఒక కవేనా?
మహాకవులమని అనుకోండి
నా మనస్సాక్షిగా ఒప్పుకుంటా
మీరు మాట్లాడే ప్రతిమాటా
ప్రజల్లోకి చేరుతుందా చెప్పమంటా?
కవుల రాసిన కావ్యాలు
ఎన్ననేది కాదు కావల్సింది నేడు
కర్మ జీవుల కనువిప్పు కలిగించే
కవులు కావాలి ఈనాడు
వారి కవితలే
సమకాలీన సమాజ స్థితిగతులకు
అద్దం పడతాయి చూడు
ఇది కవి శాసనమా?
కాదు!
కాలగమనాన్ని సూచించే
శిలాశాసనం.



## సత్సంగం



### అలజడి లేని జీవితం

అలజడి, అంటే ఒత్తిడి, నెరవేరని కోర్కెవల్ల గాని, కోర్కెల వల్ల గాని కలుగుతుంది. మనస్సు ఉండడం వల్ల మానవుడయ్యాడు. ఈ మనస్సన్నది ఎప్పుడూ ఏదో ఒకదాని వెంట పరిగెత్తుతూనే ఉంటుంది. దేనినైనా సాధించాలన్నప్పుడు మనమెంతో శ్రమ పడతాం. లక్ష్యాన్ని సిద్ధించుకోవడంలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంటాం. కోర్కె సిద్ధించదేమోనని భయపడతాం. ఆందోళన చెందుతాం. కోర్కెలు ఎక్కువైన కొద్దీ అలజడి కూడా ఎక్కువ అవుతుంది. కాబట్టి అలజడికి మూలకారణం కోర్కె. మనస్సున్నంత వరకూ కోర్కెలని గాని, అలజడిని గాని వారించలేం. ఏ రకమైన అలజడీ లేనివారు, అయితే పిచ్చివారు లేకపోతే ఋషులూ అయి ఉంటారు. వాళ్ళకి సామాన్యులకుండే మనస్సు ఉండదు కాబట్టి. సామాన్యులకి ఎంతో బలీయమైన అహంకారముంటుంది. వాళ్ళెప్పుడూ తమ సంపద గురించో, సంతతి గురించో, తాము సాధించిన వాటి గురించో మాట్లాడుతూనే ఉంటారు. ఇతరులతో తమ స్థితిని పోల్చుకొని ఈర్ష్య చెందుతారు. ఈర్ష్య అలజడిని కలిగిస్తుంది.

ఈ అలజడిని తగ్గించుకోవటానికి మనుష్యులు ఏమి చేస్తూంటారో గమనిద్దాం. సినిమాకి వెళ్ళి అక్కడ మైమరిచి పోతారు. లేదా బార్‌కి వెళ్ళి అక్కడ త్రాగుడులో మైమరిచి పోతారు. లేదా సంగీతం వింటూ మైమరచి పోతారు. ఈ సందర్భాలన్నింటిలోనూ మనిషి యొక్క అహంకారం తాత్కాలికంగా సమసిపోతుంది, మనిషి సంతుష్టుడవుతాడు. నిజానికి మనం నిద్ర పోయేటప్పుడు జరిగేదిదే. అందువల్లనే అందరికీ నిద్ర అంటే అంత ఇష్టం. గాఢనిద్రలో శరీరం గుర్తుండదు, సంపద గుర్తుండదు.. ఆఖరికి మన పేరు కూడా గుర్తుండదు. కలలేని గాడ నిద్రలో మనస్సే లేదు. కాని మేల్కొనగానే, "మంచినిద్ర పట్టింది, ఇప్పుడు హాయిగా ఉంది", అంటాడు మనిషి, అంటే అహంకారం ఏ మాత్రమూ లేనప్పుడు అంతటి ఆనందముంటుందన్న మాట.

ఎవరినైనా ప్రేమించినప్పుడు కూడ ఏ అరమరికలూ లేకుండా ఇంకొకరికి అర్పితమవుతాం. అట్లా అర్పితమవటంలో ఎంతో ఆనందముంది.

వాంఛలని తీర్చుకోవటంలో గాని, పెంచుకోవటంలో గాని ఆనందం లేదు. ప్రతివాంఛా అలజడికి కారణమే అవుతుంది. ఇతరుల సంతోషంలో పాలుపంచుకొని ఆనందించవచ్చు. ప్రతిఫలాపేక్ష లేకుండా సహాయ పడినప్పుడు కలిగే సంతృప్తి మన కోర్కెలను తీర్చుకొన్నప్పుడు కలిగే దానికంటే ఎక్కువగా ఉంటుంది. క్రైస్తవ సూక్తి, 'నీ పొరుగు వాడిని ప్రేమించడం తేలికే, కాని పొరుగువానిలోని లోపాలను ఎప్పుడూ చూస్తూ వానినే ప్రేమించటం కష్టం. అతనిని ప్రేమించటమంటే నీ దురభిప్రాయాలను ప్రక్కకు పెట్టి అతనిని అతనుగానే ప్రేమించటమన్నమాట. వాస్తవాన్ని అంగీకరించలేకపోవటం ఎంతో అలజడికి దారితీస్తుంది. ఎట్లాగున్న వారిని అట్లాగే మనస్ఫూర్తిగా, ఏ ఆర్భాటమూ లేకుండా ప్రేమించగలగాలి.

నిజమైన ప్రేమ సదవగాహనని కలిగిస్తుంది. వాస్తవాన్ని అంగీకరించడం వల్ల అలజడి పోతుంది.

అన్ని మతాలూ అహంభావ రహితంగా ఉండటానికి పద్ధతులు చెప్తాయి. అహంకారయుతంగా ఉండటం గురించి కాదు! మనస్సులో ఆలోచనలు ఎక్కువైన కొద్దీ శక్తి తగ్గిపోతుంది. పూజ, జపం వంటివి ఏకాగ్రతను పెంచుకోవటానికి సాధనాలు. అవి సాధనాలే కాని సాధ్యాలు కావు. ఈ విషయం మరచి పోకూడదు. అసలు లక్ష్యం ప్రశాంతత, నిశ్చలత, ప్రతి మతంలోనూ కొన్ని కర్మలు నిర్దేశింపబడి ఉన్నాయి. ప్రారంభదశలో అవి అవసరమే. ఒక వృక్షం ఎదిగినట్టే యిదీను. ముందర విత్తుని నాటుతాం. అది మొలకలెత్తుతుంది. అది చిన్న మొక్కగా ఉన్నప్పుడు గొడ్లు తినివేయకుండా దాని చుట్టూ కంచె వేస్తాం. అది పెద్ద చెట్టయిన తర్వాత దానికి ఒక ఏనుగుని కూడా కట్టవచ్చు. మన మానసిక, ఆధ్యాత్మిక ప్రగతి విషయంలోనూ ఇంతే. ప్రారంభదశలో మతాచారాలు కంచె వంటివి. ఆధ్యాత్మిక పురోగతి కలిగిం తర్వాత ఆ కంచెని తీసివేయవచ్చు.

కర్మయోగం వల్ల ఆనందం కల్గుతుందని గీత చెప్తుంది. "నీ ధర్మాన్ని నీవు నైపుణ్యంతో నిర్వహించు, ఫలితం గురించి పట్టించుకోక. ఒక్కోసారి కృతార్థుడవవుతావు. ఒక్కోసారి కావు. నీ కర్మ ఫలితాలు నీ ఆధీనంలో లేవు". ఈ విధంగా పనిచేస్తే చాలావరకు అలజడి లేకంఉఉడా ఉంటావు. చేసిన పని సఫలం కాదన్న భయమే అలజడికి కారణం. విఫలమవుతుందన్న భయం లేకుండా పని చేసినప్పుడు ఎంతో ఏకాగ్రత కలుగుతుంది. ఈ తత్త్వమే నాయకులను ఉత్తేజ పరిచింది. నిలిపింది. "కార్యాచరణలో నైపుణ్యమే యోగమంటే"నన్నాడు శ్రీకృష్ణుడు. ఏ పనినైనా బాగా చేసినవానికదే గొప్ప సంతృప్తి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 2  హైదరాబాద్ డిసెంబర్ : 2025

# అందెశ్రీ ... సంపాదకత్వంలోని 'నిప్పులవాగు' సమీక్ష

**డా. వెల్చాల కొండలరావు,** పూర్వ సంచాలకులు, తెలుగు అకాడమీ. ఫోన్ : 98481 95959

అ (తెలంగాణ ఉద్యమ కవిత్వ పాటలు) సంకలనం... సమీక్ష..!!

మనం కవులను ఎందరినో చూశాం, విన్నాం, కానీ వారిలో సుకవులు కొందరైతే..మహాకవులు మరికొందరు.. సుకవులలో అతి విభిన్నమైన అరుదైన తెలంగాణ కవులు గద్దర్ ఆ పిదప అందెశ్రీ, ఎందుకంటే, అలా రాసినవారు, పాడినవారు, మాట్లాడినవారు తెలంగాణ వారిలోనే కాదు తెలుగు వారిలోనే లేరంటే, లేనేలేరు. అలా సొంత హావభావాలతోడా అన్నేసి పాటలు రాసినవారు, పాటలు పాడినవారు వేరొకరు లేరు..వారిది అసలుసిసలైన ప్రజావాణి, జనవాణి, హృదయాన్నుండే కాదు ఆత్మనుండి పెల్లుబికిన బాణి. వారిద్దరూ దళితులే కాని, మేము దళితులమని ఎప్పుడూ చెప్పుకునే వారు కాదు. ఎవరన్నా అలా అంటే నొచ్చుకొనేవారు కూడా. ఎందుకంటే, వారికి కులమెప్పుడూ ప్రధానం కాలేదు. గుణమే ప్రధాన మైంది.


గద్దరైనా ఎంతోకొంత చదివినాడు కాని అందెశ్రీ ఈనాటి చదువులేవీ చదవనే లేదు. కాని, ఇద్దరి అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలు,.... ఆత్మవిశ్వాసాలు, ఆత్మాభిమానాలు అరుదైనవే.

ఆత్మవిశ్వాసం ఆత్మాభిమానం లేకపోతే అస్తిత్వమే లేదు. అస్తిత్వ మనునది ఊరికే అరుస్తే మురుస్తేరాదు. ప్రజలనాడి ఏమిటో తెలిస్తే, ఆ నాడికి చెందినవారైతే తప్ప, ప్రజల కష్టసుఖాలను కంటే వింటే, వారిలో... ఒకరిగా బ్రతికితే తప్ప. అలా బ్రతికినవారు వారిరువురూ. అతి బీదరికాన్ని అనుభవించినవారు.ఎన్నో.. చిన్నా పెద్దా అవమానాలను భరించినవారు.

అందెశ్రీ 'శీలం' అని అంటుండేవాడు శీలం చాలా విస్తృతార్థం కల పదం. ఒక్క వాక్యంలో చెప్పాలంటే దానిని 'నీతి, నిజాయితీ' యని యనవచ్చు. నీతీ నిజాయితీ ఉన్నవాడే కదా నిర్మలమైనవాడు నిప్పులాంటి వాడవుతాడు. అవినీతిని, అసభ్యాన్ని, అశ్లీలతను, అనాగరికతను చూస్తే నీరైపోయేవాడు, నిద్రపోనివాడవుతాడు.

శీలం పాతివ్రత్యమే కాదు పావనం, పవిత్రం, సహజం కూడా. నాకు అర్థమైనంతవరకు అందెశ్రీ శీలమను పదాన్ని అలాంటి విస్తృతార్థంలోనే వాడాడు. అతడు శీలమున్నవాడు కనుక. అందుకే అతడు పాడినపాటల్లా ఒక ఉత్సాహకుడిగానే కాదు. ఒక ఉన్మాదకుడి గా పాడాడు.

గద్దర్ అనేకానేకసార్లు 'గో టు పీపుల్' అని అంటుండేవాడు.అంటే జనాల్లోకి వెళ్లండి, వాళ్లతో మమేకం కండి అపుడే మీకు నిజమైన కవిత్వ మొస్తుంది, అప్పుడే మీరు నిజమైన నాయకులు కూడా అవుతారని అనేవాడు. అలాగే అందెశ్రీ కూడా పదే పదే మీకు శీలం



ముఖ్యం అని అంటుండేవాడు. గద్దర్, అందెశ్రీలిద్దరూ జనంతో మమేకమైనవారే. ప్రజల్లో తిరుగుతూ ప్రజల భాషను ఒంటపట్టించు కున్నవాళ్లే, సహజమైనవాడంటే మరొక అర్థం మంచివాడు, మంచికవి, మంచి నాయకుడు. అందుకే కదా మనం ఒక వాల్మీకిని, ఒక వ్యాసున్ని, ఒక కాళిదాసుని మంచి కవి, మహాకవి అని అంటుంటాం... అప్పటికీ ఇప్పటికీ, అందుకే కదా మనం ఒక బుద్ధున్ని, ఒక గాంధీని, ఒక లింకన్ను మంచి నాయకుడు అని అంటుంటాం.

అందెశ్రీ ఒక నది, ఒక జలపాతం, ఒక సముద్రం, ఒక నిప్పులవాగు.

'నిప్పు' ఉద్యమానికి ప్రతీక, వాగు ప్రవాహానికి, అంటే, ఉద్యమం అందెశ్రీకి ఒక ఎడతెరపిలేని ప్రవాహం....నిప్పు ఉత్సాహానికి, ఆవేశానికి, ఆందోళనకు. అందెశ్రీకి తెలంగాణ ఉద్యమం నిప్పులవాగు లాంటిది. అది రాష్ట్ర సాధనతో మాత్రమే ఆగనిది, ఆగిపోగూడనిది. అది అస్తిత్వవాద పోరాటం, స్వేచ్ఛ కొరకు పోరాటం, సమసమాజం కొరకు, సామాజిక సర్వతోముఖ అభివృద్ధి కొరకు జరిగిన పోరాటం కనుక ఎప్పటికీ ఎల్లప్పటికీ కొనసాగాల్సిందే. ఆ పోరాటం ఒకప్పుడు రైతాంగ పోరాటంతో మొదలైంది. అటు తదుపరి ఉస్మానియా యూనివర్సిటీలో యూనివర్సిటీ అటానమీ కొరకు జరిగింది. అటుతదుపరి తెలంగాణలో చిన్నాపెద్దా పోరాటాలు మరెన్నో జరుగుతూనే ఉండినవి. అందుకే పి.వి. గారు ఒకసారి వరంగల్ యూనివర్సిటీ కాన్వొకేషన్లో తెలంగాణను ఒక "ఉద్యమాలగడ్డ" అన్నారు. అది అక్షరాలా నిజం.

అందెశ్రీ అతని పుస్తకానికి 'నిప్పులవాగు' అన్న పేరును తెలంగాణ ఉద్యమానికి ఒక సింబల్గా, ప్రతీకగా పెట్టాడు. ఈ పుస్తకంలో అనేకానేక కవుల కవితలున్నాయి. అవన్నీ ఉద్యమానికి చెందినవే, విప్లవస్ఫూర్తికి చెందినవే. విమోచన కొరకు కవులు రాసినవే.

వారి అభిప్రాయంలో తెలంగాణకు చెందిన విమోచనం రెండు విధాలు. ఆంధ్రుల పరిపాలన నుండి విమోచనం, అటుతదుపరి జరిగిన రాచరికంలాంటి పరిపాలననుండి విమోచనం. ఒకటి ఒక బానిసత్వ విమోచన కొరకు జరిగిన పోరాటమైతే, ఇంకొకటి మరొక బానిసత్వ విమోచన కొరకు జరిగిన పోరాటం. ఒకటి ఎక్స్టర్నల్ పోరాటమైతే, ఇంకొకటి ఇంటర్నల్ పోరాటం. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ రెండు పోరాటాలు సమాజంలోని అతి వివక్షతలకు, వ్యత్యాసాలకు, దోపిడీకి, దొరతనానికి జరిగిన పోరాటాలే.

అందెశ్రీ అసలు సిసలైన దేశభక్తుడు. అతడి తెలంగాణ భక్తి దేశభక్తిలో ఒక భాగమే, అతని దేశభక్తి దైవభక్తిలో ఒక భాగమే. అతడు కులభక్తుడు కాదు, గుణభక్తుడు. అందుకే కులం గురించి ఎప్పుడూ మాట్లాడేవాడు కాదు. అన్ని కులాలలో కూడా ఉంటారు. అలాంటివారు ఇలాంటివారు అని అంటుండేవాడు. అతనికి 'మనిషి' అదీ ఇదీ ఏదో కావడం ముఖ్యం కాదు, మనిషి మానవత్వం కలవాడు కావడం ముఖ్యం. అందుకే రాశాడు 'మాయమైపోతున్నాడు మనిషన్న వాడు' యను అతని కవితల్లోకల్లా అతి ముఖ్యమైన కవిత.

అందెశ్రీ జీవితమంతా అతి సాదాసీదాగా, నీతి నిజాయితీతో బ్రతికినవాడు. అతని మతభక్తి, దైవభక్తి, దేశభక్తి అన్ని "మానవ సేవే మాధవసేవ" యను అంతరార్థానికి చెందినవే. అంటే, మతం మతం కొరకే కాదు, దైవభక్తి దైవభక్తి కొరకే కాదు మానవుల మనుగడ కొరకని' భావించినవాడు. మతమనునది విలువలకొరకు కాని వలువల కొరకు కాదని భావించినవాడు.

అతనికి విశ్వనాథ సాహిత్యపీఠం తరపున నా జోహార్లు!

❖ ❖ ❖ ❖ ❖

# మా వూరు

పచ్చని పైరు సిరుల
జరీ పట్టుచీర కట్టుకొని
సిరి సంపదల ఆభరణాలు
ఒంటినిండా అద్దుకొని
తెలుగు వెలుగుల జిలుగు శాలువా
నిలువెల్లా కప్పుకొని
బాలభానుని బంగారు కిరణాలు
నుదుట తిలకంగా దిద్దుకొని
పాలపొంగు పరువాల
పాలరాతి బొమ్మ
ఐదారువేల జనాభాకు
జన్మనిచ్చిన అమ్మ
పాత కక్షల పర్వంలో
పదవీకాంక్షల గర్వం
కాటువేసే కాలనాగులా
కౌటిల్యుని రాజనీతి
భాగ్యవంతుల బంగళాలు
పూరిగుడిసెలు పెంకుటిళ్ళు
పరమ అసహ్యంగా తోచే పాడుబడ్డ ఇండ్లు
చెరువుల కెపుడు గండ్లు
కులమతాల ప్రమేయంలేని కూటమి
కుళ్ళు మనసున్న వారికే ఓటమి
తాటి కల్లుతో తగాదాలు
తెల్లవారితే ఉగాదులు



మా ఊరికెన్నో బాటలు
గున్నమావి తోటలు
కోకిలమ్మ పాటలు
పిల్లకాయల ఆటలు
ఉరికి ఉత్తరాన
ఒళ్ళంతా కళ్ళతో
పిల్లాపాపల చల్లంగా చూసే
నల్లపోచమ్మ గుడి
నడి ఊళ్లో
రామలింగేశ్వర ఆలయ ప్రాంగణం
మకర సంక్రాంతికి మహాజాతర
ప్రతికులంలో ప్రీతిని కొలిపే
పీరీల పండుగ
విజ్ఞానంలో విశారదులు
అజ్ఞానంలో అతిరథులు
సందుగొందుల్లో సానులతో
రైకబేరాలు
మేకపోతుల గాంభీర్యాలు
అయినా...!!
ఏ చిత్రకారుని కుంచో
పురివిప్పిన నెమలి ఫింఛంలా
నాకు స్ఫూర్తి నిచ్చిన
కీర్తి కిరీటం 'మా వూరే'

**(అందెల సవ్వడి నుండి)**

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక** సంపుటి -29 : సంచిక - 2 (49) హైదరాబాద్ డిసెంబర్ : 2025


# తెలంగాణ ఆత్మగీతాకారుడు... అందెశ్రీ

**డా. ఎస్. రఘు,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 98482 08533

ప్రకృతి పాఠశాలలో పాటను దిద్దుకున్న సహజకవి అందెశ్రీ. పరిసరాలలోని పరిణామాలకు పాటగా పరిఢవిల్లిన ప్రజాకవి అందెశ్రీ. పసితనం నుండే పశువుల కాపరిగా పనిచేసినా, రోజువారి కూలీగా శ్రమించినా, తాపీ మేస్త్రిగా పరిశ్రమించినా మనసు మాత్రం పదాల చుట్టూ పరిభ్రమించేది. జూలై 18, 1961లో పాత వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో జన్మించిన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఊహ తెలియని వయసులో తల్లిదండ్రుల ప్రేమకు దూరమై అనాథ అయిన అందెశ్రీకి పాట తొలి ఊరట నిచ్చింది. ఏ బడిలో చదువుకోకపోయినా లోకమనే విశ్వవిద్యాలయంలో గాఢమైన తాత్విక విషయాలను అవగాహన చేసుకున్నాడు. తొలిదశలో శృంగేరి మఠ పీఠాచార్యులు స్వామి శంకర్ మహరాజ్ ఆశీస్సులతో జీవనోత్సాహాన్ని నింపుకున్నాడు. ఆచార్య బిరుదురాజు రామరాజు ప్రేమాభిమానాలు పొంది వారి మార్గదర్శకత్వంలో సాహిత్య సృజనకు పాదులు తవ్వుకున్నాడు.

అందెశ్రీ తన ఆరేళ్ల వయసునుండే ఆశువుగా పాటలు అల్లడం మొదలయ్యింది. తనలోని కవితాత్మను నిదుర లేపి సాహితీ జిజ్ఞాసను కలిగించిన గురువులందరినీ తలచుకుంటూ 'పాటల పూదోట' లలిత గీతాల సంపుటిని అక్టోబర్ 1994లో వెలువరించాడు. అదే సంవత్సరం డిసెంబర్‌లో 'అందెల సందడి' అనే కవితా సంపుటి అందించాడు. అందెశ్రీ ఈ రెండు గ్రంథాలకు ప్రముఖ సాహితీవేత్తలు డా.బోయి భీమన్న, డా.సి.నారాయణరెడ్డి, ఆచార్య పేర్వారం జగన్నాథం, జి.కృష్ణ, డా.రావూరి భరద్వాజ, డా.వాసిలి వసంత కుమార్ మొదలైన వారు ముందు మాటలు రాశారు. వారందరి మాటలను క్రోడీకరిస్తే నిలిచే మాట 'అందెశ్రీని దేశం నిలపకపోతే కాలం నిలుపుతుంది' అని. నిజంగానే కాలం గుండెల మీద చెరిగిపోని కవితా వాక్యమై ప్రతిధ్వనిస్తుంది అందెశ్రీ పాట.

అందెశ్రీ అనగానే ఎన్నో ప్రజాదరణ పొందిన గీతాలు మనల్ని చుట్టుముడతాయి. ముఖ్యంగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం' అనే పాట మార్చ్‌పాస్ట్ ఉద్యమ గీతంగా తెలంగాణ ప్రజానీకాన్ని ముందుకు నడిపించింది. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించక ముందే తెలంగాణ జాతి జనుల అనధికార ప్రార్థనా గీతంగా మారింది. నేడు తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా ఎందరో త్యాగధనుల, ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చింది. తెలంగాణ సాంస్కృతిక, సామాజిక, రాజకీయ అస్తిత్వ వైభవాన్ని కీర్తించిన ఈ గీతం ఎప్పుడు విన్నా గాఢమైన భావోద్వేగాలను అందిస్తూ ఒక చారిత్రక పోరాటాన్ని, విజయాన్ని గుర్తుకు తెస్తుంది.



సాహిత్యంలో వశీకరణ శక్తిని నింపుకున్న ప్రక్రియ పాట. రాతి హృదయాల్లోనూ చిగుళ్ళను మొలిపించగల స్పర్శ పాటలో దాగి ఉంది. పాట భూప్రకంపనల్ని మించిన స్పందనల్ని సృష్టిస్తుంది. అందెశ్రీ అటువంటి పాటల సృష్టికర్త. తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సందర్భంలో జరిగిన అనేక సభల్లో అందెశ్రీ పాటలు ప్రజలను ఉర్రూతలూపాయి. **'జై బోలో తెలంగాణ/ గళ గర్జనల జడివాన/ జై బోలో తెలంగాణ/ నిలువెల్ల గాయాలవీణ/ ఒకటే జననం ఒకటే మరణం/ జీవితమంతా జనమే మననం/ జన జాతరలో మనగీతం/ జయకేతనమై ఎగరాలి'** ఒక్కో కవితా పాదంలో ఎంతటి ఉత్ప్రేరక శక్తి కేంద్రీకృతమై ఉందో అందరికీ అనుభవమే. నేటికీ ఆ పాట వింటుంటే తెలియని ఉద్యమోద్వేగం ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రతినిత్యం ఈ పాట ఎవరూ పాడకపోయినా నేపథ్యగీతంగా వినపడుతున్నట్లే ఉంటుంది.

**'పల్లె నీకు వందనాలమ్మో/ ననుగన్న తల్లీ నీకు వందనాలమ్మో/ నాకు పాట నేర్పి ఆట నేర్పి బతుకు బాట నేర్పిన/ పల్లె నీకు వందనాలమ్మో'** అనే పాట అందెశ్రీ ఆత్మకథాత్మక గీతంగా చెప్పవచ్చు. పల్లె తనకు ఎంతటి ప్రేరణను ఇచ్చిందో, పల్లెతో మనిషి కుండవలసిన గాఢమైన అనుబంధాన్ని వర్ణిస్తాడు. ఇక **'కొమ్మ చెక్కితే బొమ్మరా/ కొలిసి మొక్కితే అమ్మరా/ ఆదికే ఇది పాదురా/ కాదంటే ఏదీ లేదురా'** అనే పాట అందెశ్రీలోని గ్రామీణ దేవతల మీద ఉన్న భక్తి తత్వాన్ని ఆవిష్కరిస్తుంది. పల్లెలోని అణువణువులో ఉన్న జానపద సాంస్కృతిక అంశాలను స్మరిస్తుంది. అందెశ్రీ ఒక ఆధ్యాత్మిక బాటసారి. దారి పొడుగునా పాట తోడుగా నడిచిపోయే జానపదుడు అందెశ్రీ.

అందెశ్రీ మనిషిని కేంద్రంగా చేసుకొని మానవీయ జీవన విలువల కోసం అన్వేషణ చేశాడు 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు'


పాటలో మానవీయుడి కోసం భూగోళమంతా ప్రతిధ్వనించేలా తన భావాలను వినిపించాడు. మనుషులతో కిక్కిరిసిపోయిన ఈ భూమి మీద కవి ఒక మనిషి కోసం వెతుకులాడడం ఆశ్చర్యం. కవికి కావలసింది కేవలం భౌతికమైన మనుషులే కాదు. ఆ మనుషుల మనసులు మానవత్వంతో నిండిపోయి మరో మనిషి పట్ల ప్రేమతో స్పందించగలిగే నిజమైన మనిషి కోసం ఆవేదనతో ఆలపిస్తున్నాడు. సమాజంలో క్షీణిస్తున్న మానవ సంబంధాల పట్ల కవిచేసిన ఈ విలాపం ఇంకా వినబడటమే విషాదం. ఏ మనిషికి ఆ మనిషి ఆత్మ విమర్శకు పురిగొల్పే పాట ఇది. అందెశ్రీ శాశ్వత చిరునామాల్లో ఈ గీతం ప్రథమ శ్రేణిలో నిలబడుతుంది.

ఈ పాటలీపుత్రుడు అందెశ్రీ 'గంగ' అనే సినిమాకు రాసిన పాటలు కూడా విశిష్టమైనవే. సినిమా పాటకు తాత్విక కావ్యస్థాయిని చేకూర్చాడు. సహజకవి తళుకు బెళుకుల టీవీ సినిమా మాధ్యమాల ఆకర్షణలకు లొంగిపోకుండా తన అస్తిత్వాన్ని కాపాడుకున్నాడు. తెలంగాణ సాహిత్య చరిత్ర పునర్నిర్మాణ దశలో భాగంగా అందెశ్రీ నిప్పులవాగు అనే బృహత్ కవితలు పాటల సంకలనాన్ని తీసుకు వచ్చాడు. 1969 తెలంగాణ ఉద్యమ పాటలు 406, సాయుధ తెలంగాణ పోరాట పాటలు 42, మలిదశ తెలంగాణ ఉద్యమ పాటలు 557, మలిదశోద్యమ వచన కవితలు 145, వెరసి 790 కవితలతో 1307 పేజీలతో నిప్పుల వాగును ఒక చారిత్రక సాహిత్య సంపదగా మనకు అందించాడు. ఈ భూగోళం మీద ప్రవహిస్తున్న అన్ని నదుల మీద ప్రయాణిస్తూ ఒక బృహత్ నదీ కావ్యం రాయాలని స్వప్నించాడు అందెశ్రీ. ఆ స్వప్నం సాకారమయ్యే వేళ తెలుగువారికి కన్నీటి నదిని మిగిల్చి వెళ్ళిపోవటం తీరని విషాదం. 'వాక్కులమ్మ ప్రచురణ' ద్వారా 100 ఉత్తమ గ్రంథాలను ప్రచురించాలనే సంకల్పంతో ఐదు గ్రంథాలను ప్రచురించాడు. ఇంకా 95 గ్రంథాలు బాకీ తీరితే ఎంత బాగుండు. అందెశ్రీ తన 'అందెల సందడి'ని అలిశెట్టి ప్రభాకర్ కు అంకితమిస్తూ 'ప్రజాకవిగా ప్రభవించిన అజరామరుడు' అని కీర్తించాడు. అందెశ్రీ కూడా అలాంటి అజరామర కవే.

❖ ❖ ❖ ❖ ❖

## అశ్రు తర్పణం

నిశ్శబ్దం నిశ్శబ్దం
శబ్దార్థ సందిగ్ధం
విధి యుద్ధం జన దగ్ధం
శబ్దం ప్రసిద్ధం
హూంకరించే భూస్థలి
ఊహించని ఘోరకలి
వేల సంఖ్యలో నరబలి
విధిరక్తంతో ఆడిన రంగోళి
కాలం కరవాలం
సువిశాలం కుచేలం
ఓకిలించే భూగోళం
సకిలించె కపాలం
నిశ్శబ్దం నిశ్శబ్దం
శబ్దార్థ సందిగ్ధం
పల్లె జిల్లాలు ఘొల్లుమనగా
పక్కటెముకలు ఘొల్లుమనగా
గోడపెల్లల క్రింద చితికి
అమరులైన అన్నలెందరో
వెచ్చని కౌగిలి కోసం
ఎడదాగ్ని ఎదురు చూపుల
ముంచుకొచ్చిన మృత్యుకౌగిట
ముక్కలైన అక్కలెందరో?
అల్లరితో అలరించి
ఆదమరిచి నిద్రించి
అమ్మ రొమ్మునే అంటి పెట్టుక
హతులైన పాపలెందరో?
నిశ్శబ్దం నిశ్శబ్దం
శబ్దార్థ సందిగ్ధం
తిలకించు మహారాష్ట్రం
జన నష్టం ధన నష్టం
కిల్లారి లాతూరుల
కాలుతున్న కాష్టం
వక్రించిన విధి
కాలచక్రములతో చిక్కుకొని
విలపించిన విషాదగీతం
ఇది కవితా సంకేతం
మండే గాయాల
కవి గుండె గేయాలతో
గుండె చప్పుళ్ళ
నిండు నివాళులతో
అశ్రుతర్పణం
రోదసీ అక్షరాల. (అందెల సందడి నుండి)



# నడిచే అగ్నిపర్వతం... అందెశ్రీ

**ఎం. విప్లవ కుమార్,** రీసెర్చ్ స్కాలర్, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 951 522 5658



ఎంతో వైవిధ్యమైనది ఈ నేల. అద్భుతమైన గనులు, మనులు, మాణిక్యాలు, ఎన్నో సహజ వనరులను తన గర్భంలో నిక్షిప్తం చేసుకుని ఉంది. అడవులు, నదీనదాలు, ఎడారులు, కొండలు, గుట్టలు, అగ్నిపర్వతాలను తన ఎదమీద రక్షణగా నిలుపుకుంది. అలాంటి పాటాగ్నిపర్వతాలలో ఒక నడిచే అగ్నిపర్వతం లోకకవి అందెశ్రీ. తొలుత అగ్నిపర్వతం చూడ్డానికి బుద్ధిగా, ఒద్దికగా కనిపించినా, కాలక్రమ విధ్వంసాన్ని, కాలగర్భిత హింసను భరించి, భరించి కడకు సహించలేక ప్రచండ ప్రళయాగ్నులై బద్ధలైతుంది. సరిగ్గా అందెశ్రీ పాట కవిత్వం కూడా అంతే. స్వల్ప కాలానికో, అల్ప కారణానికో లెక్కగట్టి కాదు. పాలకపక్షం కానీ, ప్రతిపక్షం కానీ, ఆధిపత్యం కానీ మానవాళిపై చేస్తున్న దుర్మార్గాలను చూసి తట్టుకోలేక స్పందించిన వాడు. అగ్నిపర్వతం బద్దలై లావా ఉబికి వచ్చినట్టు అక్షర ప్రళయాగ్నిలా ఎగిసిపడుతుంది పాట. సమస్త లోకాన్ని సహజ సైనికుడై చుట్టి వస్తూ, కవిత్వ కవాతు చేసినవాడు. అమ్మవాక్కును ఆకాశవాణిలా కాకుండా భూలోక బాణిలా వినిపిస్తూ మోగినవాడు అందెశ్రీ.

అన్యాయంపై ఓ దగ్ధనిర్మిత జడివానై వర్షిస్తుంది ఆయన పాట. తన కంఠం పెదేల్మని మోగే ఉరుముల శబ్దమై గర్జిస్తుంది. అలా వేడి వేడి లావా నేలపై పరుచుకున్నట్టు, అనారోగ్య పీడితున్ని ఉపశమన పరుస్తూ ఔషధం గొంతులోపలికి దిగినట్టు, అందెశ్రీ పాట **"జన జాతరలో మనగీతం జయకేతనమై ఎగరాలి/ఝుంఝూ మారుత జన నినాదమై జేగంటలు మోగించాలి/ ఒకటే జననం ఓహొహొ.. ఒకటే మరణం ఆహాహా../ జీవితమంతా ఓహొహొ.. జనమే మననం అహాహా../ కష్టాల్ నష్టాల్ ఎన్నెదురైనా కార్యదీక్షలో తెలంగాణ/ జై బోలో తెలంగాణ"** అంటూ మెల్లగా మన నరనరాల్లోకి, జవజీవాల్లోకి తన అక్షరాల ఆకుపసరును ఒంచి పదునెక్కించడం మనమంతా కళ్ళారా చూశాం. తనువారా అనుభవించాం. కడదాకా జ్వలించాం తెలంగాణ సాధించాం. ఆ క్రమంలో ఉద్యమానికి మద్దతుగా ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' సినిమాను ఈ పాట లీడ్ చేస్తూ నడిపించింది. సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకు ఈ పాట నేపథ్యగీతమై వినిపిస్తుంది. మార్చింగ్ సాంగ్ లాంటి ఈ పాట సినిమా స్క్రీన్ ప్లేకు బలమై, ఉద్విగ్నతను నిలబెట్టింది.

తెలంగాణ ఎర్రని మాగాణంలో ఎక్కడజూసినా గద్దర్, గోరటి వెంకన్న, జయరాజుల్లాంటి వాళ్ళకు కొదవలేదు. అయితే వీరందరూ చదువుకుని ప్రత్యక్ష పోరుబాటలోంచి వచ్చినవాళ్ళు. జననాట్య మండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యల్లో పని చేసినవారు. కానీ అందెశ్రీ అట్లా చదువుకోలేదు. ఏ కళా సంస్థలో పనిచేయలేదు. జీతం ఉండి వ్యవసాయం చేసిన వ్యవసాయ కార్మికుడు. తాపీ పట్టి పనిచేసిన భవననిర్మాణ కార్మికుడు. కనుకనే వారందరికంటే విభిన్నమైనవాడు. తనమీద ఆశ్రమం, మఠం లాంటి ప్రభావాలున్నప్పటికీ తెలంగాణ నేల మీద విప్లవోద్యమాల ప్రభావం కూడా బలంగానే ఉందనేది మనం ప్రస్తావించుకోవాలి. తనే చెప్పుకున్నట్లు సుద్దాల హనుమంతు పాట **"పల్లెటూరి పిల్లగాడ పసులగాసే మొనగాడ / పాలు మరిచి ఎన్నాళ్ళైందో/ ఓ పాలబుగ్గల జీతగాడ కొలువు కుదిరి ఎన్నాళ్ళైందో"** పాటంతా ఆయన జీవితమే. కనుక ఈ పాట ఆయనను కమ్మేసింది. అంతకుముందెన్నడూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనకపోయినా, పాలబుగ్గల జీతగాడుగా ఉన్న కాలంనుంచే ఆయనను ప్రజా ఉద్యమగాలి ఆవహించింది. ఆ రీతిగా తనకు తెలియకుండానే ఉద్యమాలను చదువుకున్నాడు, ఆకళింపు చేసుకున్నాడు. అంతే తప్ప ఏనాడు కన్నప్రేమకు, కలం ప్రేమకు నోచుకున్నోడు కాదు. కాబట్టే ఆ బాధలు మరిచిపోవడానికి పాట శరణుజొచ్చినవాడు అందెశ్రీ. అలాంటి అక్షరం ముక్కరాని, ఏనాడు బడి మొఖం చూడని సామాన్యుడు, అందరి బాధలు తీర్చేందుకు పాట ఆయుధాన్ని భుజానికెత్తుకొని ధైర్యంగా కైతల కవాతు చేసినవాడు. ఆ వైవిధ్య ఆగమనం వల్లనే కావచ్చు, భిన్నంగా రాయడంకోసం, పాటకు కొత్త జీవం అద్దడం కోసం, అప్పటికే రాస్తున్న పరంపరను ఎరువుగా, ప్రజలను పందిరిగా చేసుకొని, ప్రజా పాటను తనదైన శైలిలో నిలబెట్టడం కోసం తపిస్తున్నవాడు అందెశ్రీ.

బహుషా పోతన పుట్టిన నేలమీద పుట్టినవాడవడం చేత కావచ్చు, పోతన వలె పద్యం చెప్పగల నేర్పు కలిగిన వాడవడంచేత కావచ్చు రాజ్యాలకు, రాజులకు, రాజ్య ప్రాకారాలకు పాటను తాకట్టు పెట్టనని

శపథం తీసుకున్నవాడు అందెశ్రీ. నేటి పాటల పరాయాకరణ యుగంలో అందెశ్రీ ప్రజలకు తప్ప దేనికీ, ఎవరికీ తలవంచనని ప్రకటించడం అత్యంత సాహసమే. ఇలాంటి మచ్చు తునకలను చూసే కాబోలు "ఇక్కడి మనుషులు మనుషులుగానే జీవిస్తున్నారు" అంటాడు ప్రసిద్ధ చరిత్రకారుడు జయధీర్ తిరుమలరావు. అంతే కాదు ప్రతి ఇంటిలో పటంగట్టి గోడలకు తగిలించాల్సిన ఎన్నో పాటలు రాశాడు అందెశ్రీ. కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిసి మొక్కితే అమ్మరా/ ఆదికే ఇది పాదురా కాదంటె ఏది లేదురా/ అని ప్రకృతీ తత్వాన్ని, మానవజాతి తొలి జీవనగమనాన్ని, మాతృస్వామిక వ్యవస్థ గొప్పతనాన్ని వివరించాడు. జానపదుల జీవిక, గ్రామ దేవతల భూమికను చిత్రికపడతాడు. ఈ ప్రపంచీకరణ యుగంలో మారుతున్న, యాంత్రికమై మాయమైపోతున్న, మనిషిని వెతుకుతూ విలపించాడు. భక్తి పేరుతో జరుగుతున్న బహుళ వ్యాపారాన్ని, ఆధ్యాత్మికత పేరుతో చేస్తున్న మతోన్మాద దుర్మార్గాలను ఖండించాడు అందెశ్రీ. అడవి మానవాళి బ్రతుకుకే మూలం. అడవిని కాదంటే ఆక్సీజన్ దొరకదు కాబట్టి, ఈ భూమ్మీద మానవాళికి మాత్రమే కాదు, ఏ జీవికి బ్రతుకు లేదని ఈ పాట ద్వారా హెచ్చరించి అడవి రక్షణకు మేల్కొల్పినవాడు అందెశ్రీ.

ఎంతో మంది సెల్ ఫోన్ రింగ్ టోన్ అయిన పాట, అందరూ ఆమోదించిన పాట **"మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేడు చూడూ మానవత్వం వున్నవాడూ/ నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు/ యాడవున్నాడో కాని కంటికీ కనరాడు"** అంటూ ఈ ఆధునిక కాలంలో మనిషిలా బతుకుతున్న మనిషిని దేవులాడుకున్నాడు. మనిషితనం బ్రతకాలని ఆరాటపడ్డాడు. ఇంకా ఈ పాటలో భక్తీ, ముక్తీ, రక్తిల వ్యాపార స్వభావాన్ని ఎండగట్టాడు. 'నీవు కూడా దైవభక్తి కలిగిన వాడివేగా ఇట్లా ఎట్లా రాశారని నేను అందెశ్రీని అడిగితే...' "భక్తి, ఆధ్యాత్మికత అంటే బుద్ధుడిలా ఉండటమే తప్ప ఇప్పుడు చూస్తున్న కుప్పిగంతులు కావని చెప్పాడు." **"కుక్కనక్కల దైవరూపాలుగా కొలిసి/ పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు/ చీమలకు చక్కెర పాములకు పాలోసీ/ జీవకారుణ్యమే జీవితము అంటాడు/ తోడబుట్టిన వాళ్ల ఊరవతలికి నెట్టి/ కులమంటు ఇల మీద కలహాల గిరిగీసి"** అంటూ ఈ పాటలో జంతువులను మొక్కడం కాదు మనుషులను మనుషులుగా చూడటం నేర్చుకోవాలని కోరినవాడు. ఆవుల కోసం మనుషులను చంపుతున్న నేటి మతస్వామ్యం రాజ్యమేలుతున్న ఈ కాలంలో అందెశ్రీ పాట అత్యయిక అవసరం అనిపిస్తుంది. జీవితాన్ని చిత్రించేటప్పుడు కళ నిరంతర జీవధార అవుతుంది. ఆవిధంగా అందెశ్రీ తన పాట ద్వారా జీవితాలను చిత్రించే పనిలో నిమగ్నమై జీవధారగా సాగినవాడు.

ఆక్రమంలో తన జీవితంలోకీ, గడిచిన చరిత్రలోకీ తొంగి చూసుకుంటాడు. అలాంటి సందర్భంలో తన రేఖాచిత్రంలో సుద్దాల హనుమంతు లాంటివారు కనపడతారని చెప్పుకున్నాడు. మట్టిని, మట్టి పరిమళాన్ని ఒళ్ళంతా పులుముకుని, నరాల బిగువున పొలాలు దున్ని, కరాళ బలమున వరాలుతీసి, పంట పండించిన నిజ పాలబుగ్గల జీతగాడినని ప్రకటించుకున్నవాడు. అయితే సుద్దాల హనుమంతు పాట వింటూ పెరిగిన అందెశ్రీకి, హనుమంతు పాటలకు బలమైన సారుప్యతలున్నాయి. వారి పాట ఎల్లెడలా రాజ్యంపై ధిక్కార స్వర పతాకమై ఎగిరింది. నాడు పల్లెటూరి పిల్లగాడ పాట వెట్టి చాకిరీ విముక్తికి జాతీయ గీతంలా ధ్వనిస్తే, నేడు అందెశ్రీ "జయజయహే తెలంగాణ" పాట రాష్ట్రగీతమై జ్వలించింది. ఏ తెలంగాణ సాధన కోసం పోరాడినాడో ఆ రాష్ట్రం సిద్ధించిన తర్వాత రాష్ట్రగీతం నుండి గుర్తింపు వరకు అనేక అవమానాలకు గురైనాడు. ఆ అవమానాల వల్లనే నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దగ్గరయ్యాడు. తనలాంటి కళాకారులకు సముచిత గౌరవం దక్కాలని కోరుకుని సాధించాడు. కానీ ఎవరూ ఊహించని విధంగా అమరుడైపోయాడు. అందెశ్రీ మరణం తెలంగాణ పాటకు, తెలంగాణ ప్రజలకు తీరని లోటు. అనాథలా బ్రతికి వచ్చిన ఆయన తెలంగాణ రాష్ట్రగీతం రాసే స్థాయికి ఎదిగిన ఆయన జీవితం ఆదర్శనీయం. అట్లాంటి అందెశ్రీ పాట ఉన్నంత కాలం బ్రతికే ఉంటాడు. జోహార్ అందెశ్రీ.


## 'కదంబం' (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)

**మూసీ మాసపత్రిక ప్రచురిస్తున్న ప్రత్యేక గ్రంథం (పరివర్ధిత ముద్రణం)**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు దాదాపు వంద సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**ఈ మాసంలోనే పరివర్ధిత ముద్రణ ఆవిష్కరణ జరుగుతుంది.**

ఆధ్యాత్మిక తత్వ దర్శిని శ్రీబాస ఎర్ర గంగారాం గారి

# ఆధ్యాత్మిక భావవీచికలు "ఆత్మానంద భజన సంకీర్తనలు"

**సుప్పని సత్యనారాయణ**, తెలుగు అధ్యాపకులు ఫోన్ : 9492626910

"తనను సృష్టించిన భగవంతుడిని ప్రసన్నం చేసుకుని శాశ్వతానందాన్ని పొందేందుకు జీవుడు చేసే ప్రయత్నమే భజనం. భజనం అంటే సేవించడం అని అర్థం. సేవ అనేక రూపాలలో ఉంటుంది. నవవిధ భక్తులలో పేర్కొనబడిన **"శ్రవణం, కీర్తనం, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం"** అనేవి మనిషిని భగవంతునికి అతి సమీపంలోకి తీసుకువెళ్లడానికి తోడ్పడుతాయి. **"సామీప్య భజన, సాలోక్య భజన, సారూప్య భజన, సాయుజ్యాలకు దారితీస్తుందని, భజన సంప్రదాయాన్ని అనుసరించి నిత్యం భగవన్నామ జపంతో పవిత్ర జీవులైన మహనీయులు ఎందరో భగవంతునిలో లీనమయ్యారు"** అన్న ఈ మాటలు మరెవరివో కావు. సుప్రసిద్ధ సాహితీవేత్త, అష్టావధాని, శిరోమణి, సంస్కృత ఆంధ్ర పండితులు, స్వర్గీయ డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారు ఆత్మానంద భజన కీర్తనలను ఉద్దేశించి అందించిన ముందుమాటలోని కొన్ని వాక్యాలు.

నిజామాబాద్ జిల్లా, వేల్పూరు మండలం, రామన్నపేట గ్రామ వాస్తవ్యులైన శ్రీ బాస నరసింహులు, ఎల్లమ్మ దంపతులకు 1923లో సం॥లో జన్మించారు శ్రీ బాస ఎర్ర గంగారం గారు. చిన్ననాటి నుండి ఆధ్యాత్మిక భావాలను ఉనికిపుచ్చుకున్న గంగారం గారు శ్రీ శ్రీ శ్రీ పరమహంస బాబాపూర్ రాజన్న యోగి గారి వద్ద శిష్యరికం అనగా ఉపదేశాన్ని స్వీకరించి అనేక భక్తితత్వాలను ఆపోశన పట్టినారు. తర్వాత చిన్నప్పటినుండి భక్తి తత్వ గీతికలను, చిన్నచిన్న పద్యాలను మరియు కీర్తనలను అల్లడం ప్రారంభించారు.

ఆత్మానంద భజన కీర్తనలు కేవలం ఆధ్యాత్మిక, భక్తి తత్వమునే కాక, మానవజీవన స్థితిగతులను, ధార్మిక, సామాజిక సంబంధమైన విషయాలను కూడా చెబుతున్నాయి అనడానికి ఉదాహరణకు ఈ పుస్తకం మొత్తాన్ని ఎత్తిచూపవలసి వస్తుంది. తర్వాత వారు రచించిన ప్రతి గీతంలో గురు పరంపర ఒక జీవన సందేశం గోచరిస్తుంది. ఆరంభంలో ఇష్టదేవతా స్తుతులను చేస్తూ, తాను చెప్పదలుచుకున్న ధోరణిని సూటిగా, కచ్చితంగా చెప్పే విధానంలో అనేక మార్గాలను ఎంచుకొని, తనదైన శైలిలో భజన కీర్తనలను రచించారు. ఇందులోని కీర్తనలన్నీ రచయిత స్వగ్రామమైన రామన్నపేట పురాంకితంగా రచించి, వారి ఇష్టదైవం, ఇలవేల్పు అయిన శ్రీ లక్ష్మీనరసింహస్వామికి అంకితం ఇవ్వడం జరిగింది.

రచయిత గంగారాం గారు కేవలం భజన ఆధ్యాత్మికతయే కాక, జానపద కళలైన యక్షగానం వంటి వాటియందు అద్భుతమైన స్త్రీ పాత్రలను పోషించి శ్రోతలను మెప్పించేవారు. అలాగే పౌరోహిత్యము, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతములను జరిపించుట, పంచాంగము జ్యోతిషం, వంటి వాటిలో కూడా మంచి నేర్పును కనబరిచి ఎన్నో సత్కార్యాలను చేస్తూ వాటికి మార్గదర్శిగా ముందుండి నడిపించినారు. అలాగే గ్రామంలో జరిగే ప్రతీ కార్యక్రమంలో ముందుండి సమకాలీకులైన రస హృదయయులకు వారి వాక్చాతుర్యం ద్వారా, రస చర్చల ద్వారా సహృదయులకు ఆనందమును కలిగించే వారు. అలా సాహితీ చర్చలలో భాగస్వాములై, వారి స్వగృహంలో అనేక అమూల్యమైన, ఆధ్యాత్మిక విషయాలను అందులోని మార్మిక విషయాలను గుర్తు చేసుకుని సంతృప్తి చెందేవారు.

**ఇక ఆత్మానంద భజన కీర్తనల గురించి చర్చించినట్లయితే...**

ఏ రచయిత నైనా తన రచనకు శ్రీకారం చుట్టేందుకు ముందు తన ఇష్టదైవాన్ని మరియు ఇలవేల్పును స్తుతించడం పరిపాటి. రచయిత శ్రీ ఎర్ర గంగారం గారు కూడా, కావ్య ఆరంభంలో శ్రీ గణాధిపతిని స్తుతిస్తూ చేసిన ప్రార్థన గీతం సరళ సుందరంగా ఉంటుంది. **"గణాధీప చూడు -కనులు తెరచి చూడు/ భజనాల సొంపు నేడు నేడు/భజనాల సొంపూ..నేడు.. నేడు!!"** అంటూ భలే మంచి రోజు సినిమా పాట మాదిరి ఈ గణాధిపని స్తుతి చేస్తూ ఈ తన భక్తి గీతములను అల్లడం మొదలుపెట్టారు రచయిత. బాసరమ్మను ఉపాసించిన రచయిత తన గదిలో ఉన్న భావజాలాన్ని, తనదైన శైలిలో అమ్మను స్తుతిస్తూ.. **"శ్రీ సరస్వతి బ్రోవుమా! – పద్మజ రాణి! దాసుని కవిగావుమా! /వ్రాసే కీర్తనలన్నీ చూసుకొనీవన్నీ – ఆశించియుంటిని దోషములుంచాకు!!"** అని పదకీర్తనాన్ని విన్న తర్వాత పద్మజరానిగా విలసిల్లే తల్లి వాణిని, తన రచనలకు మూలకారునివై తప్పొప్పులను సరిచేస్తూ నిత్యం ముందుకు నడపమని ఆ తల్లిని అనగా శ్రీ సరస్వతిని స్తుతి చేసే కీర్తనను రచించారు రచయిత. ఇందులో తన భక్తి తత్వవే కాదు, సహృదయతతో కూడిన వినయ విధేయతలు కూడా గోచరిస్తాయి.

ముందు ఎందరో మహనీయులు చెప్పిన తత్వమును తెలుపుతూ ఒక వీరబ్రహ్మేంద్రస్వామి, ఒక యోగి వేమన వంటి తత్వ యోగుల ప్రభావం రచయిత గారి పైన ఎంతగానో ఉన్నది అని చెప్పవచ్చు. అందుకే ఒక కీర్తనలో ఇలా అంటారు. **"ఆదే నాటకంబు – హంసనె – ఇదా పింగళంబు // జాడలు గనుకో వేడుకలినుకో/ పాదు దేహములో పరుగుడుచున్నది //" వచ్చి పోయే దారి – ఎవడో – ఇచ్చినాడు కోరి/ కచ్చితంగా కనివిని ఎరుగును / మచ్చిక తోడుతో**

**మార్గము దొరుకును!!"** నేను నీవే ఎరుంగుము అనే ఒక గొప్ప నానుడికి సిసలైన ఆనవాళ్లు ఈ కీర్తన. భగవంతుని దివ్య దర్శనాన్ని నువ్వు పొందాలంటే ముందు నిన్ను నువ్వు ఎవరో తెలుసుకో! అటు పిమ్మట గురుసాన్నిధ్యాన్ని మచ్చిక చేసుకుని పొందుమని చెబుతూ, తదనంతరం మార్గం కోసం ప్రయాస పడవలసిన అవసరం లేకుండానే మోక్షాన్ని పొందవచ్చును అని రచయిత ఇక్కడ సత్యాన్ని ఎరుక పరుస్తారు.

అన్ని జన్మల తర్వాత వచ్చిన ఈ మానవజన్మ ఎంతో అమూల్యమైనదని, ఇది పొందడమే దురలేవమని, ఈ జగమే బూటకం అనే కీర్తనలో **"మానవా! మరిచియుండబోకు – మరల జన్మం రాదు నీకు!!"** కావున జీవించి ఉన్నప్పుడే ప్రతిదీ తెలుసుకోమని, ఈ జన్మను సద్వినియోగపరుచుకొని ముక్తిని పొందమని రచయిత సందేశం ఇస్తారు... భక్తి ముసుగులో కొట్టుమిట్టాడుతున్న కొందరు మూఢాత్ములను, వారి నీచబుద్ధిని ఎండగడుతూ రచయిత ఒకచోట ఇలా పలికారు, **"రాళ్ళేల దైవమగును – రాగంబు నీది వినుమా! / కోళ్ళేటుల తెమ్మననును – కోసిన తినదు గదను!! / ప్రాణంబు లేని శిలలా – పాదాల పూజల వేలా! !!/ మానావసేవ అలలా – మాట్లాడ వైతె కలలా!!"** అని ఈ కీర్తనలు వింటే సిద్ధప్ప గారి **"రాతి బొమ్మల ఎదుట రాశిగా అన్నం – తినుమన్న ఆ రౌతు తినదురన్న"** అనే మాట గుర్తుకొస్తుంది. విగ్రహాల పేరుతో దైవారాధన చేస్తూ, కాలాన్ని, ధనాన్ని వృథా చేస్తూ, మానవీయ విలువలను మరచే కుహనా భక్త శిఖామణులకు, ఒక చిన్న చురకను అంటించారు రచయిత. ఈ సందర్భంలో మనకు ఆధునిక రచయితలు గుర్రం జాషువా చెప్పిన ప్రతిమల పెండ్లి సేయుటకు..పద్యం స్మరిస్తుంది. ఇక్కడ రచయిత హనుమాన్ ఎండగట్టే తీరు అద్భుతం.

కాలపరీక్షకు ఎవరైనా తలుక్కవలసిందే. విధి ఎంతటి వారినైనా వదిలిపెట్టదు. కాలగమనంతో నడక సాగించినప్పుడే మనిషికి మనుగడ ఉంటుంది అని చెప్పడానికి ఇక్కడ రచయిత కాల మహిమను గురించి చెబుతూ.. **"ఆలునెడవాసి అయోధ్య – హరిశ్చంద్రుడు – ఏలకాటికమ్ముడు బోయె మహావీరుడు!!"** అని కీర్తనాన్ని ఆలపించినప్పుడల్లా, కాలం గొప్పతనం ఎలాంటిదో చెప్పకనే తేటతెల్లమవుతుంది. కాలానికి మీనమేషాలు, భేషజాలు ఏమీ ఉండవు. చంద్రమతికి జరిగిన అవమానం, ద్రౌపదికి జరిగిన పరాభం, ఇవన్నీ కాల జోక్యం వల్లనే. ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని చెబుతూ, పౌరాణిక ఘట్టాలను ఉదాహరించాడు రచయిత.

గురుస్మరణను, గురు సహవాసాన్ని పొందని కొందరు మూర్తులు ఏ విధంగా గురుని సన్నిధిని చేరుకోవాలి అని కోరుకుంటారో అత్యంత చమత్కారమైన ఈ గీతంలో ఇలా చెబుతూ ఉంటాడు రచయిత.

**"పాలలా గురుని గ్రౌవులు – పెరుగులా గురువు గూఢార్థం రాలు! చల్లలా మా మనసును నిత్యం తెల్లగా ఉంచు"** అంటూ లోక సంబంధమైన విషయాలతో ప్రస్తావిస్తూ, చక్కని పోలిక చెప్పారు రచయిత. ఇది తత్వ కీర్తనలు చివరన **"రామన్నపేటలున్నా – వారంతా మీరుండన్న! నా మాట మీరు విన్న– నరులకు దండమిదుగో!!"** అని సవినయ పూర్వక వాక్యాలను అందరికీ శరణు కోరుతూ వినుమని అభ్యర్థిస్తారు రచయిత.

ఇక కవిగా, రచయితగా, తన రచన వ్యాసంగాన్ని గుర్తు చేసుకుంటూ, కవి యొక్క గొప్పతనాన్ని, కవిత్వం యొక్క వైభవాన్ని, పాఠక లోకానికి తెలియపరుస్తూ ఎవరు కవిత్వమును పసిగట్టరో, అలాంటివారికి ఎరుక పరుస్తూ రసగుదలకు ఆనందపరుస్తూ... **"కవితా ఆనందము ఘనము – అది భువిలో ప్రజలకు ధనము // అవనిలో అందరూ వేడియు హరి గుణ – శ్రవణము చేసి చెవులతో విందురు!! మరణమైతవా భూమిలో – నీ పేరు దలతురు కవిలో / ఉరుము మెరుపుల – రగడ సొగసుగా / సురులు మునులు నిను – తలచుకుందురు!!"** ఇక్కడ గుర్రం జాషువా గారి రాజు – కవి స్తుతి పద్యాలు గుర్తుకు వస్తాయి. "సుకవితా యజ్యస్తే రాజ్యేన కిమ్" అని భర్తృహరి చెప్పినట్లు, మంచి కవిత ముందు రాజులు గాని, రాజ్యాలు గాని దాసోహం అనవలసిందే. అవి ఏమీ కూడా పనికిరావు. కావున కవితానందము అంటే ఇంత కాదు అది ఘనము. కావున ముందటి భవితకు మూలము దెలిపిరి అనే మాట జగమెరిగిన సత్యం. లోకోపకారాన్ని కోరేవాడు, జన హితాన్ని కోరుకునే వాడు లోకంలో కేవలం కవి ఒక్కడే. అతనికి సాటి మరొకటి లేదు అంటూ తన కవిత వైదుశ్యాన్ని, కవి గొప్పతనాన్ని ఇంత రమణీయంగా కీర్తించారు రచయిత గంగారాం గారు.

ఇలా రచయిత అడుగడుగునా సామాజిక అంశాలను ఎండగట్టడమే కాదు, తను అనుభూతి చెందిన ప్రతి అంశాన్ని భజన సంకీర్తనలో ఒదిగింపజేశాడు. అందుకు తార్కానంగా ఒకచోట "కేశవా! నారాయణా!" అంటూ స్తుతిస్తూ.. "గరుడ వాహన రారా!" అంటూ మరొకచోట "మడిగడితే మైల పోదు." అంటాడు. ఇంకోచోట సంసార జీవన విధానంలో నేడు కుమారుల ప్రేమ ఎట్లా తయారయిందో చెబుతూ "తల్లిదండ్రులు దయ్యాలా?" అంటూ నేటి పుత్రుల తీరును నిలదీస్తాడు. అలాగే జీవనపర్యంతం సంసారాన్ని వెల్లదీసి తుదకు అంత్య కాలంలో ఏ విధంగా గడుపుతూ... "తయారైనది బొమ్మ! ఇది పోయేది ఎన్నడో నమ్మ //– ప్రయాణమైనది నలుగురిపై – నయా పైసా రాదెంబడి నీతో//" అనే ఒక భరతత్వాన్ని ఎరుకు పరుస్తారు రచయిత. ఈ కీర్తనలో మానవజీవన బ్రతుకుచిత్రం మొత్తం తెరకెక్కించడం జరిగింది.

రచయిత తాను ఎంచుకున్న కీర్తనలను భజన సాహిత్యంలో ఉపయోగించే దరువులు, రాగాలు, తాళాలను గుర్తు చేస్తూ అల్లిన

కీర్తనం నిజంగా అద్భుతం. భజనలు ఆదితాళం, ఆట తాళం, జుల్వతాళం,జంపెతాళం,రూపకతాళం వంటి తాళాలను ప్రయోగిస్తూ పాటలను అల్లడం అనేది పరిపాటి. ఆ పాటను ఒకసారి గమనిస్తే...

పల్లవి :

**ఆటతాళమా నందమురా – హరి – పాటలు పాడ కనుందమురా!**
**ఏకతాళమా నందమురా – ఇక – లోకనాథుని కందమురా!**
**జులువ తాళమా నందమురా – హరి – కలువక పోయితెను పందమురా!**
**రూపక తాళము పాడెదము – హరి – కోపముకున్నను వేడెదము!**
**ఆదితాళము పాడెదము – హరి – దేవాలయములో వేడెదము!!**

ఇంత రమణీయంగా ఏ సంకీర్తనకారుడు తానురాసిన అనగా ఉపయోగించిన తాళ ప్రమాణాల గురించి వ్రాయలేదు అంటే అతిశయోక్తి గానేరదు. ప్రతి రచనలు రచయిత శ్రీ ఎర్ర గంగారం గారు జీవించిన కాలంలో వ్యవహార భాషకే పట్టంకట్టి, సామాన్య జనులకు సైతం కవిత్వాన్ని మరియు దాని సారాన్ని అదేవిధంగా చేసి సఫలీకృతులయ్యారు.

రచయిత 1980–89 మధ్య సుమారు 10 సంవత్సరాల కాలంలో చేసిన ఎక్కువ రచనలను, రచయిత తేదీ 23–.5–1996న స్వర్గస్థులైన తర్వాత, వారి కుమారులు శ్రీ బాస కాశీరాం గారు, తండ్రి గారి సాహితీ వారసత్వమును పునికి పుచ్చుకుని, వారు కూడా కొన్ని రచనలను చేస్తూ, తండ్రి ద్వారా ప్రేరేపితులు అయ్యారు. తదనుగుణంగా తండ్రిగారి ఆశయ సాధన కోసం వారి రచనలను ఏర్చికూర్చి 2018 డిసెంబర్ నెలలో ఈ ఆత్మానంద భజన కీర్తనలను ముద్రితం చేయడం జరిగింది.

శ్రీశ్రీశ్రీ పరమహంస భాజ రాజన్న గురువుగారికి అంకితం ఇవ్వబడిన ఈ గ్రంథానికి, ఆచార్య కసిరెడ్డి గారు పరిష్కరించడంతో పాటు అమూల్యమైన పీఠికను కూడా అందించారు. అదే వరుసలో శిరోమణి డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ గారు, డాక్టర్ బిజుగామ రామమూర్తి గారు, గణపురం దేవేందర్ వంటి సాహితీ వ్యక్తులు సురచిరమైన పీఠికలను అందించి ఈ సంకీర్తనలు ప్రాశస్త్యాన్ని పెంచడంతోపాటు, పుత్తడికి తావి అద్దినట్లు అయ్యింది.

ఆత్మానందం కు పరాకాష్టగా నిలిచిన ఈ సంకీర్తనలు కేవలం రామన్నపేట లోనే కాక, ఉమ్మడి ఇందూరు జిల్లాలో గల పరిసర ప్రాంతాలలో నేటికీ భజన కార్యక్రమాల యందు ఆలపిస్తూ ఉంటారు. ఇంత గొప్ప సంకీర్తనలకు శ్రీకారం చుట్టిన స్వర్గీయ భాష ఎర్ర గంగారాం గారు సదాస్మరణీయులు. వారి కుమారులు ఈ పుస్తకాన్ని పాటకు ప్రియులకు అందజేసిన శ్రీ బాస కాశీరాం గారు ధన్యులు.

❖ ❖ ❖ ❖ ❖

## భయం భయం



ఆవహించిన నిశ్శబ్దములో
అలుముకున్న భయం నీడ
బుసలు గొట్టి విషనాగులు
పొరజూస్తు కోర చాచి
పొంచి యున్నవి ఒక వంక
యుద్ధభేరీ శబ్దాలతో
బ్రద్దలయ్యే భూభాండం
దద్దరిల్లే ప్రతిధ్వనులు
వినిన విశ్వమాత గుండె
విలపించిన వినేదెవరు?

నరహంతక ధరపతులు అణుబాంబులతో ఆడుకుంటే
మానవాళి మరుభూమి మంటల్లో మాడుతుంటే
మసిబారిన మసి మబ్బులు విషజ్వాలలు కురిపిస్తే
వికసించక ఈ విశ్వం విలపించిన విషాదం

దివి చెక్కలు భువి ముక్కలై
దిక్కులన్ని పెక్కుటిల్లగా

అగోచరమైన అరుపుల మెరుపులతో
అవని స్తంభిస్తుంది శాంతి దహిస్తుంది
ప్రతిజ్ఞలను మానుకోండి
ప్రపంచాన్ని ఆదుకోండి. (అందెల సందడి... నుండి)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 2 (56) హైదరాబాద్ డిసెంబర్ : 2025

# మూసీ మాస పత్రిక – తెలుగు సాహిత్య ప్రవాహానికి సజీవ ప్రతిరూపం

**డా. ఇడికోజు శ్రీనివాసాచారి,** తెలుగు అధ్యాపకులు, ఫోన్ : 988 534 9305

తెలుగు సాహిత్య పత్రికల చరిత్రలో "మూసీ" అనే పేరు ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకుంది. ఈ పత్రిక కేవలం సాహిత్య పత్రిక కాదు ఇది ఒక ఉద్యమం, ఒక ఆలోచన, ఒక నది వంటిది. భాషకు, సాహిత్యానికి, చరిత్రకు, సాంస్కృతిక భావజాలానికి అంకితమైన ఈ మాసపత్రిక హైదరాబాదు నగరంలో 1980 లో పుట్టి, తెలుగు సాహిత్య, భాషాభిమానుల హృదయాలలో ప్రవహిస్తోంది.

'మూసీ' అనే పేరు కూడా అంతే సార్థకం. హైదరాబాదుకు జీవనాధారమైన మూసీ నది లాగే, ఈ పత్రిక తెలుగు సాహిత్యానికి ప్రాణాధారం అయింది. 'మూసీ' పత్రిక స్థాపకుడు శ్రీ బి.ఎన్.శాస్త్రి (భిన్నూరి నరసింహశాస్త్రి) గారు. తెలుగు సాహిత్యానురాగి, శాసన పరిశోధకుడు, చింతనాత్మక రచయిత, చరిత్ర రచయిత, సమాజ చైతన్యవాది అయిన ఆయన ఈ పత్రికను సృష్టించిన ఉద్దేశ్యం అత్యంత ఉన్నతమైనది. **"తెలుగు సాహిత్యం ప్రజల నడుమ జీవించాలి, భాషలో సౌందర్యం మాత్రమే కాదు, సామాజిక చైతన్యం కూడా కలగాలి."** ఈ ఆలోచనే మూసీ పత్రికకు పునాదిగా నిలిచింది. శాస్త్రి గారు సాహిత్యాన్ని కేవలం వినోదంగా కాకుండా, సామాజిక మార్పు సాధనంగా చూశారు. ఆయన తాత్విక దృష్టిలో "మూసీ" పత్రిక ఒక నదిలా ఎడారిలోనూ, అరణ్యంలోనూ, నగరంలోనూ ప్రవహించే సాహిత్య ధార. "మూసీ" అనే పేరు ఎంచుకోవడంలో ఉన్న తాత్పర్యం ఎంతో లోతైనది. హైదరాబాదు నగరానికి సాగునీరు ఇచ్చి, జీవంతో నింపిన మూసీ నది లాగే, ఈ పత్రిక కూడా తెలుగు భాషను ఆలోచనలతో, జ్ఞానంతో, సాహిత్య స్రవంతితో నింపే ప్రయత్నం చేస్తోంది.

భాష, సంస్కృతి, చరిత్ర, ఆధునికత అన్నీ ఈ పత్రికలో ఒకే చోట కలుస్తాయి. అందుకే దీని నినాదం – **"చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక"** అంటే తెలుగు పఠన సంస్కృతికి వెలుగు నింపుతున్న అరుదైన పత్రిక ఇది. ప్రతి సంచికలోనూ జ్ఞానం, జ్ఞాపకం, జవాబు కలిసిన విలువైన రచనలు ఉంటాయి. కాలం మారినా పాఠకుల మనసులో నిలిచిపోయే చింతనాత్మక వ్యాసాలు, సాహిత్య సమీక్షలు, సమాజాన్ని స్పృశించే కథలు, కవితలు, ప్రజాసంస్కృతిని ప్రతిబింబించే విశ్లేషణలు ఈ మాసపత్రిక ప్రత్యేకత. ఇది 'చదివి దాచుకోదగ్గ పత్రిక'గా పాఠకుల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. ప్రతి పేజీ ఆలోచనకు ఆహ్వానం, ప్రతి సంచిక ఒక విలువైన సేకరణ. కాలక్రమంలో ఇది కేవలం పత్రికగా కాకుండా తెలుగు చింతనకు చిరునామాగా మారింది. ఈ పత్రికను ఒక్కసారి చదివితే ఆలోచింపజేస్తుంది, రెండోసారి చదివితే కొత్త అర్థాలు ఇస్తుంది. అందుకే ఇది పాఠకుని పుస్తకశాలలో శాశ్వతంగా దాచుకోదగిన పత్రిక.

మూసీ పత్రిక విజయానికి వెనుక ఉన్న ప్రధాన శక్తి దీని సంపాదక వర్గం.. ప్రధాన సంపాదకులు ఆచార్య సాగి కమలాకర శర్మ గారు. సాహిత్యపరిజ్ఞానం, భాషా శైలీ, సంపాదక ధోరణి కలయికగా నిలిచిన సాహిత్యవేత్త. ఆయన మార్గదర్శకత్వంలో "మూసీ" పత్రిక ఒక ఆధునిక దిశలో సాగుతోంది. కథలు, కవితలు, వ్యాసాలు, విమర్శలు మాత్రమే కాదు భాషా తాత్వికత, సాంస్కృతిక అంశాలు, శాసనాల పరిశోధన, సమకాలీన సామాజిక సమస్యలు వంటి విభిన్న రంగాలపైనా ఈ పత్రిక విశాలమైన వేదికను కల్పిస్తోంది. ఇది యాదృచ్ఛికం కాదు. సంపాదకుని దూరదృష్టి, పరిశీలనాత్మక దృక్పథం, తెలుగు సాహిత్యానికి ఉన్న అంకితభావం కారణంగానే ప్రతి సంచిక ఒక పరిశోధనాత్మక పత్రంగా రూపు దిద్దుకుంటుంది.

సహసంపాదకులు డా. దత్తయ్య అట్టెం పరిశోధనాత్మక దృష్టితో, సాహిత్య విశ్లేషణతో పత్రికను మరింత శాస్త్రీయ స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి. పరిశోధక వర్గం, విద్యార్థి వర్గం, సాహిత్యరసికులు అందరినీ కలిపే వేదికగా పత్రికను మలిచారు. డా. భిన్నూరి మనోహరి గారు పత్రిక ప్రచురణా బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పత్రికా ప్రచురణ అంటే కేవలం ముద్రణ ప్రక్రియ కాదు. సమయపాలన, నాణ్యతా నియంత్రణ, ప్రతీ రచన సక్రమంగా పాఠకుల ముందుకు చేరేలా చూసే నిర్వాహణా నైపుణ్యం కలిగిన కర్తవ్యంగా ఉంటుంది. ఆ కర్తవ్యాన్ని మనోహరి గారు విశేషమైన శ్రద్ధతో, సాహిత్యాభిమానంతో నిర్వర్తిస్తున్నారు. ప్రతి సంచిక సమయానికి వెలువడేందుకు, పత్రిక నాణ్యత కాపాడబడేందుకు, పాఠకుల నమ్మకం నిలవాలనే దృఢ సంకల్పంతో ఆమె కృషి కొనసాగుతుంది. సంపాదక మండలి, రచయితలు, ముద్రణా విభాగం, పంపిణీ వ్యవస్థ అన్ని భాగాలను సమన్వయపరచడంలో ఆమె చూపే శ్రద్ధ, వివేకం, పాలనా నైపుణ్యం విశేషం. డా. భిన్నూరి మనోహరి గారి వల్లే ఈ పత్రిక శ్రద్ధ, సమయపాలన, సమన్వయత అనే మూడు మూలస్థంభాలపై నిలిచి, ప్రతి సంచికను పాఠకుల ముందుకు నాణ్యతతో కూడిన సాహిత్య సేకరణగా తీసుకువస్తోంది.


ముద్రణలో నాణ్యత, రూపకల్పనలో ఆకర్షణ, పాఠక మైత్రి ఇవన్నీ కలిసి పత్రికను చదవదగినదిగా నిలబెట్టాయి. మూసీ పత్రిక ప్రతీ నెలా ఒక సాహిత్య పండుగగా ఉంటుంది. ప్రతి సంచికలో కథలు, కవితలు, సమీక్షలు, నాటకాలు, పుస్తక పరిచయాలు, సాంస్కృతిక

వ్యాసాలు, చరిత్ర, శాసనాల వివరణ ఉంటాయి. సాహిత్య ప్రస్థానంలో కొత్త రచయితలకు ప్రోత్సాహం ఇవ్వడం దీని ప్రధాన లక్షణం. తెలుగు భాషలో రచనా శక్తిని, నైజాన్ని, ఆలోచనా స్వేచ్ఛను మేలుకొలుపుతోంది.

'విశ్లేషణాత్మక వ్యాసాలు', 'విమర్శ', 'జానపద పరిశోధన', 'స్త్రీ సాహిత్యం', 'అనువాద రచనలు'... అన్నీ సమాన ప్రాధాన్యంతో చోటు పొందుతాయి.

ఈ పత్రికను ప్రతీ నెలా 20 రూపాయల ధరతో విక్రయిస్తారు. సంవత్సర చందా రూ. 200/– కాగా, శాశ్వత సభ్యత్వం రూ. 2500/– (పది సంవత్సరాలు మాత్రమే)గా ఉంటుంది.

తెలుగు భాషను శాస్త్రీయంగా, సౌందర్యపూర్వకంగా వినియోగించడంలో పత్రిక ముందుంది. జాతి, కులం, వర్గం, లింగం అనే బేధాల్ని దాటించి మానవతా దృక్పథం పెంచుతుంది. పరిశోధకులు, ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులకు, విద్యార్థులకు పాఠ్యపరంగా ఉపయోగపడే సాహిత్య వ్యాసాలు ప్రచురిస్తారు. పాఠకులు, రచయితలు, సంపాదకులు ఈ ముగ్గురి మధ్య ఒక మానవీయ బంధాన్ని ఏర్పరచింది. మూసీ పత్రిక పాఠకులను కేవలం వినియోగదారులుగా కాకుండా సహరచయితలుగా చూస్తుంది. రచనలను పంపేవారికి మార్గదర్శకత్వం, ప్రోత్సాహం, మరియు సవరణల సూచన ఇవ్వడం దీని సంప్రదాయం. మూసీ పత్రిక తెలుగు పఠన సంస్కృతిని బలోపేతం చేసింది. టెలివిజన్, సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేటి కాలంలో కూడా పాఠకులను సాహిత్య



బి.ఎన్. శాస్త్రి

పఠనానికి తిరిగి రప్పించింది. ఇది కేవలం పత్రిక కాదు భాషా చైతన్యం, సాంస్కృతిక చైతన్యం, మానవతా భావజాలం కలయిక.

భవిష్యత్‌లో "మూసీ" పత్రిక తెలుగు డిజిటల్ ప్రపంచంలో కూడా విస్తరిస్తోంది. వెబ్‌సైట్, ఈ–పత్రిక రూపంలో యువతను సాహిత్యం వైపు మళ్లించే ప్రణాళికలు కొనసాగుతున్నాయి. తెలుగు భాషను భవిష్యత్ తరాలకు చేరవేయడం దీని ప్రధాన ధ్యేయం.

మూసీ పత్రిక తెలుగు సాహిత్య ప్రపంచంలో ఒక దీపస్తంభం. సాహిత్యం ద్వారా మనిషిని మానవత వైపు నడిపే ఆలోచన ఇది.

భాషను ప్రేమించే ప్రతి ఒక్కరి చేతిలో ఈ పత్రిక ఉండాలి.

మూసీ నది ఎప్పటికీ ఎండిపోనట్లే మూసీ పత్రిక కూడా తెలుగు సాహిత్య స్రవంతిలో ఎప్పటికీ ప్రవహిస్తూనే ఉంటుంది.

❖ ❖ ❖ ❖ ❖


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/– (అసలు 500/–) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**
**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే
ఉత్తమ గ్రంథం **'కదంబం'**.
**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/–**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -29 : సంచిక - 2  హైదరాబాద్ డిసెంబర్ : 2025

# పరిశోధన + గ్రంథరచన + మార్గదర్శనం = ఆచార్య జి. అరుణకుమారి

**డా. జడా సుబ్బారావు,** తెలుగు అధ్యాపకులు, నూజివీడు, ఫోన్ : 9849031587

ఆచార్య జి. అరుణకుమారి గారు నిరాడంబరానికి నిలువెత్తు ప్రతీక. నిండైన చీరకట్టులో కనిపించే తెలుగుదనపు పతాక. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆచరణశీలి. ఎవరినైనా సాదరంగా ఆహ్వానించి, ఆదరంగా వెన్నుతట్టే ఆత్మీయ బంధువు. వారి ఇల్లెప్పుడూ పరిశోధకులతోనూ, రచయితలతోనూ, ఆత్మీయులతోనూ కళ కళలాడుతుంటుంది.

డా. జి. రామిరెడ్డి, శ్రీమతి నారాయణి దంపతులకు 1957లో రాజమండ్రిలో జన్మించి 'ఇంతింతై వటుడింతై' చందంగా ఎదిగిన విద్యాధికురాలు. తత్వవేత్తగా, వినోబాబావే భూదానోద్యమానికి భూమిని దానం చేసిన భూదాతగా, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రసిద్ధులైన ఆచార్య వెదిరె నారాయణ కరణ్ రెడ్డిగారి కుమారుడు వెదిరె చైతన్య కరణ్ రెడ్డిగారిని వివాహమాడి ఆ ఇంటి కోడలుగా హైదరాబాదులో స్థిరపడ్డారు. వీరికి కుమార్తె వెదిరె సూక్ష్మ, అల్లుడు రెడ్డిగారి నారాయణబాబు, మనవరాలు గార్గి ఉన్నారు.


ఆచార్య అరుణకుమారి గారికి మద్రాసుతోనూ ఎంతో అనుబంధము ఉంది. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని మద్రాసు టీ నగర్ లోని శ్రీ రామకృష్ణ పరమహంస శ్రీ శారదా విద్యాలయంలో అభ్యసించారు. ఆ తర్వాత ఎం.ఏ తెలుగు కోర్సును మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి పూర్తిచేశారు. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, తమిళ భాషల్లో అనర్గళంగా ప్రసంగించగలరు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సంస్కృతం, ఫిలాసఫీలలో ఎం.ఏ కోర్సును పూర్తి చేశారు. 1981లో ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారి పర్యవేక్షణలో "స్వాతంత్ర్యానంతర తెలుగు కవులపై శ్రీ అరవింద తత్వ దర్శన ప్రభావం" అనే అంశంపై ఎం.ఫిల్ పట్టా పొందారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఏర్పడిన తర్వాత ఎం.ఫిల్ చేసిన మొదటి విద్యార్థిని ఆచార్య అరుణకుమారి గారే. ఆ తర్వాత 1986వ సంవత్సరంలో "ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం – విభిన్న ధోరణులు" అనే అంశంపై పిహెచ్.డి పట్టాను పొందారు. "ఆధునిక తెలుగు కవిత్వం – భవిష్యద్దర్శనం" అనే అంశంపై




బరంపూర్ యూనివర్సిటీ నుంచి 2007లో డి.లిట్ పట్టా పొందారు. డి.లిట్ పట్టా పొందిన మొదటి మహిళ ఆచార్య అరుణ కుమారి గారే కావడం విశేషం. విద్యార్థినిగా చేరిన కాలాన్ని కలిపి లెక్కిస్తే మొత్తం 42 సంవత్సరాలు, అందులో ఉద్యోగినిగా 36 సంవత్సరాలు జీవిత కాలం హైదరాబాద్ విశ్వవిద్యాలయంతో ముడిపడి ఉండడం విశేషం.

విద్యనభ్యసించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో 1991లో యూజీసీ రీసెర్చ్ సైంటిస్ట్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం రీడర్‌గా, ఆచార్యులుగా తెలుగుశాఖ అధ్యక్షులుగా పనిచేశారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రానికి అధ్యక్షులుగా, కోఆర్డినేటర్‌గా పనిచేసి తెలుగు అభివృద్ధికి కృషి చేశారు. ఈ క్రమంలోనే అధ్యయన కేంద్రం, తెలుగుశాఖ సంయుక్తంగా ఏడురోజుల పాటు నిర్వహించిన శిక్షణా శిబిరంలో వరబ్రహ్మాశాస్త్రి, శ్రీరామచంద్రమూర్తి, ఈమని శివనాగిరెడ్డి, అవధానం ఉమామహేశ్వర శాస్త్రి, ఏకాంబరాచార్యులు, సూర్యకుమార్, జితేంద్ర బాబు వంటి శాసన అధ్యయన రంగంలోని నిష్ణాతులు పాల్గొని విద్యార్థులకు ఆసక్తిని, అవగాహనను కలిగించారు. బాలసాహిత్యం మీద పదిరోజుల శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు.





ఆచార్య జి. అరుణకుమారి గారికి విద్యార్థులంటే ఎంతో వాత్సల్యం. ప్రతీ విద్యార్థిని ఎంతో ఆప్యాయంగా పలకరించి యోగ క్షేమాలు విచారించడం వారి ప్రత్యేకత. తల్లి తన బిడ్డలను దగ్గర కూర్చోబెట్టుకుని అన్నం తినిపించినట్లుగా, పరిశోధక విద్యార్థులను దగ్గర కూర్చోబెట్టుకుని సిద్ధాంత గ్రంథ రచనలో మెలకువలు నేర్పుతారు.

ఎం.ఏ విద్యార్థులకు ప్రాచీన, ఆధునిక సాహిత్యాలతో పాటు సంస్కృత సాహిత్యాన్ని, లిపి పరిణామాన్ని, శాసన అధ్యయన ఆవశ్యకతను పాఠ్యాంశాలుగా బోధించారు. వివిధ భాషలతో పరిచయం ఉండడం వల్ల ఎంతోమంది పరిశోధక విద్యార్థుల చేత తులనాత్మక సాహిత్యంలో పరిశోధనలు చేయించారు. పరిశోధక విద్యార్థుల సిద్ధాంత గ్రంథాలు సమగ్రంగా రూపుదిద్దుకోవడంలో విద్యార్థులకు ఎంతో సహకరిస్తారు.





ఉత్తమమైన శీర్షికలతో ఎం.ఫిల్, పిహెచ్.డి, డి.లిట్ పూర్తిచేసిన ఆచార్య అరుణకుమారి గారు తన దగ్గర చేరే విద్యార్థుల చేత కూడా ప్రామాణిక పరిశోధనలు చేయించారు. వారి పర్యవేక్షణలో ప్రాచీన, ఆధునిక సాహిత్యాలతో పాటు జానపదం, వ్యాకరణం, అనువాదం, విమర్శ, శాసన అధ్యయనం మొదలైన అంశాలపై పరిశోధన చేసి సుమారు 22 మంది పిహెచ్.డి డిగ్రీలను, 38మంది ఎం.ఫిల్ డిగ్రీలను, ఐదుగురు పీడిఎఫ్ డిగ్రీలను పొందారు.

కేవలం పరిశోధకురాలిగానే కాకుండా ఉత్తమ ప్రామాణిక గ్రంథ రచయితగా, సంపాదకురాలిగా కూడా ఖ్యాతి పొందారు. పుష్పసందేశం, వ్యాస మధూలిక, ఋగ్వేద రహస్యం, భారతీయ సంస్కృతి –చరిత్ర (రెండు సంపుటాలు), శ్రీ అరవిందుల సాహిత్యం – ప్రతీకలు అనే గ్రంథాలను రచించారు. ప్రాచీన తెలుగు సాహిత్యం పరిణామ వికాసం అనే గ్రంథానికి సంపాదకత్వం వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక జాతీయ సదస్సులు నిర్వహించి పుస్తకాలు ముద్రించారు. ప్రత్యేకించి తెలంగాణ సాహిత్య అకాడమీ వారి సారథ్యంలో రూపు దిద్దుకున్న "శాతవాహనుల నుంచి కాకతీయుల వరకు", "కాకతీయుల నుంచి అసఫ్ జాహీ"ల వరకు ఉన్న "తెలంగాణ చరిత్ర – సంస్కృతి, సాహిత్యం" సంకలనాలకు వీరు సంపాదకత్వం వహించారు. వీరు ఆకాశవాణిలో చేసిన ప్రసంగాలను ఎమెస్కో వారు 'మన తెలుగు' పుస్తకంగా ప్రచురించారు. ఈమని శివనాగిరెడ్డి గారు రాసిన "మీరూ శాసనాలు చదవొచ్చు" అనే పుస్తకానికి విలువైన ముందుమాట రాశారు. ఎన్నో పరిశోధక వ్యాసాలు, గ్రంథ సమీక్షలు రాశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని ప్రామాణిక పరిశోధనా పత్రాలు సమర్పించారు. పీఠికలతో పాటు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలకు సంపాదక బాధ్యతలు వహించారు.




విస్తృత పఠనాన్ని విరామం లేకుండా కొనసాగించే ఆచార్య అరుణకుమారిగారు పదవీ విరమణ తర్వాత కూడా "తెలంగాణ శాసనాలు – సామాజిక, సాంస్కృతిక, భాష, సాహిత్య అధ్యయనం" అనే పుస్తక రచనలో నిమగ్నమయ్యారు. తెలంగాణకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, శిలాశాసన శాస్త్రవేత్త, కవి, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ బి.ఎన్.శాస్త్రి (భిన్నూరి నరసింహ శాస్త్రి) పురస్కారాన్ని ఆచార్య అరుణకుమారి గారికి ప్రదానం చేయడం ఎంతో అభినందనీయం. పరిశోధకురాలిగా, గ్రంథ రచయితగా, పర్యవేక్షకురాలిగా, సంపాదకురాలిగా ప్రఖ్యాతులైన ఆచార్య అరుణకుమారి గారు మరిన్ని ఉత్తమ పురస్కారాలు పొందాలని కోరుకుంటున్నాను.



# శ్రీ బి.ఎన్.శాస్త్రి పురస్కారం - 2025

ప్రముఖ చరిత్ర, శాసన పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు శ్రీ భిన్నూరి నరసింహ శాస్త్రిగారి పురస్కారం 2025 సంవత్సరానికి ఆచార్య జి. అరుణ కుమారి గారికి ఇవ్వబడుతుంది.



ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం ఈ పురస్కార ప్రదానం డిసెంబర్ 10వ తేదీన స్థానిక ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న సురభారతి వేదికగా జరుగుతుంది.

ఈ పురస్కారం అందుకున్నవారిలో ఆచార్య రవ్వా శ్రీహరి, డా. కూరెళ్ళ విఠలాచార్య, శ్రీభాష్యం విజయ సారథి, వైద్యం వేంకటేశ్వరా చార్యులు, శ్రీ గుంజి వెంకటరత్నం, శ్రీమాన్ రంగ రామానుజాచార్య వంటి ప్రసిద్ధులు ఉన్నారు.

ఆచార్య జి. అరుణకుమారి గారు అటు తెలుగు సాహిత్యంలోను, భాషా సంబంధమైన అంశంలోను, చరిత్ర, శాసనాలలో విశేషమైన కృషి చేసినారు, చేస్తున్నారు.

అరుణకుమారిగారు చేస్తున్న ఈ కృషికి మా వంతు ప్రోత్సహంగా ఈ పురస్కారాన్ని అందజేస్తున్నాము.

---

# బాకి



డా. ఎన్. గోపి
ఫోన్ : 939 102 8496



కాఫీ టైం లో
కళ్ళు మూసుకొని
నా కవిత్వం వినేదానివి
ఎక్కడ ఆపాలో తెలిసిన
భావుకురాలివి.
కొన్ని ప్రయోగాలకు
చికిలి పట్టేదానివి.

పేదవాడిని
ప్రేమించి పెళ్ళి చేసుకున్నావు
నా కెరీర్ కోసం
నీ కెరీర్‌ను వాయిదా వేశావు
నా ఒక్కడి అభ్యున్నతి
మనిద్దరి జీవన గతి.

పరిశోధన కోసం
నేను ఊళ్ళు తిరుగుతున్నప్పుడు
నెలల పాటు
ఒక్కదానివే ఇంట్లో ఉండే దానివి
కానీ ఇప్పుడు నువ్వు లేక
నాకు భయమే తోడయ్యింది.


విశ్వనాథ
దువ్వూరి రామిరెడ్డి
జాషువా, పింగళి లక్ష్మీకాంతం
నాయిని సుబ్బారావు
ఆత్మీయుల ఎడబాటుతో
దు:ఖపు ముద్దలయ్యారు
అనుభవానికొస్తే తప్ప
ఏదీ అర్థం కాదు.

నీకు జీవితాన్నే
అప్పు పడ్డాను
బాకీ తీరుస్తాననేమో
చెప్పకుండా
వెళ్ళిపోయావు.


❖ ❖ ❖ ❖ ❖

## స్వీకృతి






**కొత్త తెలంగాణ శాసనాలు**
శాసన పరిష్కరణ : శ్రీరామోజు హరగోపాల్
వెల : 300/-
ప్రతులకు : పుట్టా పుస్తక శిబిరం, ఆలగడప, మిర్యాలగూడ - 508 207
ఫోన్ : 98480 15364




**తెలంగాణ వాచకాలు విశిష్టత**
బి.ఎస్. రాములు
వెల : 150/-
ప్రతులకు : విశాల సాహిత్య అకాడమీ, 201, సులేఖ గోల్డెన్ టవర్స్, 2-2-186/53/5, ఆర్కె నగర్, బాగ్ అబర్ పేట,, హైదరాబాదు - 500 013.



**నవ్య కథాశిల్పి బి.ఎస్.రాములు కథా విశ్లేషణ**
విహారి
వెల : 160 /-
ప్రతులకు : విశాల సాహిత్య అకాడమీ, 201, సులేఖ గోల్డెన్ టవర్స్, 2-2-186/53/5, ఆర్కె నగర్, బాగ్ అబర్ పేట,, హైదరాబాదు - 500 013. ఫోన్ : 8331966987



**తెలంగాణ ఉద్యమంలో ఎదురైన సవాళ్ళు - సమాధానాలు**
డా. వి. శంకర్
వెల : 80 /-
ప్రతులకు : శ్రీ సాయి వెంకటరమణ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, చిక్కడపల్లి, హైదరాబాద్.
ఫోన్ : 96767 99500



**ఢంకా ధ్యానం (లఘుకవిత్వం)**
ఎస్. ఆర్. పృథ్వి
వెల : 60 /-
ప్రతులకు : పి. ఉషారాణి, 104-6-140, ఎం.జి. స్ట్రీట్, రామకృష్ణ నగర్, రాజమహేంద్రవరం - 533 101.
ఫోన్ : 99892 23245


## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,**
**బతుకమ్మకుంట, బాగ్అంబర్పేట,**
**హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**



**వాట్సాప్ వార్ (కథల సంపుటి)**
నిదానకవి నీరజ
వెల : 150 /-
ప్రతులకు : రచయిత్రి, ఇం.నెం. 3-11-91, లలితా కుటీర్, ఆర్టిసి కాలనీ, ఎల్.బి. నగర్, హైదరాబాద్.
ఫోన్ : 990 894 8649



**బి.ఎస్. రాములు 'చూపు' నవల - ఒక పరిశీలన.**
రాజు మోరె
వెల : 160 /-
ప్రతులకు : విశాల సాహిత్య అకాడమీ, 201, సులేఖ గోల్డెన్ టవర్స్, 2-2-186/53/5, ఆర్కె నగర్, బాగ్ అబర్ పేట,, హైదరాబాదు - 500 013. ఫోన్ : 8331966987



**రామచంద్రామృతం (డా. లింగంపల్లి రామచంద్ర అశీతిపూర్తి అభినందన సంచిక)**
సం. డా. పోరెడ్డి రంగయ్య
వెల : 500/-
ప్రతులకు : డా. లింగంపల్లి రామచంద్ర, గుండ్లగూడెం గ్రామం, ఆలేరు మండలం - 508 101. యాదాద్రి భువనగిరి జిల్లా.
ఫోన్ : 93812 36903

# ఉర్వారుక మివ బంధనాత్....

మూసీ మాస పత్రిక ప్రస్థానంలో మరో మార్పు ఏర్పడుతుంది. 1980 లో ప్రారంభించిన బి.ఎన్.శాస్త్రిగారు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని కొంతకాలం పాటు పత్రికను నడిపి మధ్యలో ఆపివేయాల్సి వచ్చింది. మళ్ళీ ప్రారంభం అయినప్పటి నుండి ఇప్పటి దాకా ఆగకుండా సాగుతూ వచ్చింది. 40 పేజీల సంచిక, న్యూస్ ప్రింట్‌తో ప్రారంభమైన మూసీ ద్వితీయ ప్రస్థానం రెండు మూడు ప్రత్యేక సంచికలను కూడా ప్రచురించింది. కొన్ని పుస్తక ప్రచురణలకు కూడా వేదికైంది. ఎందరో పెద్దల ఆశీస్సులు నోచుకుంది. ప్రముఖులు కాళోజీ, గుంటూరు శేషేంద్ర శర్మ, జ్వాలాముఖి వంటి వారెందరో మూసీకి ఇంటర్వ్యూలు ఇచ్చినారు. ఆరుద్ర మరణానంతరం ఒక మాసంలోనే ప్రత్యేక సంచిక ప్రచురించాం. ఎన్నో రకాల సుఖదు:ఖాలు... అయినా తమ వ్యాసాలు, కవితలు ప్రచురింపబడిన వారి ముఖంలోని ఆనందమే మాకు పెట్టుబడిగా మారింది. శ్రమ ఇట్టే మాయం అయ్యేది. ఆర్థిక సమస్యలను ఒకరిద్దరు తప్ప ఎవ్వరూ ఆదుకోలేదు. వారు మాత్రం ఎంతవరకు ఉపయోగపడతారు. అప్పుడప్పుడు వారికి గుర్తు వచ్చినప్పుడు, తోచినప్పుడు తోచినంత సహకారం మాత్రమే. ప్రకటనలు తీసుకు రాగలిగే శక్తి మాకూ అంతంత మాత్రమే అయింది. ప్రయత్నాలు మాత్రం చేశాము. వ్యాపార సంస్కృతి నేర్చుకోలేక పోయాము.

క్రమంగా కేంద్ర ప్రభుత్వాల నిర్ణయాదులకు అనుగుణంగా 60 పేజీల సంచికను ప్రారంభించాం. వైట్ పేపర్‌పై ప్రచురణ మొదలు పెట్టాం. ఎన్నో వ్యాసాలు ప్రచురించబడ్డాయి. సీరియల్స్ మరెన్నో.. ఎన్నో. వారి వారి పుస్తకాలు కూడా ప్రచురించబడినాయి. మూసీలో ప్రచురించబడిన వ్యాసాలను ఇతర రాష్ట్రాల్లో పాఠ్యభాగాలుగా కూడా తీసుకున్న గౌరవమూ దక్కింది.

**అక్షరం ప్రచురించబడుతుందనే భావన అందరికీ ఉండి, వారే రాస్తున్నామనుకునే రచయితలకు ... ప్రచురించబడిన కాగితం ఎంత ఒత్తిడికి లోనవుతుందో అర్థం కాదు... కాగితమే కదా అనుకున్నవారూ ఉన్నారు. కాగితమే లేకుంటే ... అక్షరం ఎక్కడ?? అయినా పత్రిక ఆగకుండా సాగుతూనే వస్తుంది.**

ఇప్పుడు ప్రింట్ అయిన పత్రికను పోస్ట్ చేయాలంటే పోస్టల్ వారి పర్మిషన్స్ లేవు. 2026 జనవరి నుండి ఉండవు. ఇప్పటికే పోస్ట్ చేయాలంటే మా విద్యార్థులు, సన్నిహితులు ప్రతి మాసం కుటీర పరిశ్రమలాగా చేసేవారు. వారి శ్రమను ఎంతో దోచుకున్నాం కూడా. వారికెంత కృతజ్ఞత చెప్పినా తక్కువే. పోస్టల్ వారి లీలలు, బాధలు ఊహించలేము. వాళ్ళ వల్ల మేం పడకూడని తిట్లన్నీ పడ్డాం. అది చేరకూడని ప్రదేశాలకు చేరేది... చేరాల్సిన ప్రదేశాలకు వెళ్ళకపోయేది. దానికి కారణం మేమే అని అందరూ భావించేవారు. ఇప్పటికి దాదాపు పది సంవత్సరాలుగా ఉచిత కాపీలను తీసుకుంటున్న వారు కూడా ఉన్నారు. వారు ఏ రూపంలోనూ మూసీకి సహకరించాలన్న భావనే పెంచుకోలేదు. అది వారి గౌరవం అనుకున్నారు. అంతే... మేమూ ఎవరినీ ఎప్పుడూ ఏమీ అడగలేదు కూడా. మా ఆత్మగౌరవాన్ని ఎప్పుడూ తగ్గించుకోలేదు. ఇలా కొనసాగుతూ వచ్చింది.

ప్రస్తుతం ఎవరి వ్యాసాలను వారు కూడా చదవని దశ ఒకటి వచ్చింది. వారి వారి అభివృద్ధి కోసం వ్యాసాలు రాస్తున్న వారే కాని, సహజంగా వ్యాసాలు రాస్తున్న వారు చాలా చాలా అరుదుగా ఉన్నారు. ఐఎస్ఎస్ఎన్ సంఖ్యతో పత్రిక ప్రచురణ జరిగినా.. యూజీసీ కేర్ లిస్ట్‌లో ఉండినా ... కేవలం అవసరార్థం వ్యాసాలు రాసేవారు, తమ ప్రచురణ అవసరాలకోసం ప్రింటింగ్‌కోసం రికమెండ్ చేయించుకునే వారే తప్ప ... వ్యాసాలు సహజంగా రాసే వారే కరువైనారు. బుక్ కల్చర్ నుండి లుక్ కల్చర్ వచ్చింది.

వ్యాసాల క్వాలిటీలో లోపాలు వస్తుంటే మమ్మల్ని చదివి హెచ్చరించే ... ఆచార్య బిరుదురాజు రామరాజుగారు, ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు, ఆచార్య రవ్వా శ్రీహరి గారు, ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య గారు, డా. రాళ్ళబండి కవితా ప్రసాద్ గారు వంటి వారు ఇప్పుడు మళ్ళీ రాలేరు కదా! ఇప్పటికీ సూచనలు చేస్తున్న డా. కె.వి. రమణాచారి గారు, డా. శ్రీరంగాచార్య గారి లాంటి పెద్దల అధ్యయన శీలతకు నమస్సులు పెట్టకుండా ఉండలేము కూడా.

**మూసీ మరో దశలోకి జనవరి 2026 నుండి అడుగు పెడుతుంది. ఇప్పటినుండి కేవలం ఆన్‌లైన్ మాగజైన్‌గా మాత్రమే మారుతుంది. పత్రిక ఏమీ ఆగడం లేదు. ప్రింటింగ్ మాత్రం ఆపివేస్తుంది. నరవర నీచే .. నాచే .. అనే పద్యం లాగా ఈ మార్పుకు ఎన్నో కారణాలు. కారణాలు చెప్పి ఎవరినో నిందించడం కానే కాదు. వినియోగం తగ్గిపోయిందనే భావనే బాధ. ఇప్పటి నుండి ఎవరి వ్యాసాలు వారికి కావాలంటే ఆన్‌లైన్‌లో చూసుకుని ప్రింట్ తీసుకోవాలి అంతే. ఇక తప్పదు. అందుకే ప్రింట్ పత్రిక బంధనం నుండి విడివడుతున్నాం. దాని ద్వారా చాలా సమస్యలకు దూరం అవుతున్నాం అని అనుకుంటున్నాం. భవిష్యత్తు ఎలా ఉంటుందో కాలమెరుగును... ధారుణీ గర్భమెరుగు...** అందరికీ నమస్కారం.. **సంపాదకులు**

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month Date of Posting 5th / 6th of Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001.

# కుంభాభిషేక మహోత్సవ
# ఆహ్వానం

**తేది : 23.01.2026 శుక్రవారం**
**నుండి 01.02.2026 ఆదివారం వరకు**



## శ్రీ హరిహర త్రిశక్తి క్షేత్రము

నవాలయ ఆవరణము, శ్రీవిద్యాపురము, వలిగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా

నిర్వహణ : **వేదసంస్కృతి పరిషత్**

From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma